భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ట్రంప్ భజన తప్ప మోదీ ఏమి సాధించినట్లు?
బిజెపిపై కాంగ్రెస్ బిసి అస్త్రం
మరో ముగ్గురు బందీల విడుదల
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 79 | ఆదివారం | 16-02-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


03

నేటినుంచి మరోసారి
## కులగణన సర్వే

- టోల్ ఫ్రీ నెం. 040 - 21111111
- కాల్ చేస్తే ఇంటివద్దే వివరాలు నమోదు
- ఉదయం 9 నుంచి 6 గంటల వరకు సర్వే


03

ఎమ్మెల్సీ కోడ్ లేనిచోట
## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేయాలి
- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా
## 18, 19న నిరసనలు
03

- జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో ఎక్కడికక్కడ తెలియజేయాలని వామపక్ష పార్టీల పిలుపు

ప్రభుత్వం దిగిరాకపోతే రాష్ట్రవ్యాప్తంగా
## నిరవధిక 'ఆటో' బంద్
03

# ఎక్కడా లెక్క తప్పలే


ఫైల్ ఫొటో

- కులగణన బిల్లును పార్లమెంటుకు తీసుకువస్తాం
- రాజకీయ జోక్యం లేకుండా బడ్జెట్ సమావేశంలో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెడతాం
- కావాలనే ప్రతిపక్షాల రాద్ధాంతం
- ఢిల్లీలో జర్నలిస్టుల ఇష్టాగోష్టిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతో భేటీ
- రాష్ట్రంలో జరిగే బహిరంగసభకు రావాలని ఆహ్వానం

ప్రధానిని కించపరచలేదు
మోదీ పుట్టకతో బిసి కాదని మాత్రమే చెప్పా

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికి రోడ్‌మ్యాప్‌గా నిలువనుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. కులగణనపైన ప్రతిపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని, ప్రజలను ఉద్రేకపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణనను పూర్తి శాస్త్రీయ పద్ధతిలో చేపట్టిందని, రాజకీయ కోణంలో కాదని, ప్రజా సంక్షేమ కోణంలోనే కులగణన జరిగిందని, ఎక్కడ లెక్క తప్పలేదని వివరించారు.కులగణన బిసి బిల్లును పార్లమెంటుకు తీసుకొస్తామని, బడ్జెట్ సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెడుతామని, వర్గీకరణలో విషయంలో రాజకీయ జోక్యం లేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే బహిరంగ సభకు ఎఐసిసి అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీని ఆహ్వానించినట్టు వివరించారు. కొంతమంది తనపైన అబద్ధపు ప్రచారాలు చేసి, పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని 'టెన్ జన్ పథ్' లోని కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ నివాసంలో రాహుల్ గాంధీతో శనివారం భేటి అయ్యారు. ఈ సందర్భంగా తరువాయి 2లో

> పార్టీ మారిన ఎంఎల్‌ఎల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఉంటుందో చూడాలి. కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటాం. పార్టీ ఫిరాయింపుల కేసులో సుప్రీంకోర్టు తీర్పు కంటే ముందే, బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఏదేదో చెబుతున్నారు. గతంలో సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు ఏ రాజకీయ పార్టీలో గెలిచి, ఏ రాజకీయ పార్టీలో మంత్రులుగా పనిచేశారు?
>
> – సిఎం రేవంత్‌రెడ్డి

మాటల్లో కాదు
# చేతల్లో చూపాలి

- దేశంలో ప్రతిభకు కొదవలేదు
- యువత ఉపాధి కల్పనకు ఆధునిక సాంకేతిక ఆధారంగా ఉత్పాదక రంగం బలపడాలి
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ :** దేశంలో ప్రతిభకు కొదవకు లేదని, యువతకు ఉపాధి కల్పించాలంటే ఆధునిక సాంకేతికత ఆధారంగా ఉత్పాదక రంగం బలపడాలని, దానిని మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. శనివారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ డ్రోన్ల ఉత్పత్తితో చైనా ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందని, ఈ రంగంలో పోటీని తట్టుకుని నిలబడాలంటే భారత్ సరికొత్త వ్యూహాన్ని రూపొందించుకోవాలని సూచించారు. 'డ్రోన్లు యుద్ధప్రాతిపదికన విప్లవాత్మక మార్పులు తెచ్చాయని, బ్యాటరీలు, మోటార్లు, ఆప్టిక్స్ ఇందుకు తోడ్పాటు నందిస్తున్నాయని, యుద్ధ రంగంలో యుక్తులు, సమాచారం అందజేసేందుకు అనూహ్య తరువాయి 2లో



- జిఎస్‌టి రూపంలో ప్రజలు చెల్లిస్తున్న డబ్బునే ప్రభుత్వాలు వినియోగిస్తున్నాయి
- ఎవరిసొమ్ము ఎవరు తింటున్నారో తేల్చాలి
- దీనిపై అన్ని వర్గాలతో త్వరలో రౌండ్‌టేబుల్ సమావేశం
- సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఉచితాలపై మాట్లాడడం దురదృష్టకరం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

సంక్షేమ పథకాలు
# ఉచితాలు ఎలా అవుతాయ్?

ప్రజాపక్షం/హైదరాబాద్

పేదలు తమ రుధిరాన్ని ధారపోసి సంపదను సృష్టిస్తూ, జిఎస్‌టి రూపంలో చెల్లిస్తున్న డబ్బులనే ప్రభుత్వాలు, తిరిగి ప్రజలకు సంక్షేమం కోసం వినియోగిస్తున్నాయని, అలాంటి సంక్షేమ పథకాలు ఎలా ఉచితాలు అవుతాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఈ దేశంలో ఎవరి సొమ్ము ఎవరూ తింటున్నారో తేల్చాల్సిన సమసయం ఆసన్నమైందన్నారు. ఈ అంశంపై సిపిఐ ఆధ్వర్యంలో త్వరలో అన్ని వర్గాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం, మగ్ధూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉచితాలు తరువాయి 2లో

బిసిల్లో ముస్లింలను కలిపితే
# కేంద్రం ఆమోదించదు

కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్ :** ప్రధాన మంత్రి మోదీది ఏ కులం? రాహుల్ గాంధీది ఏ మతం అనే అంశాలపై చర్చకు తాము సిద్ధమని, ఇదే అంశాన్ని రెఫరెండంగా భావిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లోకి వెళదామా? అంటూ కాంగ్రెస్ పార్టీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. కుల గణన తప్పుల తడక, బిసి జాబితాలో ముస్లింలను కలపడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత నెలకొందని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు తరువాయి 2లో

అణగారిన వర్గాలో చైతన్యం రగిలించిన
# అవిశ్రాంత పోరాట యోధుడు

- ధర్మభిక్షం అంటేనే మిలిటెంట్ ఉద్యమాలకు పెట్టింది పేరు
- తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక భూమిక
- జయంతి వేడుకల్లో కొనియాడిన వక్తలు



ప్రజాపక్షం/హైదరాబాద్ /అబ్దుల్లాపూర్‌మెట్

సిపిఐ అగ్రనాయకులు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం సమ సమాజమే లక్ష్యంగా, అణగారిన వర్గాల్లో చైతన్యం రగిలించిన అవిశ్రాంత పోరాట యోధులు అని పలువురు సిపిఐ నాయకులు కొనియాడారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో శనివారం స్వాతంత్ర్య సమరయోధులు, గీతపనివారల సంఘం వ్యవస్థాపకులు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , తెలంగాణ రాష్ట్ర గీతపనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు తరువాయి 12లో

గులాబీ పార్టీలో
# గుబులు




సిఎం ఢిల్లీ పర్యటనతో 'కారు'లో హైరానా..!
సిఎల్‌పిలో బిఆర్‌ఎస్‌ఎల్‌పి విలీమవుతుందా అనే అనుమానాలు?

ప్రజాపక్షం/హైదరాబాద్

పార్టీ ఫిరాయింపుల అంశం బిఆర్‌ఎస్ వర్గాల్లో ఆందోళనకు గురిచేస్తోంది. సిఎల్‌పిలో బిఆర్‌ఎస్ ఎల్‌పి విలీనం జరుగుతుందని సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తాజాగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనతో చర్చనీయంశంగా మారింది. ఎఐసిసి అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ, మరోవైపు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మార్పు నేపథ్యంలో బిఆర్‌ఎస్‌ఎల్‌పి విలీనంపైన రకరకాల ఊహాగానాలు, ప్రచారాలు జోరందుకున్నాయి. ఇప్పటికే పార్టీ వీడిన పది మంది బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలపైన అనర్హత వేటు పడుతుందని, త్వరలోనే ఉప ఎన్నికలు వస్తాయని బిఆర్‌ఎస్ బలంగా ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో బిఆర్‌ఎస్‌ఎల్‌పి విలీనం గులాబీ నేతల్లో హైరానా మొదలైంది. ఎంఎల్‌ఎలు, పార్టీ నాయకులను 'కారు ' దిగకుండా బిఆర్‌ఎస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. కొంత కాలంగా జిల్లాల వారీగా ముఖ్యమైన నాయకులతో ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ పలు మార్లు సమావేశమై వారికి భరోసానిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపైన ప్రజల్లో వ్యతిరేకత పెరిగితే, బిఆర్‌ఎస్ మరోసారి అధికారంలోనికి వస్తుందని తరువాయి 2లో

మేఘా కంపెనీపై
# సైబర్ దాడి

నకిలీ ఈమెయిల్ ద్వారా రూ.5.47 కోట్లు కొల్లగొట్టిన నేరగాళ్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

సైబర్ నేరస్తులు మేఘా కంపెనీపై పడ్డాయి. నకిలీ ఈమెయిల్ ద్వారా రూ. 5.47 కోట్లు కొట్టేశారు. ఈ మేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు మెగా కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల తరువాయి 12లో






# సైబీరియా అతిథి అలిగిందా!

- వేల కిలోమీటర్లు దాటి జనవరిలో ఖమ్మం జిల్లా చింతపల్లికి వచ్చే మంచు కొంగ
- శతాబ్దానికి పైగా కొనసాగిన ఆనవాయితీ
- నాలుగేళ్లుగా ఇటువైపురాని వైనం
- పట్టించుకోని అటవీశాఖ

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్

శతాబ్దకాలం పైబడి సైబీరియా కొంగలకు విడిది నిచ్చిన చింతపల్లి ఇక అందమైన జ్ఞాపకంగా మిగిలిపోనుందా? అంటే ఔననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా కొంగలతో సందడిగా ఉండే ఆ ఊరు నాలుగేండ్లుగా పక్షుల చప్పుడు లేక మూగబోయింది. పచ్చనిపంట పొలాలు, కూరగాయల తోటలు, రమణీయమైన చెరువు, చింతచెట్ల తోపులు, గ్రామస్థులు విధించుకున్న కట్టుబాట్లపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి అత్యంత శీతల ప్రదేశమైన సైబీరియ నుంచి కొంగలు రాకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడద, చింతచెట్ల నరికివేత, అటవీశాఖ అధికారుల పట్టింపు లేకపోవడంతోనే తమ స్వర్గధామంపై ముఖం చాటేశాయని ఆవేదన చెందుతున్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని రూరల్ మండలంలో పచ్చని ప్రకృతి అందాలను నింపుకున్న చింతపల్లి గ్రామం ఉంది. ఇక్కడికి సైబీరియా నుంచి వందలాది కొంగల గుంపు జనవరిమాసంలో వచ్చి జూన్‌లో తిరిగి వెళుతుంటాయి. వీటి రాకకు ముందు గ్రామానికి పైలెట్ కొంగలు వచ్చి వాతావరణ పరిస్థితులను గమనించుకుని వెళ్తాయి. తమ జీవికకు అంతా అనుకూలంగా ఉన్నట్లు భావిస్తే మిగతా కొంగల గుంపును మూడు విడతలుగా తీసుకువస్తాయి. ఇవి రెండు అడుగుల ఎత్తు తరువాయి 12లో

# జాప్యం, నిర్లక్ష్యం సహించం

- నీటిపారుదల పనుల పరిరక్షణ మరింత మెరుగుపరచాలి
- పారదర్శకత, సమగ్రత పెంచాలి
- నీటి నిర్వహనలో రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలపై సమగ్ర నివేదిక
- అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాజస్థాన్‌లో జరగనున్న 'జాతీయ స్థాయి నీటిపారుదల శాఖ మంత్రుల సదస్సు' నేపథ్యంలో నీటి పారుదల రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, డిజిటల్ మానిటరింగ్,ఆధునిక నీటి నిర్వహణ విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మైక్రో ఇరిగేషన్ అమలు తీరుపై 'జాతీయ స్థాయి'లో గణాంకాలతో ప్రదర్శించేందుకు అవసరమైన సమాచారాన్ని సేకరించలన్నారు. నీటి పారుదల పనుల పర్యవేక్షణను మరింత మెరుగుపరచాలని, పారదర్శకత, సమర్థత పెంచాల్సిన అవసరం ఉన్నదని, పనులలో జాప్యం, లేదా నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆయన హెచ్చరించారు. ఈ నెల 18,19వ తేదీలలో రాజస్థాన్‌లో జరగనున్న 'అఖిల భారత నీటిపారుదల మంత్రుల సదస్సు', అలాగే ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఎస్.ఎల్.బి.సి,డిండి, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌తో పాటు తరువాయి 2లో

### యుఎస్ నుంచి అమృత్‌సర్‌కు..

# నేడు రెండో విడత వలసదారులు



**వాషింగ్టన్ :** సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా లేదా వీసా గడువు ముగిసినప్పటికీ స్వదేశానికి వెళ్లకుండా అక్కడే ఉన్న విదేశీయులను అమెరికా ప్రభుత్వం వెనక్కు పంపుతున్న విషయం తెలిసిందే. ఈ జాబితాలో భారతీయులు కూడా ఉన్నారు. మొదటి విడతగా 104 మందిని అమెరికా ప్రభుత్వం భారత్‌కు పంపింది. కాగా, 119 మందితో కూడిన రెండో విమానం ఆదివారం అమృత్‌సర్ (పంజాబ్) చేరుకోనుంది. వీరిలో అత్యధికంగా 67 మంది పంజాబ్‌కు చెందిన వారే. హర్యానా నుంచి 33 మంది, గుజరాత్ నుంచి 8 మంది, ఉత్తరప్రదేశ్ నుంచి ముగ్గురు, రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి చెరి ఇద్దరితోపాటు జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఒకొక్కరు చొప్పున ఉన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనను ముగించుకున్న తర్వాత, రెండో విడత వలసదారులను అమెరికా తిప్పిపంపడం గమనార్హం. మానవ అక్రమ రవాణాను నిరోధించడానికే తమ దేశంలో అక్రమంగా ఉంటున్న వారిని వెనక్కు పంపుతున్నామని ట్రంప్ అంటున్నారు. కాగా, తొలి విడతలో భారత్‌కు పంపిన వారి చేతికి బేడీలు వేయడంపై సర్వత్రా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయితే, తిరుగు ప్రయాణంలో వారు పారిపోకుండా ఉండడానికి తమ చట్ట పరిధిలో ఈ చర్య తప్పదని అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) స్పష్టం చేసింది. రెండో బ్యాచ్ వారితోనే అదే రీతిలో వ్యవహరిస్తారా? లేక మోదీ పర్యటన, ట్రంప్‌తో చర్చల తర్వాత పరిస్థితి ఏమైనా మారుతుందా? అనేది ఆసక్తి రేపుతున్నది.

# విద్యార్థులు Vs ప్రభుత్వ అనుకూలవర్గాలు





సెర్బియాలో పోటాపోటీ ర్యాలీలు

**క్రగుజెవాక్ (సెర్బియా) :** అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థులు... ప్రభుత్వ విధానాలను సమర్థిస్తున్న అనుకూల వర్గాల పోటాపోటీ ర్యాలీలతో సెర్బియా నగరం క్రగుజెవాక్ హోరెత్తిపోయింది. గత ఏడాది నవంబర్ ఒకటోతేదీన, నొవిసాద్ నగరంలోని రైల్వే స్టేషన్ కుప్పకూలడంతో 15 మంది మృతి చెందిన ఘటనపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అవినీతి కారణంగానే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తున్నారు. కొంతకాలంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ఈనెల 15వ తేదీ శనివారం భారీ ర్యాలీకి పిలుపునివ్వడంతో, వేలాది మంది తరలి వచ్చారు. 1835 ఫిబ్రవరి 15న, అప్పటికి ఒట్టామన్ సామ్రాజ్యంలో భాగమైన క్రగుజెవాక్ ప్రాంతంలో స్థానికులు కొత్త రాజ్యాంగాన్ని ప్రకటించుకున్నారు. అప్పటి నుంచి అదే రోజులు 'స్టేట్‌హుడ్ డే'గా నిర్వహిస్తున్నారు. అందుకే, ఆ రోజునే ర్యాలీ జరపాలని విద్యార్థి నాయకులు నిర్ణయించారు. కాగా, సెర్బియాలో బలమైన నాయకుడిగా పేరున్న దేశాధ్యక్షుడు అలెక్సాండర్ ఉసిక్‌పై వస్తున్న ఆరోపణలను ఆయన మద్దతుదారులు ఖండిస్తున్నారు. ప్రభుత్వం ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని వాదిస్తున్నారు. విద్యార్థుల ఉద్యమానికి సమానంతరంగా వారు కూడా 'ప్రభుత్వ అనుకూల' ఉద్యమాన్ని చేపట్టారు. పోటీ ర్యాలీ నిర్వహించడంతో క్రగుజెవాక్‌తోపాటు పరిసర ప్రాంతాల్లోనూ తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పాశ్చాత్య దేశాలు తమ ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు కుట్ర జరుపుతున్నాయని ఉసిక్ ఆరోపించారు. సంప్రదాయ జాతీయవాదాన్ని ఆయన తన ప్రకటనలో మరోసారి వినిపించారు.






మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ (జర్మనీ)కు హాజరైన భారత విదేశాంగ మంత్రి జైశంకర్ శనివారం ఉక్రేన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహాతో సమావేశమైన దృశ్యం. రష్యా–ఉక్రేన్ యుద్ధంపై చర్చించామని, అదేవిధంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల గురించి కూడా పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నామని జైశంకర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఉక్రేన్‌ను భారత వ్యూహాత్మక భాగస్వామిగా ఆయన అభివర్ణించారు.

# మరో ముగ్గురు బందీల విడుదల



**ఖాన్ యూనిస్ (గాజా స్ట్రిప్) :** కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా గాజాలో పరిస్థితులు కొంత ఉద్రిక్తంగానే ఉన్నప్పటికీ, ఇజ్రాయెల్, హమాస్ మధ్య బందీల విడుదల అంశం దశలవారీగా అమలవుతున్నది. తాజాగా ముగ్గురు ఇజ్రాయిలీలను హమాస్ విడుదల చేసింది. ఇజ్రాయెల్–అర్జెంటీనా ద్వంద్వ పౌరసత్వం ఉన్న ఐయార్ హోర్న్ (46), ఇజ్రాయెల్–అమెరికా పౌరసత్వం ఉన్న గుయ్ డెకెల్ చెన్ (36), ఇజ్రాయెల్–రష్యా పౌరసత్వం గల అలెగ్జాండర్ (సషా) ట్రౌఫనొవ్ (29)లను హమాస్ ప్రతినిధులు తొలుత వీధుల్లో ఊరేగించారు. వారిని అక్కడి ప్రజలకు చూపుతూ చిన్నపాటి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారిని విడుదల చేశారు. ఇజ్రాయెల్ కూడా కొంతమంది యుద్ధ ఖైదీలను విడుదల చేసింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ వద్ద 369 మంది పాలస్తీనియన్లు ఖైదీలుగా ఉన్నారు. వీరిలో 36 మందికి జీవిత ఖైదు కూడా విధించారు. ఈ ఏడాది జనవరి 19 నుంచి కాల్పుల విరమణ అమలుకాగా, ఇజ్రాయెల్ శనివారం నాటికి ఇజ్రాయెల్ 730 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. తాజాగా మరో 21 మందిని ఇజ్రాయెల్ విడుదల చేసింది. ఇలావుంటే, మిగతా ఖైదీల విడుదలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హమాస్ ప్రకటించింది. మధ్యవర్తిత్వం జరుపుతున్న ఈజిప్టు, ఖతార్ దేశాలపై సంపూర్ణ విశ్వాసం ప్రకటించింది. ఆ దేశాల ప్రతినిధులతో మరోసారి చర్చించిన తర్వాత, తదుపరి విడుదల షెడ్యూల్ ఖరారు చేస్తామని హమాస్ నేతలు తెలిపారు. ఇలావుంటే, కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఇజ్రాయెల్ దళాలు ఒకటిరెండు పర్యాయాలు ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించాయి. మరోవైపు లక్షలాది మంది పాలస్తీనియన్లను గాజా స్ట్రిప్ నుంచి ఇతర ప్రాంతాలకు పంపిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన కూడా కాల్పుల ఒప్పందం అమలుపై అనుమానాలకు తావిస్తున్నది. ఈ నేపథ్యంలో, బందీల విడుదలపై ఇజ్రాయెల్ వైఖరి మారే ప్రమాదం లేకపోలేదన్న వాదన వినిపిస్తున్నది.

## గుబులు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ శ్రేణుల్లో విశ్వాసాన్ని కల్పించేందుకు ఆ పార్టీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పార్టీ మారే ఎంఎల్ఎలలో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన మాజీ మంత్రుల పేర్లు ప్రస్తావనకు వస్తున్నాయి. ఈ క్రమంలోనే కొంత కాలంగా హైదరాబాద్‌కు చెందిన ఒక మాజీ మంత్రి అధ్యక్షతనే తెలంగాణ భవన్‌లో పలు పార్టీ కార్యాక్రమాలను నిర్వహిస్తున్నట్టు ప్రచారం జరిగింది. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ నెల 19న తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ కార్యవర్గ విస్తృత సమావేశాన్ని కూడా నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో కెసిఆర్ దిశానిర్దేశం చేయనున్నట్టు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇటువంటి సమయంలో మరో 16 మంది ఎంఎల్ఎలు పార్టీని వీడుతారని ప్రచారం బిఆర్ఎస్ వర్గాల్లో ఉత్కంఠత నెలకొన్నది. పార్టీ ఫిరాయింపుల పైన సుప్రీం కోర్ట్ తీర్పు రాకముందే, బిఆర్ఎస్ఎల్‌పిని సిఎల్‌పిలో వీలీనం చేసే అవకాశాలు లేకపోలేదని కొందరు రాజకీయ నాయకులు అంచనా వేస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా సిఎల్‌పిని బిఆర్ఎస్ఎల్‌పిలో విలీనం చేసినట్టుగానే ప్రస్తుతం కూడా అదే విధానాన్ని కొనసాగించేందుకు చర్చలు జరుతున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది.

**పొలిటికల్ మైండ్‌గేమ్ :** ఒక వైపు సిఎల్‌పిలో బిఆర్ఎస్ఎల్‌పిని విలీనం అవుతోందని ప్రచారం జరుగుతుంటే, మరో వైపు సిఎం పదవి నుంచి రేవంత్‌రెడ్డిని మారుస్తున్నారని, ఆయనపైన 25 నుంచి 30 మంది ఎంఎల్ఎలు అసంతృప్తిగా ఉన్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వ్యాఖ్యలు చేశారు. ఇలా పార్టీ ఫిరాయింపులు, విలీనాలపై ఎవరికివారే పొలిటికల్‌మైండ్‌గేమ్ ఆడుతున్నారు. ఇందులో ఏది నిజం?, ఏది అబద్ధమనేది బిఆర్ఎస్ వర్గాల్లో అయోమయానికి గురి చేస్తోంది.

ప్రభుత్వ విధానాలపైన ఆ పార్టీ ముఖ్యనేతలు ఎంత దూకుడు పెంచినప్పటికీ కొందరు ఎంఎల్ఎలు, ముఖ్యనాయకులలో విశ్వాసాన్ని కల్పించలేకపోతున్నదనే వాదన వినిపిస్తోంది. ప్రధాన ప్రతిపక్ష నేతగా కెసిఆర్ పార్టీ కార్యాక్రమాల్లో పాల్గొనకపోవడం, ఎప్పుడో ఒక్కసారి కొందరు ముఖ్య నేతలతో మాట్లాడిన వీడియోలను విడుదల చేయడం కూడా పార్టీకి చెందిన ముఖ్య నాయకుల్లో విశ్వాసం సన్నగిల్లిందుకు ఒక కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## చేతల్లో చూపాలి

(మొదటి పేజీ తరువాయి)

మార్గాలలో డ్రోన్లు ఉపకరిస్తున్నాయన్నారు. బలమైన పారిశ్రామిక వ్యవస్థతోనే ఇది సాధ్యమన్నారు. దురదృష్టవశాత్తు ప్రధాని మోదీ దీనిని గ్రహించలేకపోయారని, కృత్రిమ మేధపై ప్రధాని అనువాద ప్రసంగాలతో సరిపెడుతుంటే, మన పోటీదారులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఎంతో ముందున్నారన్నారు. భారత్‌కు దృఢమైన పారిశ్రామిక ఆధారం కావాలని, కేవలం మాటలు సరిపోవని రాహుల్ ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'భారత్‌లో ప్రతిభ, బుద్ధి కుశలతకు కొదవ లేదు. ఒక స్పష్టమైన దృక్కోణం అవసరం. బలమైన పారిశ్రామిక వ్యవస్థ సృష్టిస్తే యువతకు ఉపాధి కల్పించవచ్చు. భారత్‌ను సగర్వంగా భవిష్యత్తులోకి నడిపించవచ్చు' అని రాహుల్ తన సందేశంలో పేర్కొన్నారు. ఇందులో డ్రోన్ సాంకేతికతపై తొమ్మిది నిమిషాల విడియోనుకూడా జతచేశారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు సందర్భంగా నూతన సాంకేతికతపై తాను పేర్కొన్న వివరాలనుకూడా గుర్తుచేశారు. డ్రోన్లు యుద్ధ రంగంలో ఎలాంటి విప్లవాత్మక మార్పులు తెచ్చాయో తన వీడియో సందేశంలో వినిపించారు. 'డ్రోన్లు కేవలం ఒక సాంకేతికత మాత్రమే కాదు. బలమైన పారిశ్రామిక వ్యవస్థ నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిన్నస్థాయి ఆవిష్కరణ. యుద్ధ ట్యాంకులు, ఫిరంగులు, యుద్ధ విమానాలు, విమానవాహక నౌకల పాత్రను డ్రోన్లు చాలావరకు తగ్గించి యుద్ధరంగ వాతావరణాన్నే మార్చేశాయి. అయితే ఈ మార్పు కేవలం యుద్ధరంగానికే పరిమితం కాదు. పరిశ్రమలు, కృత్రిమ మేధ, భావితరాల సాంకేతికకు కూడా ఉపకరించనున్నాయి' అని రాహుల్ తెలిపారు. 'దురదృష్టవశాత్తు ఈ విప్లవాత్మక పరిణామాన్ని గుర్తించడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారు. కృత్రిమ మేధపై అనువాద ప్రసంగాలను చేయడంలో ఆయన తీరికలేకున్నారు. దీనితో మన పోటీదారులు నూతన సాంకేతికను అందిపుచ్చుకోవడంలో ఎంతో ముందుకు వెళ్లిపోయారు. భారత్‌కు ఇపుడు బలమైన పారిశ్రామిక వ్యవస్థ అవసరం. అర్థంలేని ప్రసంగాలు కాదు' అని రాహుల్ గాంధీ అన్నారు. 'ఉత్పత్తిపై మనం అదుపు సాధించకపోతే కృత్రిమ మేధ లేదా సాంకేతికతలో ప్రగతి సాధించలేము. మన వినియోగదారుల డేటాను ఇతరులకు అందుబాటులో ఉంచాము. ప్రపంచం భవిష్యత్‌కు బాటలు వేసుకుంటుండగా కీలకమైన విడిభాగాల ఉత్పత్తిలో మనం వెనుకబడి వాటిని కలిపే ప్రక్రియలోనే ఉండిపోయాము. భారత్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది. సాధించాలన్న తపన ఉంది. అయితే ప్రసంగాలకే పరిమితమైతే సరిపోదు. దానిని ఉపయోగించుకునే స్పష్టమైన ధృక్కోణం అవసరం. భవిష్యత్తును మూలాలనుంచి నిర్మించుకోవాలి. భారత్ వెనుకబడిపోలేదని యువత నిరూపించుకోవాల్సిన సమయమిది' అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ పిలుపునిచ్చారు. ప్రధాని అనువాద ప్రసంగాలకంటె భారత యువత మెరుగైన మార్గదర్శనం కావాలని, రాహుల్ గాంధీ కోరుకునే బలీయమైన పర్యావరణహిత పారిశ్రామికరంగమే దేశాన్ని ముందుకు నడిపిస్తుందని ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఎక్స్‌వేదికగా పేర్కొన్నది.

# హామీలు అమలు చేసే శక్తి కాంగ్రెస్‌కు లేదు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం /నల్లగొండ :** తెలంగాణ రాష్ట్రంలోని మూడు శాసనమండలి ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఉపాధ్యాయ, అధ్యాపకులను కోరారు. శనివారం నల్లగొండలోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే విద్యారంగ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రోజు రోజుకీ దిగజారిపోతుందని, ఆరు గ్యారెంటీలు 420 హామీలు అమలు చేసే శక్తి కాంగ్రెస్ లేదని విద్యార్థులకు 8000 కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్ ఇవ్వాలని ఇంతవరకు విడుదల చేయలేదని గురుకులాలలో విష ఆహారం, పాముకాటు తేలుకాటుకు వందల మంది గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంటర్మీడియట్ చదువుకునే విద్యార్థులకు స్కూటీలు జాడేలేదని మహిళలకు 2500 ఎప్పుడిస్తారని ప్రశ్నించారు రైతుల రుణమాఫీ సంపూర్ణం కాలేదని కౌలు రైతులకు ఆర్థిక సాయం అందలేదని జీవో 317 ద్వారా ఉపాధ్యాయ ఉపాధ్యాయులు చాలా ఇబ్బంది పడ్డారని ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని గెలిపించినట్లయితే ఆర్‌డిఎలు పరిష్కారం దొరుకుతుందని పిఆర్‌సిని సాధించవచ్చని సరోత్తం రెడ్డికి వివిధ అధ్యాపక సంఘాల నుండి, మేధావులు, మద్దతు పలుకుతున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు నాగ వర్షిత్ రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి గంగిడి మనోహర్ రెడ్డి గోలి మధుసూదన్ కాసం వెంకటేశ్వర్లు రెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు నాగవర్షిత్ రెడ్డి మాదగాని శ్రీనివాస్ గౌడ్ పిల్లి రామరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు .

## లెక్క తప్పలే

(మొదటి పేజీ తరువాయి)

ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన సర్వే, ఎస్‌సి వర్గీకరణతో పాటు తాజా రాజకీయ పరిస్థితులను, పాలనాపరమైన అంశాలను రాహుల్ గాంధీకి వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించే బహిరంగ సభలకు రాహుల్‌గాంధీని సిఎం ఆహ్వానించారు. సమావేశానంతరం సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ రాహుల్ గాంధీతో తనకు ఎలాంటి గ్యాప్ లేదని, ఆయన సూచనలు పాటిస్తున్నామని సిఎం చెప్పారు.

**ప్రధానిని కించపర్చలేదు..ఉన్నదే చెప్పాను :** ప్రధాని మోదీని తాను కించపర్చే విధంగా మాట్లాడలేదని, ఉన్నది ఉన్నట్టుగానే చెప్పానని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మోదీ పుట్టుకతో బిసి కాదని మాత్రమే తాను అన్నానని, బిజెపి నాయకులు కూడా ఇదే విషయాన్ని ధృవీకరించారని, కానీ తాను చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వక్రీకరించారని తెలిపారు. మోదీకి నిజంగా బిసిల పట్ల చిత్తశుద్ధి ఉంటే జన గణనలో కులగణన కూడా చేపట్టాలని సిఎం డిమాండ్ చేశారు.

**కొందరు పైశాచిక ఆనందం పొందుతున్నారు :** తనపై అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రతిపక్ష నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాను కొందరికి నచ్చకపోవచ్చని, తనను కొందరు అంగీకరించకపోవచ్చని, అయినప్పటికీ తన పనిని తాను చేస్తున్నానని అన్నారు. ఎవరు ఏమనుకున్నప్పటికీ ఎటువంటి విమర్శలను తాను పట్టించుకోబోనని, టిపిసిసి కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణ తదితర అంశాలపై కొందరు పైశాచిక ఆనందం కోసం ఊహాగానాలను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. తనను ప్రశ్నించే పరిస్థితి తెచ్చుకోబోనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ తరపున ప్రజలకు హామీ ఇచ్చిందే తాను అని, హామీలను అమలు చేయకపోతే , వాటిని అమలు చేయడం లేదని తననే అడుగుతారని సిఎం అన్నారు. మంత్రివర్గ విస్తరణ అనేది తన ఒక్కడి నిర్ణయం కాదని, అధిష్టానం నిర్ణయిస్తుందని చెప్పారు. రాహుల్‌గాంధీ భేటీలో టిపిసిసి కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు.

## కేంద్రం ఆమోదించదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని కులంపై సిఎం రేవంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో శనివారం టూరిజం ప్లాజాలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్లు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని మోడీపై చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.

మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకమన్న బండి సంజయ్ ముస్లింలను బిసి జాబితాలో చేర్చి కేంద్రానికి పంపితే ఆమోదించే ప్రసక్తే లేదని అన్నారు. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ డ్రామాలాడుతోందని ధ్వజమెత్తారు. ప్రజలకు, పిసి సంఘాలకు ఈ విషయం తెలుసునని వ్యాఖ్యానించారు. పది శాతం ఉన్న ముస్లింలను బిసిల్లో కలిపితే కేంద్రం ఒప్పుకోదని అన్నారు. బిసిలను 51 శాతం నుంచి 46 శాతానికి తగ్గించారని ఆయన మండిపడ్డారు. ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వమే మద్దతు ఇస్తోందని ఆరోపించారు. హిందువుల జనాభా తగ్గించి ముస్లిం జనాభా పెంచి చూపిస్తున్నారని బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# ఉచితాలు ఎలా అవుతాయ్?

(మొదటి పేజీ తరువాయి)

తప్పంటూ దేశ ప్రధానినరేంద్ర మోదీ, జయప్రకాశ్ నారాయణ లాంటి కొందరు నాయకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం మాట్లాడుతుంటారని, కానీ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు కూడా ఇలాంటి వ్యాఖ్యాలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ఉచితాల కారణంగా వ్యవసాయ పనుల కూలీలు దొరకడం లేదని, ఇతర పనులకు కూడా ఎవ్వరూ రావడం లేదని ఎంతో మేధావులు, న్యాయకోవిదులైన న్యాయమూర్తులు వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. వారు దేశ ఆర్థిక పరిస్థితులు, సామాజిక స్థితిగతులను అర్థం చేసుకుని మాట్లాడినట్లుగా లేదన్నారు. వ్యవసాయ కూలీలు, కూలీలుగానే ఉండి పోవాలా..?, వారు చదువుకుని ఇతర ఉద్యోగాలు చేయొద్దనేది వారి ఉద్దేశమా? అన్ని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ లాంటి వారందరూ ఫ్యూడల్ వ్యవస్థ నుండి బయటకు రావాలని హితువుపలికారు. పేదలు బాగా చదువుకుని ఆర్థిక పరిస్థితి మెరుగుపడి వారి కొనుగోలు శక్తి పెరిగినప్పుడే ఈ దేశం ఆర్థికంగా పురోగాభివృద్ధి చెందుతుందనే విషయాన్ని దేశ పాలకవర్గం, మేధావివర్గం గుర్తించకపోవడం అత్యంత దురదృష్టకరమని చెప్పారు. ఈ దేశంలో జిఎస్‌టి రూపంలో సుమారు రూ.23 లక్షల కోట్లు సమకూరుతుండగా, ఇందులో 10 శాతం మాత్రమే సంపన్నులదని, మిగితా 90 శాతం ఈ దేశంలోని మధ్యతరగతి, పేద, నిరుపేదలు చెల్లిస్తున్నారని వివరించారు. ఈ 90 శాతం సొమ్మునే కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల నుంచి అప్పనంగా రుణాలు తీసుకుని, ఎగ్గొడితే, మోదీ ప్రభుత్వం రూ.15 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని విమర్శించారు. మోదీ అధికారం చేపట్టిన వెంటనే 30 శాతంగా ఉన్న కార్పొరేట్ పన్నులు 28 శాతానికి తగ్గించి, వారికి ప్రతి ఏటా సుమారు రూ.5 లక్షల కోట్లు లాభం చేకూర్చారని, ఇలాంటి వాటిని ఏమంటారని కూనంనేని నిలదీశారు. దేశంలో 1 శాతం మంది సంపన్నవర్గాల చేతుల్లో 45.5 శాతం సంపద ఉండగా, 10 శాతం ప్రజల వద్ద 80 శాతం సంపద ఉందని, ఈ 80 శాతం సంపదలో 100 కుటుంబాల వద్దే 70 శాతం ఉండడం గమన్హారం అన్నారు. మరో 50 శాతం ప్రజల చేతులో 3 శాతం మాత్రమే ఉన్నదని, ఈ లెక్కల ప్రకారం మొత్తం 1 శాతం ప్రజల వద్దనే 90 శాతం సంపద పోగైందని తెలిపారు. ఈ సంపద ఎలా వచ్చిందో లెక్కలు తేల్చాల్సిన అవసరముందని, దీనిని చర్చ జరపాలని కూనంనేని డిమాండ్ చేశారు.

**దేశ వ్యాప్తంగా కేంద్రం కులగణన చేపట్టాలి :** కేంద్ర ప్రభుత్వం కులగణనను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బిసి జనాభా ప్రకారం రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చట్టం చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బిసి రిజర్వేషన్లను పెంచి చేతులు దులుపుకోకుండా, సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేయాలని సూచించారు. కేంద్ర ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల 18, 19 తేదీల్లో వామపక్ష పార్టీల దేశవ్యాప్త నిరసనలు చేపట్టనున్నాయని, ఇందులో భాగంగా రాష్ట్రంలో ఈనెల 18, లేదా 19వ తేదీన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని సాంబశివరావు వెల్లడించారు.

**స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ చిత్తశుద్ధి చాటుకోవాలి :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పరస్పర అవగాహన అంశంలో కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని చాటు కోవాల్సిన అవసరం ఉన్నదని కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్, ఆప్ ఈ రెండు పార్టీల స్వయంకృతాపరాధం వల్లనే ఢిలీ రాష్ట్రంలో ఓటమి చవిచూడాల్సి వచ్చిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికల నాటికి ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అవసరమైతే అప్పులు చేసైనా ఇచ్చిన హామీలను కొంత మేర నేరవేర్చాలన్నారు. హామీల అమలుకు సంబంధించి శ్వేతపత్రం విడుదల చేసి, ఆ హామీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని, తద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి కూనంనేని సాంబశివరావు సూచించారు.

## జాప్యం, నిర్లక్ష్యం సహించం

(మొదటి పేజీ తరువాయి)

వివిధ ఎత్తిపోతల ప్రాజెక్ట్‌ల పురోగతి హైదరాబాద్‌లోని జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శనివారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యాదాస్‌నాథ్, ఇ.ఎన్.సి అనిల్ కుమార్ సి.ఇలు కె.శ్రీనివాస్, అజయ్ కుమార్, రమేష్ బాబు,శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ముఖ్యమైన నీటి పాలన విధానాలు, తక్కువ వ్యయంతో అధిక ఆయకట్టు విస్తరణ, ఇంకా పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయడం వంటి అంశాలపై సమీక్షలో ప్రస్తావనకు వచ్చాయి. తక్కువ ఖర్చుతో గరిష్ట ఆయకట్టును విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, తక్కువ పెట్టుబడితో అధిక నీటి పారుదల ప్రయోజనాలను అందించే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం అధిక ఖర్చు చేసినప్పటికీ పరిమిత ఫలితాలనే సాధించిందని, ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడం ద్వారా అదనంగా 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తుందని ఆయన వివరించారు. ఎస్‌ఎల్‌బిసి (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాల్వ), దిండీ, పాలమూరురంగారెడ్డి, దేవాదుల, పలు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై అధికారులు సమగ్ర నివేదిక సమర్పించారు. ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు గడువును విధించాలన్నారు.

**నీటి నిల్వలపైన ప్రత్యేక చర్చ :** నీటి నిల్వలను పెంచడంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చర్చించారు. ఆనకట్టల సమర్థవంతమైన నిర్వహణ, నదుల అనుసంధానం, భూగర్భజల భద్రత విధానాలు భవిష్యత్తులో నీటి భద్రతను పెంచడం కీలకమని మంత్రి అధికారులకు సూచించారు. నీటి వినియోగ సామర్థ్యంమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. రైతులు నీటిని సమర్థవంతంగా వినియోగించేందుకు మైక్రోఇరిగేషన్ (డ్రిప్, స్ప్రింక్లర్) విధానాలను విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా రాజస్థాన్‌లో జరిగే సదస్సులో నీటి పాలనను బలోపేతం చేయడం, నీటి నిల్వలను మెరుగుపరచడం, నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచడం వంటి ముఖ్య అంశాలపై చర్చలు జరుగనున్నాయి. కేంద్ర సహాయం, నిధుల పెంపుదలకు, రాష్ట్ర నీటి పారుదల ప్రాజెక్టులకు మరింత సహకారం పొందేందుకు ఈ సమావేశం కీలకంగా మారనుందని ఉత్తమ్ చెప్పారు.

# బిల్డర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సంపూర్ణ సహకారం

తెలంగాణ బిల్డర్స్ గ్రీన్ సమ్మిట్‌లో డిప్యూటీ సిఎం భట్టి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిల్డర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క భరోసానిచ్చారు. హైదరాబాద్ విషయంలో ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేసి, బిల్డర్లను, డెవలపర్లను భయ భ్రాంతులకు గురి చేసి ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిల్డర్లకు హైదరాబాద్ ఒక స్వర్గధామం లాంటిదన్నారు. హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో శనివారం జరిగిన 'తెలంగాణ బిల్డర్స్ గ్రీన్ సమ్మిట్'లో భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బిల్డర్లు, డెవలపర్లను రాష్ట్ర ప్రభుత్వం గౌరవప్రదమైన పౌరులుగా చూస్తుందని, వారు సంపద సృష్టికర్తలుగా, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములుగా భావిస్తున్నామన్నారు. ఆదాయం కంటే హైదరాబాద్ నగర ప్రజల ఆరోగ్యమే తమకు ప్రధానమని, అందుకే హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు పలు విధాన నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. ఢిల్లీ ప్రజలు స్థానికంగా ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారని, ఒక సీజన్‌లో అక్కడి పౌరులు వలస వెళ్లి పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా ఉండేందుకు పలు చర్యలు చేపడుతున్నామని వివరించారు. హైదరాబాద్ నగరంలోని డీజిల్ వాహనాలను దశలవారీగా ఎలక్ట్రికల్ వాహనాలుగా మారుస్తున్నామని, ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని పెంచే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని కూడా తగ్గించుకుని, రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గించేందుకు కూడా వెనుకాడలేదని తెలిపారు. తెలంగాణ ఒక యువ రాష్ట్రమని, ప్రపంచ పటంలో రైజింగ్‌గా కనిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగుతుందన్నారు.

కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫోర్త్ సిటీ హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా, ప్రపంచ కేంద్రంగా ఫోర్త్ సిటీని తీర్చిదిద్దుతున్నామన్నారు. నెట్ జీరో సిటీ నిర్మాణంలో భాగంగా భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయాలు తీసుకుందని ఆయన వివరించారు.

**మూసీ హైదరాబాద్‌కు ఒక వరం ...**

మూసీ పునరుద్ధరణ రాష్ట్ర చరిత్రలో ఒక మైలు రాయి అని, ఈ నదిలో పరిశుభ్రమైన నీరు పారించి, మూసీ హైదరాబాద్‌కు ఒక వరం లాగ మారుస్తామని భట్టి తెలిపారు. హైదరాబాద్ అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని, ఈ క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎంత ఖర్చు అయినా ముందుకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన ఉద్ఘాటించారు. హైదరాబాద్ చుట్టుపక్కల పెట్టుబడులకు సిఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దావోస్‌లో పర్యటించి రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించారని పునరుద్ఘాటించారు. '2029–30' సంవత్సరానికి 20,000 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా కొత్త విద్యుత్ పాలసీలో స్పష్టం చేశామని, 2035 సంవత్సరం నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు పోతున్నామని భట్టి విక్రమార్క అన్నారు.

# నేటి నుంచి 28వరకు మరోసారి సర్వే

'టోల్ ఫ్రీ' నెంబర్

040– 21111111



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ, కుల గణన సర్వేలో పాల్గొనని వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అవకాశాన్ని కల్పించింది. ఆదివారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే ప్రారంభం కానుంది. దీనికి సం బంధించి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సర్వే సాఫీగా, సక్రమంగా సాగేలా జిల్లా కలెక్టర్లు, జిహెచ్ఎంసి కమిషనర్ చూడాలని, స్థానికంగా విస్తృత ప్రచారాన్ని కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. మొదటి విడతలో కులగణన సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం ఇవ్వనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కారణాలతో 3,56,323 కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదని ప్రణాళిక విభాగం తెలిపింది. 'మూడు' పద్ధతుల్లో సర్వే వివరాలను నమోదు చేయనున్నారు.

టోల్ ఫ్రీ నెంబర్‌కు (040–21111111) ఫోన్ చేస్తే, వారే ఇంటికి వచ్చి కుటుంబ వివరాలను నమోదు చేస్తారు. ఈ నంబర్‌ను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ చేయాల్సి ఉంటుంది. 'ప్రజాపాలన సేవా కేంద్రం(పిపిఎస్‌కె)' ఎంపిడిఒ కార్యాలయాలకు వెళ్లి సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. అయితే పట్టణ ప్రాంతాల్లో వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరించేందుకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తులు సమర్పించేందుకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. https://seeepcsurvey.cgg.gov.in. వెబ్‌సైట్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని, ఆ దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసి, స్థానికంగా ఉన్న ఎంపిడిఒ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.

**సర్వేపై అవగాహన కల్పించనున్న బిసి కమిషన్**

కుల గణన సర్వే నేపథ్యంలో ప్రజలలో సర్వే పట్ల అవగాహన కల్పించేందుకు బిసి కమిషన్ చర్యలు చేపట్టింది. స్వయంగా బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌తో పాటు సభ్యులు హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

– బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ కుమ్మరివాడి బస్తీ, చంద్రాయణగుట్ట.

– బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్ మూసారాంబాగ్, శాలివాహన నగర్, మలక్‌పేట్.

– బిసి కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్ క్యూ సిటీ టిఎన్‌జివోస్ కాలనీ వెనుక వైపు వెంకటేశ్వర దేవాలయం గచ్చిబౌలి.

## నమ్మకద్రోహానికి ఎర్రబెల్లి దయాకర్ రావు వారసుడు : బండి సుధాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేసిన వ్యాఖ్యలను టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య యుతంగా పూర్తి మెజారిటీ ఎమ్మెల్యేలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోతుందని దయాకర్ రావు మాట్లాడటం ఆయన అధికార దాహానికి నిదర్శనమని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. తెలంగాణ రాజకీయాల్లో నమ్మకద్రోహానికి ఎర్రబెల్లి దయాకర్ రావు వారసుడని దుయ్యబట్టారు. బండి సుధాకర్ గౌడ్ టిపిసిసి అధికార ప్రతినిధి తెలిపారు. ఆదరించి అందలమెక్కించిన టిడిపిని మోసం చేసి, తమ కుల బంధువులైన ఆనాటి బిఆర్ఎస్ పార్టీ ఎల్‌పిలో టిడిపి ఎమ్మెల్యేలను విలీనం చేసిన ఘనమైన చరిత్ర ఎర్రబెల్లి దయాకర్ రావుదని మండిపడ్డారు. మోసం, కుట్రలు, ప్రలోభాలతో ఎమ్మెల్యేలను గురి చేయడంలో దయాకర్ రావు దిట్ట ఆరోపించారు. దయాకర్ రావు కదలికలపై తమకు అనుమానం ఉందన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరపాలని కోరుతూ రాష్ట్ర డిజిపిని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. తెలుగుదేశం పార్టీలో అన్ని పదవులు అనుభవించి, డబ్బులు పదవులకు కక్కుర్తి పడి తెలంగాణలో తెలుగుదేశం పార్టీని మోసం చేసిన దయాకర్ రావుకు ఘనమైన నేర చరిత్ర అని విమర్శించారు.

## ప్రధాని మోదీ కులంపై మాట్లాడే స్థాయి ఉందా? : లక్ష్మణ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ సామాజిక వర్గం గురించి మాట్లాడే స్థాయి లేదని బిజెపి రాజ్యసభ సభ్యుడు లక్ష్మ ణ్ అన్నారు. అధికారంలో ఉన్నామని విర్రవీగి ఇష్టం వచ్చినట్లు మాట్లాడినోళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. శనివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్‌లో అవాకులు, చెవాకులు పేలుతున్నాడన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ కులం గురించి మాట్లాడడానికి సిగ్గు అనిపిస్తలేదా? అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ఓ బోగస్ ప్రక్రియ అన్నారు. హిందూ ముస్లిం, బిసి ముస్లిం అని ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? ఈ సర్వే దేశానికి రోల్ మోడలా? రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వే లెక్కలు బోగస్ అని తేలడంతోనే మళ్లీ సర్వేకు అవకాశం ఇచ్చారన్నారు. కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఉంటే తెలంగాణలో రెండోసారి కులగణన ఎందుకు? ముందు దీనికి సమాధానం చెప్పాలన్నారు. బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొంరయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇట్టి సమావేశంలో బిజెపి ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ మేయర్‌లు డి.శంకర్, సునీల్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి ఉన్నారు.

## ప్రముఖ రచయిత్రి వనం సావిత్రీనాథ్ 'ఇకలేరు'

హైదరాబాద్‌లో కన్నుమూత



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రముఖ రచయిత్రి, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ వనం సావిత్రీనాథ్ (74) మరణించారు. సూర్యాపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పేరొంది ఇటీవల మరణించిన ఎన్.శేషగిరినాథ్ ఈమె భర్త. ఈ దంపతులకు నలుగురు కుమార్తెలు. సుదీర్ఘకాలం పాటు సూర్యాపేటలోనే ఉన్న వనం సావిత్రీనాథ్ గత కొద్ది సంవత్సరాలుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వయో సంబంధిత అనారోగ్యసమస్యలతో బాధపడుతున్న ఆమె శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ప్రైవేట్‌గా బిఎ, ఎంఎ, బిఇడి విద్యాభ్యాసం పూర్తిచేసి పిహెచ్‌డి పొందారు.'డాక్టర్ దాశరథి రంగాచార్య రచనల్లో జీవిత దృక్పథం' సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆమె పిహెచ్‌డి సాధించారు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సూర్జిత్‌సింగ్ బర్నాలా చేతులమీదుగా వనం సావిత్రీనాథ్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విశిష్ట సేవలందించారు.ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా సావిత్రీనాథ్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఆమె రచించిన సుమహారం, కవితా వనం, మల్లెలు మందారాలు, చైతన్యకిరణాలు, కవితా సంపుటి నాథ శతక, ఉత్తరదేశ యాత్రలుఅనుభవాలు, కరుణ నవల ముద్రణకు నోచుకుని పాఠకుల ప్రశంసలందుకున్నాయి. సావిత్రీనాథ్ సూర్యాపేట లయన్స్‌క్లబ్, స్ఫూర్తిక్లబ్ లాంటి పలు సేవాసంస్థలలో క్రియాశీల పాత్ర పోషించారు. సావిత్రీనాథ్ మృతిపట్ల సాహితీ మిత్రమండలి అధ్యక్షులు, 'తేజోప్రభ' ఎడిటర్ దేవులపల్లి ప్రభాకర్‌రావు, సూర్యాపేటకు చెందిన పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

# ప్రభుత్వం దిగిరాకపోతే రాష్ట్రవ్యాప్త నిరవధిక ఆటో బంద్

తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి హెచ్చరిక




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే దిగిరాకపోతే రాష్ట్ర వ్యాప్త నిరవధిక ఆటో బంద్ చేపడుతామని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి హెచ్చరించింది. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోకుండా ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని ఎఐటియూసి రాష్ట్ర కార్యాలయం నుండి నారాయణగూడ చౌరస్తా వరకు శనివారం వందలాదిమంది ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి నేడు పరిష్కరించకుండా కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహా యం, ఇంధన చార్జీల పెంపునకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంపు, రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, కొత్త ఆటో పర్మిట్ల మంజూరు, రాష్ట్ర ప్రభుత్వమే రవాణా ఆప్ ఏర్పాటు, స్కూల్ వ్యాన్లు, ఓలా, రాపిడో, ఉబెర్ ద్విచక్ర వాహనాలు, ఇతర జిల్లాల ఆటోలను నిషేధించడం వంటి న్యాయమైన డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్త నిరవధిక ఆటో బంద్ చేపడుతామని బి.వెంకటేశం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎ.సత్తిరెడ్డి (టిఎడిఎస్) పి.శ్రీకాంత్ (సిఐటియు) ఎంఎ. సలీం, ఎండి.నజీర్ (యుటిఎడబ్ల్యూఎ), వి.మారయ్య, నిరంజన్ (బిఆర్‌టియు), వి.ప్రవీణ్ (టియుసిఐ), రామ్ రెడ్డి (ఐఎఫ్‌టియు) సిహెచ్. జంగయ్య, ఎస్. అశోక్, ఎండి. ఒమర్ ఖాన్, ఎం.శ్రీనివాస్, ఎం.కృష్ణ (ఎఐటీయూసీ) పాల్గొన్నారు.

# కోడ్ లేని చోట ఇందిరమ్మ ఇళ్లు షురూ

అధికారులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని సూచించారు. శాటిలైట్ టౌన్‌షిప్ నిర్మాణాలపై గృహ నిర్మాణ శాఖ దృష్టి సారించడంతో పాటు ఎల్‌ఐజి, ఎంఐజి, హెచ్‌ఐజి ఇళ్ల నిర్మాణంతో మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం రెవిన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖల ఉన్నత అధికారులతో 2025–26 బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇళ్లు లేనిపేదలకు ఈ ఏడాది ప్రతి నియోజకవర్గంలో 3500 చొప్పున ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందన్నారు. ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల అమలులో భాగమే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమన్నారు. వివాదాల కారణంగా కోర్టు కేసుల్లో ఉన్న ప్రభుత్వ భూములు సాధించుకోవడానికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని, జిపి, ఎజిపిలతో ప్రభుత్వ భూ వివాద కేసులకు సంబంధించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కోట్ల రూపాయల విలువైన భూములు ప్రభుత్వానికి దక్కే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సినిమా కళాకారులను ప్రోత్సహించడంతో పాటు సమాజ వికాసానికి దోహదపడే విధంగా లఘు చిత్రాలను తీసుకురావడానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఆలోచనలను, ప్రభుత్వ పథకాలను లఘు చిత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడానికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. డిజిటల్ భూ సర్వేకు సంబంధించి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యాలయాల జాబితాను సేకరించి, ప్రతి నెల అద్దె చెల్లించడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేకంగా ఒక సెక్షన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, రెవిన్యూ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ ఎండి గౌతమ్. పౌరసంబంధాల శాఖ కమిషనర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 1నుంచి మంచిర్యాలలో ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మార్చి 1,2,3 తేదీల్లో మంచిర్యాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ తెలిపారు. కె.శ్రీనివాస్ అధ్యక్షతన హైదరాబాద్‌లో సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పల్లె నర్సింహ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ శిక్షణ తరగతుల ద్వారా తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. కళాకారులకు సమగ్ర విధానం ప్రకటించాలని, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా వివిధ జిల్లాల్లో సాంస్కృతిక రంగ సమస్యల సాధన కోసం ఉద్యమించాలని, జానపద, పౌరాణిక, యక్షగానం, సింధు భాగవతం, బుర్రకథ, జముకుల కథ తదితర అంతరించిపోతున్న సాంప్రదాయ కళలకు జీవం పోసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యవర్గం కె.లక్ష్మీనారాయణ, కె.ఉప్పలయ్య వి.కొండలరావు, రేగుంట చంద్రశేఖర్, ఆరెల్లి రవి, పి.నళిని తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిజన్లను వెంటనే పర్మినెంట్ చేయాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న 22వేల మంది ఆర్టిజన్లతో పాటు సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టిజన్లకు తీవ్ర అన్యాయం చేసిందని, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత సరిదిద్దుతుందని ఎంతో ఆశగా ఎదురు చూసినా వారికి నిరాశే మిగిలిందని, ప్రభుత్వ నిర్లక్ష్యం వీడి వెంటనే వారి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఆర్టిజన్లుగా ఇంజనీర్ల కింద పని చేస్తున్న వారిలో మెజార్టీగా ఇంజనీర్లుగా ఉండి నైపుణ్యత కలిగి నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తూ ప్రజలకు, పరిశ్రమలకు, వ్యాపారస్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శ్రమిస్తున్న ఆర్టిజన్లను శ్రమ దోపిడికి గురిచేయటాన్ని ఎఐటియుసి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రభుత్వాలు మారినా పాలకుల వాగ్దానాలలో మార్పు లేదని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అధికారానికి వచ్చిన మరుక్షణమే విద్యుత్ ఆర్టిజన్లందర్నీ పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి నిలబెట్టుకోకపోగా ఆర్టిజన్లపై కక్షసాధింపు ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటలు నిర్విరామంగా విద్యుత్ సరఫరా చేయటం ద్వారానే ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని గుర్తుంచుకోవాలన్నారు. ఆర్టిజన్ల ఉద్యోగాలను తక్షణమే క్రమబద్ధీకరించాలని లేకపోతే ఈ నెల 20వ తేదీన రాష్ట్రంలో పనిచేస్తున్న 22వేల ఆర్టిజన్లు విద్యుత్ సౌధను దిగ్బంధించనున్నట్లు బాల్‌రాజ్ హెచ్చరిక చేశారు.

# కేంద్ర ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ 18, 19తేదీలలో వామపక్ష పార్టీల నిరసనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ అఖిలభారత వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా ఈ నెల 18,19 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. కేంద్రం దిగివచ్చేంత వరకు తమ పోరాటం కొనసాగే ఉద్యమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి సంపన్నులకు రాయితీలు పెంచిందని, సామాన్య ప్రజలకు తీరని ద్రోహం చేసిందని ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, పోటు రంగారావు (సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్), గాదగోని రవి, (ఎంసిపిఐ(యు), సాదినేని వెంకటేశ్వర రావు, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ, జెవి చలపతిరావు, (సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ), సిహెచ్ మురహరి(ఎస్‌యుసిఐ(సి), మామిండ్ల రమేష్‌రాజా (సిపిఐ(ఎంఎల్) లిబరేషన్),బి.సురేందర్‌రెడ్డి(ఫార్వర్డ్ బ్లాక్), ప్రసాదన్న సిపిఐ(ఎంఎల్) లు విమర్శించారు. ఈ బడ్జెట్‌కు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను రూపొందించి, వీటికి మద్దతుగా ప్రజలను సమీకరించాలని నిర్ణయించినట్లు వారు వెల్లడించారు. దేశంలో 200మంది శతకోటీశ్వరులపై 4శాతం సంపద పన్ను విధించాలని, కార్పొరేట్ పన్ను పెంచాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు హామీ కల్పించాలని, బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డిఐలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా ప్రభుత్వరంగ ప్రైవేటీకరణ, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటువారికి అప్పగించడం ఆపాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 50శాతం కేటాయింపులు పెంచాలని, పట్టణాలకు వర్తింపజేయాలని, ఆరోగ్య రంగానికి, విద్యారంగానికి జీడీపీలో 3శాతం చొప్పున కేటాయించాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆహార సబ్సిడీ పెంచాలని, ఎస్‌సి, ఎస్‌టి రంగాలకు, మహిళ, శిశు సంక్షేమానికి కేటాయింపులు పెంచాలని, వివిధ పథకాలలో పనిచేస్తున్న వర్కర్ల గౌరవ వేతనంలో కేంద్రవాటాను పెంచాలని, రాష్ట్రాలకు నిధుల బదిలీ పెంచాలి, పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులు, సర్ ఛార్జీలను రద్దు చేయాలన్న ఈ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో పార్లమెంట్‌లో ఫైనాన్స్ బిల్లు ఆమోదించాలని వారుకేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మూట్ ట్రిబ్యునల్ పోటీలు చట్టపరమైన నైపుణ్యాలను పెంపొందిస్తాయి




తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.శ్రావణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూట్ ట్రిబ్యునల్ పోటీలు చార్టెడ్ అకౌంటెంట్, లా విద్యార్థులకు చట్టపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఎంతో దోహదం చేస్తాయని తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. శ్రావణ్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ 4వ మూట్ ట్రిబ్యునల్ పోటీలు– 2025 నిర్వహించారు. దాదాపు 300 మంది క్వాలిఫైడ్ చార్టెడ్ అకౌంటెంట్, లా విద్యార్థులు పాల్గొన్న ఈ వృత్తిపరమైన పోటీల కార్యక్రమానికి జస్టిస్ ఎన్.వి. శ్రావణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు పతకాలు అవార్డులను ప్రదానం చేశారు. మూట్ ట్రిబ్యునల్ పోటీలను ఆదాయపు పన్ను అప్పిలియట్ ట్రిబ్యునల్, హైదరాబాద్ జోన్ ఉపాధ్యక్షులు విజయ్ పాల్ రావు ప్రారంభించగా ఆదాయపు పన్ను అప్పిలియట్ ట్రిబ్యునల్, హైదరాబాద్ జోన్, జ్యూడిషల్ సభ్యులు కె.నరసింహ చారి, అకౌంటింగ్ సభ్యులు మధుసూదన్ సావ్డియా న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్.వి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ ఈ వృత్తిపరమైన పోటీలను నిర్వహిస్తున్నందుకు అభినందించారు. సిఎ, లా విద్యార్థులతోపాటు నిపుణులు ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా వాదించడానికి, వారి న్యాయపరమైన నైపుణ్యాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. మూట్ ట్రిబ్యునల్ పోటీలు ముఖ్యమైన చట్టపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని, ఆత్మవిశ్వాసంతో పాటు ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌ను పెంచుతుందని తెలిపారు. విద్యార్థులను న్యాయశాస్త్రంలో విజయవంతమైన కెరీయర్‌కు బాట వేస్తుందని పేర్కొన్నారు. విజయ్ పాల్ రావు మాట్లాడుతూ పన్ను చట్టాలు సాధారణ చట్టాలాంటివి కావని, టాక్స్ ఎక్స్‌పర్ట్‌గా ఎదగడానికి సిఎ, లా విద్యార్థులు సుదీర్ఘమైన శిక్షణ తీసుకోవడం అవసరం అని, కొత్త పన్ను చట్టాలపై కూడా అవగాహనా పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీలలో మొత్తం 10 టీంలు పాల్గొనగా సిజెపి కన్సల్టెంట్స్ స్వర్ణ పతకం, శ్రీరామ మూర్తి అండ్ కో రజత పతకం, దహిమ అండ్ కో కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ చైర్మన్ అమృత్ కుమార్ కోట ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ మూట్ ట్రిబ్యునల్ పోటీలు 2025లో అసోసియేషన్ అధ్యక్షులు హితేష్ జైన్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ వేముల, సలహాదారు రామ్ దేవ్ బూత్డా, కోశాధికారి ఆశిష్ జోషి తదితరులు పాల్గొన్నారు.

# పాప్‌కార్న్

## ఐరన్ మ్యాన్ సూట్... అంత ఈజీ కాదు!



ఐరన్ మ్యాచ్ కామిక్స్ చదివినా.. సినిమాలు చూసినా ఎంతో ఉత్కంఠకు గురవుతాం. ఐకానిక్ ఎరుపు, బంగారు రంగులో మెరిసిపోయే పవర్ సూట్‌తో బయటకు వచ్చిన ఐరన్ మ్యాన్ ఎలాంటి ప్రమాదాన్నయినా సులభంగా ఎదుర్కొంటాడు. మానవాతీత బలాన్ని ప్రదర్శిస్తాడు. లేజర్ కిరణాలను కూడా తప్పించుకొని, శత్రువుల భరతం పడతాడు. ఇదంతా ఒక కల్పన. వాస్తవంలో అలాంటి సూట్ ధరించడమే కష్టం. విన్యాసాల ప్రసక్తే లేదు. ఐరన్ మ్యాన్ సూట్ అనేది ఎక్సోస్కెలిటన్‌కు ఒక ఉదాహరణ. సాంకేతికత పరిమితుల కారణంగా నిజ జీవితంలో ఐరన్ మ్యాచ్ సూట్‌ను, అదే తరహాలో సృష్టించే అవకాశం లేదు. అయితే, అలాంటి లక్షణాలతో కూడిన సూట్‌ను అమెరికా శాస్త్రవేత్తలు రూపొందించారు. కేంబ్రిడ్జిలోని మాసెచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం ఈ సూట్‌ను ఇటీవల పరీక్షించింది. ఇది ఐరమ్ మ్యాచ్ ధరించినంత సుందరంగా లేదా శక్తివంతంగా లేదు. సినిమాల్లో, ఐరన్ మ్యాన్ ఛాతీకి అనుసంధానించిన ఆర్క్ రియాక్టర్ నుంచి అపారమైన శక్తి ఉద్భవిస్తుంది. దాని సాయంతోనే అతను ఎన్నో విన్యాసాలు చేయగలుగుతాడు. కానీ, శాస్త్రవేత్తలు రూపొందించిన సూట్‌కు అలాంటి సదుపాయం లేదు. అందులో బ్యాటరీలను అమరుస్తారు. బ్యాటరీ ఎంత పెద్దగా ఉంటే సూట్ బరువు అంత పెరుగుతుంది. కాబట్టి, తక్కువ బరువుతో, ఎక్కువ శక్తిని అందించగల బ్యాటరీ అవసరమవుతుంది. సైనికులు, భద్రతా దళాలకు ఎంతో ఉపయోగపడే ఈ సూట్‌ను ధరించడమే కష్టం. దానిని వేసుకొని నడవడం ఇంకా కష్టం. పరిగెత్తడం, దూకడం, పల్టీలు కొట్టడం అసాధ్యం. అందుకే, సినామాలు వేరు.. నిజ జీవితం వేరు అంటారు.

## ప్రయోగశాలలో 'స్పైడర్‌మ్యాన్ దారం'



కామిక్ పుస్తకాలలో, స్పైడర్ మ్యాన్ ఆకాశహర్మ్యాల నుండి ఊగుతూ, అత్యంత బలమైన పట్టు దారాలతో వేలాడుతూ ఉంటాడు. ఈ జిగటదారాలు అతని మణికట్టు నుండి పుట్టుకొస్తాయి. ఇప్పుడు పరిశోధకులు ఈ సూపర్ హీరో పదార్థాన్ని నిజ జీవితంలో సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. దూరం నుండి వస్తువులను అతుక్కొని ఎత్తగల మొదటి అంటుకునే పదార్థం ఇదేనని దీని డెవలపర్లు అంటున్నారు. కొత్త పదార్థం సిరంజి నుండి బయటకు వస్తుంది. ద్రవంగా ఉద్భవిస్తుంది, తరువాత త్వరగా బలమైన దారంగా గట్టిపడుతుంది. అది తాకిన దాదాపు దేనికైనా అంటుకుంటుంది. గట్టిపడిన తర్వాత, ఈ దారం దాని బరువు కంటే 80 రెట్లు ఎక్కువ వస్తువులను ఎత్తగలదు. ప్రయోగశాల పరీక్షలలో, పరిశోధకులు ఒక చెక్క దిమ్మె, ఉక్కు గింజలు, ఒక పరీక్ష గొట్టం వంటి వస్తువులను ఎత్తిపరీక్షించారు. టెక్సాస్ (అమెరికా)లోని మార్ఫోలో ప్రెస్టీ మాస్ మెడ్‌ఫోర్డ్‌లో ఉన్న టఫ్ట్స్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు అతుక్కునే గుణంగల పదార్థాన్ని కనుగొనడానికి ప్రయోగాలు చేస్తున్నారు. ఈ వర్శిటీలోని సిల్క్ ల్యాబ్‌కు నాయకత్వం వహిస్తున్న ఫియోరెంజో ఒమెనెట్టో కొత్త మెటీరియల్‌ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించాడు. త్వరగా అతుక్కునే తత్వంగల పదార్థాన్ని కనుగొనేందుకు చేసే ప్రయోగాన్ని ఆ బృందంలోని సభ్యులు 'స్పైడర్ మ్యాన్ ప్రాజెక్ట్' అని పిలిచేవారు. నిజంగానే స్పైడర్ మ్యాచ్ థ్రెడ్ ప్రయోగశాలలో ఆవిష్కృతమైంది. ఒక నాజిల్‌లోని ఓ భాగంలో పట్టు మిశ్రమం, మరో భాగంగా అసిటోన్‌ను ఉంచారు. ఈ రెండు పదార్థాలు గాలితో సంయోగం చెందినప్పుడు పట్టు మిశ్రమం దక్షణనే గట్టిపడి, గిజట దారంలా మారడాన్ని ఒమెనెట్టో బృందం గమనించింది. అది ఒక బీకర్‌పై పడి, ఆ తర్వాత పూర్తిగా గడ్డకట్టడంతో, దానిని లాగినప్పుడు, ఆ బీకర్ కూడా పైకి వచ్చింది. అనుకోకుండా జరిగిన ఈ ఆవిష్కరణ ఆ బృందాన్ని ఆశ్చర్యపరచింది. ఆ తర్వాత లోతైన అధ్యయనానికి ఈ బృందం సమాయత్తమైంది.

## మృత్యుంజయుడు సిమాన్కస్



ఆడ్రియన్ సిమాన్కస్ ముమ్మాటికీ మృత్యుంజయుడే. మెగెలాన్ జలసంధిలో కయాకింగ్ చేస్తున్న సమయంలో అతను తిమింగలం బారిన పడ్డాడు. పక్కనుంచి అమాంతం దూసుకొచ్చిన ఆ తిమింగలం సిమాన్కస్‌పై దాడి చేయడాన్ని కొంత దూరంలో మరో కయాక్ పడవలో ఉన్న అతని తండ్రి వీడియో తీశాడు. కొన్ని నిమిషాల్లోనే తిమింగలం దాడినుంచి బయటపడిన సిమాస్కస్ తిరిగి కయాక్ వద్దకు చేరుకోవడంతో తండ్రి ఊపిరి తీసుకున్నాడు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. తిమింగలం నోటిలో పడి బయటకు రావడం అత్యంత అరుదుగా అభివర్ణిస్తున్నారు. చాలామంది అతనిని మృత్యుంజయుడు అంటూ అభినందిస్తున్నారు. ఇంతకీ ఆ తిమింగలం తనపై ఎందుకు దాడి చేసిందో... కొన్ని నిమిషాల్లోనే ఎందుకు విడిచిపెట్టిందో అర్థం కావడం లేదని సిమాన్కస్ అంటున్నాడు. ఏదిఏమైనా మరణం అంచు నుంచి బయటపడడం అదృష్టమే.

## పిల్లి ప్రయాణం సుఖాంతం



ఎనిమిది ఏళ్ల 'మిట్టెన్స్' అనే మైనే కూన్... పిల్ల కాదు.. పిల్లి. ఆ పిల్లి కోసం దాని యజమానురాలు మార్గో నీస్ పెద్ద యుద్ధమే చేసింది. ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో స్థిర నివాసం కోసం న్యూజిలాండ్‌లోని క్రైస్ట్‌చర్చి నుంచి మార్గో తరలివెళ్లింది. తాను పెంచుకుంటున్న పిల్లి 'మిట్టెన్స్'ను కార్గో విమానంలో పంపింది. కానీ, మెల్బోర్న్‌కు ఆ పిల్లి చేరలేదు. సుమారు మూడు గంటలు ఆమె పిల్ల కోసం వేచిచూసినా ఫలితం లేకపోయింది. క్రైస్ట్‌చర్చి నుంచి కార్గో విమానంలో మెల్బోర్న్ చేరుకున్న 'మిట్టెన్స్'ను అక్కడి సిబ్బంది బయటకు తీయలేదన్న వార్తను అధికారులు మార్గో చెవిన వేశారు. దీనితో కంగారుపడిన ఆమె, పిల్లి కోసం ఆరాటపడింది. అధికారులను నిలదీసింది. వాదించింది. ఈలోగా ఆ పిల్లిని తరలించడానికి ఒప్పంద కదుర్చుకున్న కంపెనీ తరపున ఓ ప్రతినిధి కూడా అక్కడికి చేరుకున్నాడు. మెల్బోర్న్ విమానాశ్రయం అధికారులు పిల్లి ఉదంతాన్ని కార్గో పైలట్‌కు వివరించారు. కానీ, మార్గ మధ్యంలో విమానాన్ని దింపడం సాధ్యం కాదని పైలట్ స్పష్టం చేయడంతో, విమానం క్రైస్ట్‌చర్చి చేరే వరకూ వేచిచూశారు. అక్కడ విమానం ల్యాండైన వెంటనే, పిల్లిని గుర్తించి, మరో కార్గో విమానంలో మెల్బోర్న్ పంపాలని సూచించారు. దీనితో సదరు పిల్లి క్రైస్ట్‌చర్చి నుంచి తిరిగి మెల్బోర్న్ చేరుకుంది. ఆకాశంలోనే దాదాపు ఏడున్నర గంటలున్న పిల్లి ఎట్టకేలకు యజమానురాలి దగ్గరికి చేరుకుంది. కథ సుఖాంతమైందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. మార్గో మాత్రం తన పిల్లి బరువు తగ్గిందని తెగబాధపడుతున్నది.

## మనిషి ప్రాణం కాపాడి...





చైనాలో మనిషి ప్రాణాలు కాపాడిన ఓ గుర్రం ఆ తర్వాత వారం రోజుల వ్యవధిలోనే చనిపోయింది. ఇది కాకతాళీయం కావచ్చుగానీ, ప్రజలు మాత్రం ఆ గుర్రం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మనిషిని కాపాడిందని పొగుడుతున్నారు. 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' కథనం ప్రకారం, ఏడు సంవత్సరాల వయసు గల 'బైలాంగ్' (వైట్ డ్రాగన్) అనే గుర్రాన్ని శిక్షణ కోసం దాని యజమాని ఇలిబయ్ బయటకు తీసుకెళ్లాడు. హుబెయ్ ప్రావీన్స్‌లోని జియాన్‌టావో సమీపంలోని బ్రిడ్జి పైనుంచి ఒక వ్యక్తి నీళ్లలో పడిపోవడాన్ని గమనించాడు. వెంటనే బైలాంగ్‌ను పరుగులు తీయించాడు. నదిలో సుమారు 40 మీటర్లు ఎదురీదిన ఆ గుర్రం చివరికి, మునిగిపోతున్న వ్యక్తిని తన యజమాని కాపాడడంలో కీలక భూమిక పోషించింది. ఈ నెల 4వ తేదీన ఈ ఘటన చోటు చేసుకోగా, ఆరు రోజుల తర్వాత, 10వ తేదీ సోమవారం బైలాంగ్ అకస్మాత్తుగా జబ్బుపడింది. మేత కూడా తినలేదు. ఆ మరుసటి రోజే ప్రాణాలు విడిచింది. మనిషి ప్రాణాలను రక్షించడానికి సహకరించిన గుర్రం చనిపోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ లక్షలాది మంది సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పులు

ప్రజాపక్షం
16-02-2025, ఆదివారం

లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమిలో ప్రధాన భాగస్వామిగా కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఊపు తొమ్మిది నెలల్లోనే నీరుగారి పోవటం లోతైన అంతర్మథనాన్ని కోరుతున్నది. దశాబ్దకాలం తదుపరి లోక్‌సభలో వంద సీట్లతో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష పార్టీగా గుర్తింపు లభించింది. కాగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు మూడుకు (హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, తెలంగాణ) పడిపోయాయి. లోక్‌సభ ఎన్నికల అనంతరం జరిగిన హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నిలదొక్కుకోలేకపోయింది. హర్యానాలో అధికారం చేతికి అందినట్టే అంది జారిపోయింది. మహారాష్ట్రలో – కారణాలేమైనప్పటికీ కాంగ్రెస్, శివసేన (యుబిటి), ఎన్‌సిపి(శరద్) మహా వికాస్ అగాఢి కూటమి లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన ఆధిక్యత ను చేజార్చుకుని చిత్తుగా ఓడింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయక తప్పని పరిస్థితుల్లో ఆప్‌పై ఆగ్రహంతో అన్ని సీట్లకు పోటీచేసి సున్న ఫలితానికి పరిమితమైంది. ఢిల్లీ ఎన్నికలకు ముందే ఇండియా కూటమికి కాంగ్రెస్ సారథ్యా న్ని మమతా బెనర్జీ, కేజ్రీవాల్, లాలుప్రసాద్ ప్రశ్నించారు. ఆ కూటమి లోక్‌సభ ఎన్నికలకే పరిమితమని కొందరు కాంగ్రెస్ నాయకులు సన్నాయినొక్కులు నొక్కినా అధినాయకులు నోరువిప్పలేదు. రాష్ట్రాలకు వచ్చేసరికి కాంగ్రెస్‌కు, కూటమిలోని ప్రాంతీయ పార్టీల మధ్య వైరుధ్యా లే కాదు, వైరాలు జగమెరిగిన సత్యం. బిజెపితో నేరుగా కాంగ్రెస్ తలపడే రాష్ట్రాల్లో కూటమి పార్టీ లు కాంగ్రెస్‌కు ఇవ్వగలిగిందేమీ లేదు. కూటమి పార్టీలు – ఉదాహరణకు బెంగాల్‌లో టిఎంసి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ, బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ – బలంగా ఉన్న రాష్ట్రాల్లో అవి కాంగ్రెస్‌ను దరిచేరనీయవు; లేదా తమ ఆధిపత్యానికి అణిగిమణిగి ఉండాలని కోరుకుంటాయి. కాబట్టి ఈ ఘర్షణ అనివార్యం. కాంగ్రెస్ జాతీయపార్టీగా పునరుజ్జీవం పొందటానికి తన వంతు ప్రయత్నాలు అది చేసుకోకతప్పదు. అయితే పాత, కొత్తతరం నాయకులను సమన్వయ పరచగల జాతీయ నాయకత్వం లేదు. సాంప్రదాయకంగా కాంగ్రెస్ ఆధారపడదగిన ఎస్‌సి, ఎస్‌టిలు, ఒబిసిలు, ముస్లిం మైనారిటీలు ఆయా రాష్ట్ర పరిస్థితులనుబట్టి కొన్నిచోట్ల బిజెపివైపు, మరికొన్నిచోట్ల ప్రాంతీయ పార్టీలవైపు వెళ్లారు. ఆయా సామాజిక విభాగాలు సిద్ధాంతరీత్యా, ఆచరణాత్మకత దృష్ట్యా ఆధారపడదగిన పార్టీ కాంగ్రెస్ అయినప్పటికీ సంబంధిత విభాగాల నుంచి నాయకులు కరవైనారు.

ఈ సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధి నాయకత్వంలో రాజ్యాంగ పరిరక్షణ పేరుతో బిజెపిపై దాడి చేస్తూ, మరోవైపున పార్టీకి దూరమైన సామాజిక తరగతులను తిరిగి రాబట్టుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నది. అందులో వ్యూహాత్మకభాగమే కులగణన నినాదం. ఈ నేపథ్యంలో పార్టీ సంస్థాగతమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ముందస్తు చర్యగా ఎఐసిసి ఇన్‌చార్జిల మార్పు ప్రారంభించింది. తెలంగాణా రాష్ట్రానికి ఇన్‌చార్జిగా ఉన్న దీపాదాస్ మున్షీ స్థానంలో మీనాక్షి నటరాజన్‌ను నియమించారు. మొత్తం 13 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇన్‌చార్జిలుగా కొత్తవారిని నియమించారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శులుగా కూడా కొత్తవారిని ప్రమోట్ చేశారు. మరో విధంగా చెప్పాలంటే రాహుల్‌గాంధి టీంను పటిష్టం చేశారు. ఈ సంవత్సరాంతంలో ఎన్నికలు జరిగే బిహార్ ఇన్‌చార్జిగా పార్టీ వెటరన్ మోహన్ ప్రకాశ్ స్థానంలో యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కృష్ణ అలవూరును నియమించారు. బిహార్‌లో ఆర్‌డితో పొత్తు ఉంటుందో లేదో తెలియదు. లాలుప్రసాద్ రోజుకోరకంగా మాట్లాడుతున్నారు. అవసరమైతే సొంతంగా పోటీ చేసేందుకు కాంగ్రెస్‌ను సిద్ధంచేసే ఆలోచనలో ఉన్నారు రాహుల్‌గాంధి. పశ్చిమ బెంగాల్‌లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఒంటరిగా పోటీ చేయాలనే నిర్ణయం కూడా కొన్నిసార్లు కార్యకర్తలను ఉత్సాహపరుస్తుంది, కొత్త నాయకులను తయారు చేస్తుంది. పొత్తుల వల్ల పార్టీ కుంచించుకుపోతున్నదనే అభిప్రాయం కూడా ఉంది.

ఏమైనా తాము ఏ దళిత, బడుగు బలహీన తరగతులపై ఆధారపడి పార్టీని పునర్నిర్మించాలని భావిస్తున్నారో ఆ తరగతులనుంచి యువ నాయకులను తయారు చేసుకోవటం కాంగ్రెస్‌కు ఎంతైనా అవసరం.

# ట్రంప్ భజన తప్ప మోదీ ఏమి సాధించినట్లు?

**టి.ఎస్. అశోక్**

ప్రధాని నరేంద్రమోదీ తమ మిత్రుడు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో సమావేశం నుంచి తన దేశానికి ఏమి మోసుకొచ్చాడో ఆయన విమానం దిగిన తదుపరిగాని తెలియదు. చంద్రబాబునాయుడు, నితీష్ కుమార్ తప్ప ఆయన్ను ప్రశంసించేవారు బహుశా మరెవ్వరూ ఉండరు. ఎందుకంటే, భారత్‌తో వ్యాపార విస్తరణ విషయంలో ట్రంప్ కోరుకున్నవన్నీ సాధించుకున్నారు. భారతదేశానికి ఏమి మేళ్లు చేకూరాయో ఇంకనూ మదించాల్సి ఉంది. ఒకటి మాత్రం స్పష్టం – ట్రంప్ తమ ఇమ్మిగ్రేషన్ (వలస ప్రజలు)పై దృఢం గా ఉన్నారు, మోదీ అందుకు తల ఊపారు. ట్రంప్ మొదటి పదవీకాలం (2016–2020) కుదుర్చుకున్న సంబంధాలను పటిష్టం చేసుకునేందుకు, తమ మిత్రత్వాన్ని పరస్పర ప్రయోజనం గావించేందుకూ మోదీ వైట్‌హౌస్‌కు వచ్చారు. ట్రంప్, మోదీ సంబంధాన్ని కొన్ని మీడియా సంస్థలు 'బ్రొమాన్స్'గా అభివర్ణించాయి. నాయకులిరువురూ బహిరంగంగా పరస్పర ప్రశంసలు కురిపించుకున్నారు. కాని లోపల చర్చల్లో ట్రంప్ నిర్మొహమాటంగా తమ ప్రయోజనాలు నెరవేర్చుకున్నారు. భారత్ తమ దేశం నుంచి దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తున్నదని ట్రంప్ పునరుద్ఘాటించారు. వ్యాపార భాగస్వాములు తమ నుంచి దిగుమతులపై ఎంత సుంకం విధిస్తే తాము కూడా ఆ దేశాల నుంచి దిగుమతులపై అంతే సమాన సుంకం విధిస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. దీనికి ముద్దు పేరు "పరస్పరం ఇచ్చిపుచ్చుకునే సుంకాలు". ట్రంప్ భారత్ అధిక సుంకాలను విమర్శిస్తూ, మోదీని "సుంకాల రాజు" అని పిలిచేవారు.

అమెరికా వాణిజ్యలోటు తగ్గించుకోవటం ట్రంప్ లక్ష్యం. ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెంపుదలకు ఇరువురు నేతలు అంగీకారానికి వచ్చారు. అది కేవలం వస్తువుల వాణిజ్యానికే పరిమితం కాలేదు. రోదసీ యాత్రలో భాగస్వామ్యం, కృత్రిమ మేథ, ఇంధన ఉత్పత్తికి విస్తరించారు. లక్ష్యాల్లో తమ మమేకత కొత్త స్థాయి, పరిధికి చేరిందని మోదీ అభిభాషించారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం 2030నాటికి 500 బిలియన్ డాలర్లకు చేరటం (మిషన్ 500) లక్ష్యంగా నిర్దేశించారు. అమెరికా ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2024 నాటికి ఇరుదేశాల మధ్య వాణిజ్యం విలువ 129.2 బిలియన్ డాలర్లు. భారత్‌తో వాణిజ్యం లో అమెరికాకు 45.7బిలియన్ డాలర్ల లోటు ఉంది. ట్రంప్ ఇలా అన్నారు : "భారత్‌తో అమెరికా బంధం చాలా బలమైనది.. ప్రధానమంత్రి, నేను ఇంధనంపై చాలా ముఖ్యమైన అంగీకారానికి వచ్చాం. ఇది ఆయిలు, గ్యాస్ సరఫరాలో అమెరికాను భారత్‌కు ప్రధాన సరఫరాదారును చేస్తుంది, బహుశా నెంబర్ వన్ సరఫరాదారును చేస్తుంది."

(భారత్‌కు ప్రధాన ఆయిలు సరఫరాదారులుగా ఉన్న ఇరాన్, రష్యా, ఇతర గల్ఫ్ దేశాలను త్రోసివేసి అమెరికా నెం.1 స్థానాన్ని కోరుకుంటోంది. అప్పుడు భారత్ అంతర్జాతీయ వ్యవహారాల్లో అమెరికా తోక కావాల్సిందే. ఉక్రేన్ –రష్యా యుద్ధాన్నే తీసుకుందాం. రష్యా ఆయిలు ఎవరూ కొనకూడదని అమెరికా ఆంక్ష విధించింది. రష్యా తగ్గింపు ధరకు విక్రయించిన ఆయిలును భారత్ ద్వైపాక్షిక ఒప్పందం ద్వారా డాలర్ మారకంలో కాకుండా ఇతర ఏర్పాట్లతో పుష్కలంగా కొనుగోలు చేసింది. ట్రంప్‌తో తాజా ఒప్పందం ప్రకారం ఆయిలు, గ్యాస్ దిగుమతిలో భారత్ అమెరికాను ప్రధాన సరఫరాదారును చేసుకుంటే – క్లిష్ట సమయాల్లో మునిగిపోవటమే కదా? మోదీ ప్రభుత్వం ఇప్పుడు అనుసరిస్తున్న బహుళ దేశాలనుంచి దిగుమతుల విధానం బదులు అమెరికా మీద ఎక్కువగా ఆధారపడితే మన ప్రయోజనాలకు ముప్పు కలుగుతుంది.)



చైనా అంతర్జాతీయ పలుకుబడిని ఎదుర్కొనేందుకు ట్రంప్ కొత్త ఎరలు వేశారు. ఒకటి, టెర్రరిజాన్ని ఎదుర్కొనటంలో భాగంగా బొంబాయి పేలుళ్ల (26X11X2008) సూత్రధారి తహవుర్ రాణాను భారత్‌కు అప్పగిస్తామన్నారు. ఇస్లామిక్ టెర్రరిజంపై పోరాటంలో సహకరిస్తామన్నారు. రెండు, ప్రపంచ దేశాలను కలిపే చైనా బెల్ట్ అండ్ రోడ్ కార్యక్రమానికి పోటీగా ట్రంప్ మరో మౌలిక వసతుల కార్యక్రమం ప్రకటించారు. "చరిత్రలోనే అతి గొప్ప వాణిజ్య మార్గాలు నిర్మించేందుకు సహాయకారిగా కలిసి పనిచేయాలని మేము నిర్ణయించాం. అది ఇండియా నుండి ఇజ్రాయిల్‌కు, అక్కడినుండి ఇటలీ, ఆపైన అమెరికాను చేరుతుంది. రేవులు, రైల్వేలు, సముద్రగర్భ కేబుళ్ల ద్వారా భాగస్వాములను కలుపుతుంది" అన్నారు. ఉపఖండంలో ఆయుధ పోటీ పెంచేందుకు మోదీపై ట్రంప్ కొన్ని రక్షణ ఒప్పందాలు విధించారు. "అనేక బిలియన్ డాలర్ల మేర మిలటరీ విక్రయాలను భారత్‌కు పెంచుతాం. రక్షణ పరిశ్రమల మధ్య సహకారంతో భారత్‌తో ఆయుధ వ్యవస్థల సహ ఉత్పత్తి చేబడతాం. టాంకు వ్యతిరేక మిస్సిలీలు "జావెలిన్", కాల్బలం కంబాట్ శకటాలు "స్ట్రైకర్" ఉత్పత్తి వ్యవస్థలను భారత్‌లో నెలకొల్పుతాం" అన్నారు ట్రంప్.

కాంపాక్ట్(compact) అనే కొత్త సహకార కార్యక్రమాన్ని ట్రంప్, మోదీ ప్రారంభించినట్లు భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. సైనిక భాగస్వామ్యం, వాణి జ్యం, టెక్నాలజీ సహకారాన్ని వేగవంతం చేయటానికి ఇది ఉద్దేశించబడింది. పలు రకాల అమెరికా తయారీ రక్షణ ఉత్పత్తులను భారత్ వ్యవస్థలకు తగినట్లు మార్పులు చేర్పులు చేయటాన్ని నాయకులిరువురూ స్వాగతించారు. అత్యంత అధునాతన ఎఫ్–35 తరహా యుద్ధ విమానాలను అమెరికా భారత్‌కు విక్రయించేందుకు పదేళ్ల రక్షణ సహకార ఒప్పందం – ఇవన్నీ ఇప్పటికి సూత్రప్రాయ నిర్ణయా లు. ఇకపై సంబంధిత మంత్రిత్వశాఖలు సవివరమైన ఆర్థిక, సాంకేతిక వివరాలు, కాల నిర్ణయంతో నిర్దిష్టమైన ఒప్పందాలు చేసుకుంటాయి. భారత్ కోరుకుంటున్నట్లు అణుశక్తి ఉత్పత్తి పెంచేందుకు మాడ్యులర్ రియాక్టర్ల తయారీకి అమెరికా సహాయపడుతుంది. పై అన్ని రకాల విక్రయాల ద్వారా అమెరికా వాణిజ్య లోటును అధిగమిస్తుంది.

ఏతావాతా తేలేదేమంటే, ట్రంప్ కోరుకున్నవన్నీ నెరవేర్చుకున్నారు – రక్షణ సామాగ్రి, ఆయిలు, ఇంధన ఉత్పత్తుల్లో భారత్‌కు అమెరికా ఎగుమతులు పెద్ద ఎత్తున పెరుగుతాయి. ఈ రంగాల్లో భారత్‌కు రష్యా ఎగుమతులు తగ్గుతాయి. భారత్‌లో ఆందోళన కలిగిస్తున్న ఏ అంశాన్ని మోదీ ట్రంప్ ముందు లేవనెత్తినట్లే లేదు – లేవనెత్తినా ఫలితం సున్నా. భారత్‌కు చెందిన అక్రమ వలసదారులను వెనక్కి తీసుకోవటానికి మోదీ ముందే అంగీకరించారు. వారిని మర్యాదగా వెనక్కి పంపాలన్న విజ్ఞప్తిని అమెరికన్‌లు గౌరవిస్తారో లేదో చెప్పలేము. హెచ్ 1బి వీసాల విషయంలో కూడా మోదీ రాయితీలేవీ పొందలేదు. జన్మతః పౌరసత్వ సమస్య కూడా అంతే. ఏదైనా సాధించి ఉంటే ఈ పాటికి గోదీ మీడియా టాంటాం వేసేది. ట్రంప్‌ను ప్రశంసలతో ఆకాశానికెత్తటం, అమెరికా ఫస్ట్, తన 'భారత వికసిత్' నినాదాలు ఒకటేనంటూ – ట్రంప్ 'మాగా' తన 'మిగా' జతఅయితే 'మెగా' అంటూ పనికిమాలిన పదవిన్యాసం తప్ప దేశానికి, ప్రజలకు మోదీ సాధించేదేమీ లేదు.

# బిజెపిపై కాంగ్రెస్ బిసి అస్త్రం

తెలంగాణలో జరిగిన కులగణన సర్వేపై వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో వివరాలను నమోదు చేయించుకోని వారికి మరోసారి అవకాశం కల్పించడం ద్వారా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని గౌరవించినట్లయింది. అసెంబ్లీలో కుల సర్వే వివరాలు, ఎస్‌సిల వర్గీకరణపై ప్రకటన చేసిన తరువాత కొన్ని సందేహాలు, ప్రతిపక్ష రాజకీయ అభ్యంతరాలు, ఆరోపణల పర్యవసానంగా ప్రభుత్వానికి రావాల్సిన ఖ్యాతి దక్కలేదు. వెంటనే ప్రభుత్వం రంగంలోకి దిగి సర్దుబాటు చర్యలను తీసుకొంది. బిసి సంఘాలను బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయానికి పిలిపించి కులగణన సర్వే వివరాలను వివరించడమే కాకుండా, వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రయత్నించారు. అలాగే వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఎస్‌సి వర్గీకరణ విషయంలో కూడా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ లేవనెత్తిన అంశాలను కూడా ప్రభుత్వం సానుకూలంగానే తీసుకుంది. ఆయనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దకు ఆహ్వానించి వాదనలను సావధానంగా వినడం ద్వారా భిన్నాభిప్రాయాల ను వినేందుకు సిద్ధంగా ఉన్నామనే సంకేతాలు ఇచ్చారు. ఈ రెండు పరిణామాలతో అప్పటి వరకు బిసి, ఎస్‌సి వర్గాలలో నెలకొన్న అలజడి తగ్గింది. ముఖ్యంగా బిసిల సంఖ్య తక్కువగా ఉన్నదని బిసి సంఘాలు లేవనెత్తిన అభ్యంతరాలకు తొలిసారి సర్వేలో పాల్గొనని వారికి మరోసారి సర్వే అనే మాట ఉపశమనం కలిగించింది. దీంతోప్రభుత్వం చిత్తశుద్ధిపై లేవనెత్తిన సందేహాలు తొలగిపోయాయి.

కుల సర్వేపై ప్రతిపక్షం విమర్శలతో ఆశించిన స్థాయిలో ఖ్యాతి రాకపోగా, ప్రజల్లో అపోహలు నెలకొన్నాయని అధికార కాంగ్రెస్ గుర్తించింది. దీనిని అధిగమించేందుకు ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సి, ఎంపిలకు తొలి విడత మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సిఎల్‌పి సమావేశాన్ని ఏర్పాటు చేసి పవర్ పాయింట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. మలి దశగా టిపిసిసి అధ్వర్యంలో గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిసి అధ్యక్షులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, అనుబంధ సంఘాల నాయకులకు, ముఖ్య పార్టీ నేతలకు అవగాహన కల్పించారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీ య దుమారాన్ని రేపాయి. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టుకతో బిసి కాదని, ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బిసి అని, కులగణన సర్వేలో కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావులు పాల్గొనాలని బిసిలు వారి ఇంటి వద్ద మేలుకొలుపు డప్పుకొట్టాలని, అయినా పాల్గొనకపోతే వారిని సామాజిక బహిష్కరణ చేయాలన్న మాటలపై బిజెపి, బిఆర్ఎస్ నేతలు విరుచుకుపడుతున్నారు.

**ఆ వ్యాఖ్యలు వ్యూహాత్మకమే :** మోదీ, కెసిఆర్ కుటుంబ సభ్యులను ఉద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వ్యూహాత్మకంగా కనిపిస్తున్నాయి. కుల సర్వేను వెల్లడించినప్పటి నుంచి దానిని ఏదో రకంగా ఆ రెండు పార్టీలు తప్పుబట్టి ప్రజల్లో వ్యతిరేక తీసుకువచ్చి, ప్రభుత్వానికి రావాల్సిన ఖ్యాతిని అడ్డుకున్నాయనే భావన కాంగ్రెస్ పార్టీలో ఉంది. దానిని అధిగమించేందుకు మోదీ కన్వర్టెడ్ బిసి, కెసిఆర్ కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ అనే వ్యాఖ్యలు చేసి, వారిరువురిపై బిసిల అస్త్రాన్ని సంధించారు ముఖ్యమంత్రి. ఎస్‌సి వర్గీకరణ విషయంలో పెద్దగా వ్యతిరేకత రాకుండానే అంతర్గతంగా సంబంధిత ఉప కులాల ముఖ్యులతో మంత్రాంగాన్ని సాధించి పెద్ద కసరత్తే చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఆ అంశంపై శాసనసభలో చేసిన ప్రకటనపై వ్యతిరేకత రాకపోగా, వచ్చిన సూచనలను కూడా స్వీకరించేందుకు సుముఖత చూపడంతో ప్రభుత్వంపై ఆ వర్గాలలో విశ్వాసం నెలకొంది. బిసిల విషయంలో లెక్కలు తక్కువ చేసి చూపారనే విస్తృత ప్రచారం ఆత్మరక్షణలో పడేసింది. కానీ, నిజానికి పెరిగిందని వివరించి, మరోసారి నమోదు కాని వారి వివరాలు సేకరించేందుకు సర్వే చేస్తామనడంతో సద్దుమణిగింది. ఎస్‌సి వర్గీకరణను తొలుత జివో రూపంలో తీసుకువద్దామని భావించినప్పటికీ, దానికి బిల్లు రూపంలో చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇక బిసిల విషయంలోనే అసలు కథ మొదలుకానుంది.

**రాజధాని సందడి**
**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

బిసిల రిజర్వేషన్‌లు కాంగ్రెస్ ఎన్నిక ల్లో హామీ ఇచ్చినట్లుగా స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాలలో ప్రస్తుతమున్న 27 శాతం నుంచి 42 శాతానికి పెంచితే, మొత్తం రిజర్వేషన్‌లు 50 శాతం దాటవొద్దనే సుప్రీం కోర్టు తీర్పు అడ్డం వస్తుంది. దానిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపితే, దానికి తమిళనాడు చట్టం తరహాలో రాజ్యాంగ రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిదే. ప్రధాని బిసి వర్గానికి చెందిన వ్యక్తి అని పదే పదే ప్రచారం చేసుకునే బిజెపి, తెలంగాణలో కూడా బిసిలనే తమ ఆయుధంగా మలుచుకొని అధికారంలోకి రావాలని భావిస్తుంది. ఇప్పటికే గత ఎన్నికల్లో బిజెపి గెలిస్తే బిసి ముఖ్యమంత్రి అవుతారని ప్రకటించింది. కాబట్టి ఆ పార్టీని ఇరుకున పెట్టేందుకు అదే బిసి అస్త్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయోగించారు. అందులో భాగంగానే ప్రధాని మోదీ జన్మత: బిసి కాదని, లీగల్లీ కన్వర్టెడ్ బిసి అనే చర్చ తెరపైకి తీసుకువచ్చారు. ఆయన ఉద్దేశ్యం పుట్టకతో మోదీ ప్రాతినిధ్యం వహించే సామాజిక వర్గం బిసి జాబితాలో లేదని, తరువాత అది బిసిలో చేర్చబడిందని అర్థం. సిఎం వ్యాఖ్యలపై ఎదురు దాడి చేస్తూ కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రధాని బిసి అని, ఆయన బిసిల అభ్యున్నతి కోసం పాటు పడుతున్నారని, దీనిపై చర్చకు రావాలని సవాలు విసిరారు. ఈ అవకాశం కోసమే కాంగ్రెస్ పార్టీ ఎదురు చూస్తోంది. ప్రధాని నిజంగా బిసిల పక్షపాతే అయినట్లయితే తెలంగాణ రాష్ట్రం చేసి పంపే బిసి రిజర్వేషన్‌ల పెంపు బిల్లుకు పార్లమెంటులో రాజ్యాంగ రక్షణ కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయించాలని పట్టుబట్టేందుకు కాంగ్రెస్ ప్రణాళికలు వేసుకుంటుంది.. బిసిలే ఊతంగా తెలంగాణలో ఎదగాలని భావిస్తున్న బిజెపికి బిసిల రిజర్వేషన్ బిల్లుపై బిజెపి కేంద్ర ప్రభుత్వానికే అగ్ని పరీక్ష పెట్టేందుకు సిద్ధమవుతున్నది కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. వచ్చే నెలలో బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదం తరువాత కేంద్ర ప్రభుత్వానికి పంపడం ద్వారా జాతీయ యవనికపై బిసి రిజర్వేషన్ ల అంశాన్ని తెరపైకి తీసుకురావొచ్చని, బిసి ఓటర్లు ప్రభావిత స్థాయిలో ఉన్న బిహార్ శాసనసభకు సమీప భవిష్యత్తులో ఎన్నికలు జరగనుండడంతో బిజెపిని ఇరకాటంలో పెట్టొచ్చనే వ్యూహం కూడా దాగుంది. బిజెపి ఆ దిశగా సిద్ధమైతే జనగణనలో కుల గణన కూడా అనివార్యంగా చేపట్టే విధంగా చేయవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. మతం ఆయుధంగా ముందుకు సాగుతున్న బిజెపికి అణగారిని కులాలకు అధికారంలో న్యాయమైన వాటా పేరుతో చెక్ పెట్టాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి బిసి రిజర్వేషన్‌ల పెంపు దేశవ్యాప్త రాజకీయాలలో, ముఖ్యంగా హిందీ బెల్ట్‌లో చెదిరిపోయిన తమ ఓటు బ్యాంకును కూడగట్టుకునేందుకు సాధనంగా ఉపయోగపడే అవకాశం లేకపోలేదు. అంతే కాకుండా జిస్‌కీ జిత్నీ హిస్సేదారి, ఉస్కీ ఉత్నీ భాగీదారి అనే రాహుల్‌గాంధీ నినాదానికి అనుగుణంగా రాష్ట్రంలో పలు మార్పు మార్పు జరగనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పార్టీలో టిపిసిసి అధ్యక్షుడుగా బిసి ఉండగా, ప్రభుత్వంలో కూడా ఒక బిసిని డిప్యూటీ సిఎం చేస్తారనే వార్తలు వినపడుతున్నా యి. ఇప్పటి వరకు బిసి వర్గాల నుంచి సి.జగన్నాథరావు ఏకైక ఉపముఖ్యమంత్రి. తెలంగాణకు చెందిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి భవనం వెంకటరామిరెడ్డి ఉన్నప్పుడు 1982లో ఆరేడు మాసాలు డిప్యూటీ సిఎంగా పని చేశారు.

> వచ్చే నెలలో బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదం తరువాత కేంద్ర ప్రభుత్వానికి పంపడం ద్వారా జాతీయ యవనికపై బిసి రిజర్వేషన్ ల అంశాన్ని తెరపైకి తీసుకురావొచ్చని, బిసి ఓటర్లు ప్రభావిత స్థాయిలో ఉన్న బిహార్ శాసనసభకు సమీప భవిష్యత్తులో ఎన్నికలు జరగనుండడంతో బిజెపిని ఇరకాటంలో పెట్టొచ్చనే వ్యూహం కూడా దాగుంది. బిజెపి ఆ దిశగా సిద్ధమైతే జనగణనలో కుల గణన కూడా అనివార్యంగా చేపట్టే విధంగా చేయవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది.

# వయనాడ్‌కు షరతులతో రూ.529 కోట్ల రుణం



## రాష్ట్రంలో చెలరేగిన రాజకీయ దుమారం

## ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ విమర్శించగా, సమర్థించుకున్న బిజెపి

**తిరువనంతపురం/త్రిశ్శూర్ :** ప్రకృతి ప్రకోపానికి కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. దీంతో వయనాడ్ జిల్లాలో ఊర్లకు ఊర్లు కొట్టుకుపోయాయి. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. అయితే కేంద్ర ప్రభుత్వం పునరావాసానికి షరతులతో కూడిన రూ. 529.50 కోట్ల రుణాలను మంజూరు చేసింది. ఈ అంశంపై కేరళలో రాజకీయ దుమారం లేసింది. అధికార ఎల్‌డిఎఫ్, ప్రతిపక్ష యుడిఎఫ్ ఈ నిబంధనలను విమర్శించగా, ఇచ్చిన మొత్తం 'వాస్తవ గ్రాంట్' అని బిజెపి పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం వయనాడ్ పునరావాసం కోసం మంజూరు చేసిన రూ.529.50 కోట్ల రుణం 'భయానక', 'క్రూరమైన జోక్' అని కేరళ రెవెన్యూ మంత్రి కె రాజన్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు వి డి సతీశన్ శుక్రవారం మాట్లాడుతూ ఈ నిబంధనలు ముఖ్యంగా మార్చి 31 నాటికి మొత్తం మొత్తాన్ని ఉపయోగించాలనే షరతు ఆచరణీయం కాదు అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్య కేరళను అవమానించడం, ఎగతాలి చేయడమేనన్నారు. 'ఇది కేరళ పట్ల పూర్తి నిర్లక్ష్యం. రాష్ట్రాన్ని అవమానిస్తున్నారు, అపహాస్యం చేస్తున్నారు. ఈ చర్య సరైనది కాదు. ఒక రాష్ట్రానికి చూపించాల్సిన సాధారణ మర్యాదను చూపించడం లేదు' అని ఆయన మళప్పురంలో విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. బిజెపి పాలిత కేంద్రం ప్రకృతి వైపరీత్యాలకు గురైన ఇతర రాష్ట్రాలకు సహాయం చేసిందని, అలాంటి సహాయాన్నే కేరళకు చేయకపోవడం ఎలా సమర్థనీయమన్నారు. అయితే కేరళలోని వామపక్ష ప్రభుత్వం, ప్రతిపక్ష యుడిఎఫ్‌పై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె సురేంద్రన్ ఎదురుగాడికి దిగారు. ఇది 50 సంవత్సరాల వడ్డీ లేని రుణం, వాస్తవ గ్రాంట్ అని అన్నారు. పినరయి విజయన్ ప్రభుత్వం, యుడిఎఫ్ 50 సంవత్సరాల తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని, ఐదు సంవత్సరాల తర్వాత దాని బాధ్యత కేరళలోని జాతీయ పార్టీదని ఆయన అన్నారు. సురేంద్రన్ వ్యాఖ్యలపై సతీశన్ స్పందించారు. బిజెపి నాయకుడు 50 సంవత్సరాల తర్వాత రుణం తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని ఎలా చెప్పగలరని ప్రశ్నించారు. అలా అనడానికి ఆయనకు (సురేంద్రన్) ఏ హక్కు ఉందని ప్రశ్నించారు. రుణం ఇవ్వడంలో విధించిన షరతులు వనాయడ్, కేరళలోని కొండచరియ బాధితుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని సూచిస్తున్నాయని మంత్రి రాజన్ అన్నారు. త్రిశ్శూర్‌లో మీడియాతో మాట్లాడిన రాజన్, కేరళకు న్యాయంగా అందాల్సిన షరతులు లేని ఆర్థిక సహాయం అందించడానికి బదులుగా, కేంద్రం మార్చి 31 నాటికి మొత్తం మొత్తాన్ని వినియోగించుకోవడంతో సహా కఠినమైన షరతులతో రుణం ఇచ్చిందని అన్నారు. రాష్ట్రాన్ని వచ్చే 45 రోజుల్లోపు మార్చి 31 నాటికి మొత్తం రుణాలు ఉపయోగించుకోవాలని ఆదేశించడం క్రూరమైన జోక్ అని మంత్రి అన్నారు. ఇదిలా ఉండగా, విపత్తు బాధితుల్లో కొందరు వయనాడ్‌లోని ఒక టివి ఛానెల్‌తో మాట్లాడుతూ ఈ పరిణామంతో తాము నిరాశ చెందామని, కేంద్రం, రాష్ట్రం తమను ఒక కోర్టు నుండి మరొక కోర్టుకు బంతిలా విసిరేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఇక్కడికి వచ్చి పునరావాస పనులకు అన్ని సహాయం చేస్తామని హామీ ఇచ్చినప్పుడు చాలా ఆశ కలిగిందని, కానీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రుణం మాత్రమే ఇచ్చిందని, దీంతో నిరసనలు, ఆందోళనలు నిర్వహించడం తప్ప తమకు వేరే మార్గం లేదన్నారు. మార్చి 31 నాటికి ఈ మొత్తాన్ని ఉపయోగించుకోవాలనే నిబంధనను 'భారీ ఆచరణాత్మక సమస్య'గా రాష్ట్ర ఆర్థిక మంత్రి కె ఎన్ బాలగోపాల్ అభివర్ణించారు. మార్చి 31 నాటికి ఉపయోగించుకోవాల్సిన 16 ప్రాజెక్టులకు 50 సంవత్సరాల వడ్డీ లేని రుణాన్ని అందించడం ద్వారా, కేంద్ర ప్రభుత్వం 'కేరళను ఊపిరాడకుండా చేయడానికి ప్రయత్నిస్తోంది, సహాయం చేస్తున్నట్లు నటిస్తోంది' అని సతీశన్ కేంద్రం నిర్ణయాన్ని విమర్శించారు. కేరళలో పునరావాసానికి ఆర్థిక సహాయం మంజూరు చేయకపోవడంపై ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌లు కేంద్రంపై తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో ఈ రుణం మంజూరు చేయడం గమనార్హం.

# మధ్యవర్తిత్వం అనేది.. పరిష్కారానికి మార్గం

- ఎంఎన్‌ఎల్‌యు 3వ స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా కీలకవ్యాఖ్య
- ప్రతీకేసునూ న్యాయపరమైన అంశాల దృష్టితో కాకుండా 'మానవ కథ'గా చూడాలని ఉద్బోధ



**ముంబయి :** భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సంజీవ్ ఖన్నా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన శనివారం ఇక్కడ మాట్లాడుతూ అన్ని వివాదాలు కోర్టులు, వ్యాజ్యాలకు సరిపోవని అన్నారు. మధ్యవర్తిత్వం అనేది పరిష్కారానికి మార్గం అని సంజీవ్ ఖన్నా నొక్కిచెప్పారు. మధ్యవర్తిత్వం అనేది సృజనాత్మక పరిష్కారాలను అందించడమే కాకుండా సంబంధాలను బలపరుస్తుంది కాబట్టి మధ్యవర్తిత్వం పరిష్కారానికి మార్గం అని ఆయన ఉద్ఘాటించారు.నాగ్‌పూర్‌లోని మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ (ఎంఎన్‌ఎల్‌యు) 3వ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ ప్రతీ కేసును న్యాయపరమైన అంశాల దృష్టిలో కాకుండా మాన వ కథగా చూడాలని ఉద్బోధించారు. భారతీయ న్యాయసహాయం నిర్మాణం బహుశా ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైనదన్నారు. ఇక్కడ వాటాదారులు అందరికీ సహాయం అందించబడుతుందని సిజెఐ పేర్కొన్నారు. 'అన్ని వివాదాలు కోర్టు గదులు వ్యాజ్యం లేదా మధ్యవర్తిత్వానికి సరిపోవు. మధ్యవర్తిత్వం అనేది వివాద పరిష్కారానికి మించి మనకు అందించే పరిష్కార మార్గం' అని భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా చెప్పారు. సులభతరమైన రీతిలో 'ఔను' లేదా 'కాదు' సమాధానాలకు మించి సృజనాత్మక పరిష్కారాలకు తలుపులు తెరుస్తుంది అని సిజెఐ తెలిపారు.'మధ్యవర్తిత్వం అనే మార్గాన్ని ఎంచుకుంటే మేం వివాదాలను సమర్థవంతంగా పరిష్కరించుకోవడమే కాకుండా వ్యక్తులు, వ్యాపారాల మధ్య సంబంధాలు కూడా బలోపేతం చేస్తుంది' అని ఆయన చెప్పారు. ప్రతీ ఒక్కరూ సమావేశానికి అతీతంగా ఆలోచించాలి. న్యాయపంపిణీ ఖర్చుతో కూడుకున్నది. వారి క్షితిజాలను విస్తరించాలి. మానవ హక్కులు, సామాజిక న్యాయం, డిజిటల్ పరిణామం, మన పర్యావరణాని ముప్పు కలిగించే వాతావరణ మార్పు మన పూర్వీకులు కష్టపడి ఎదుర్కొన్న సవాళ్లను నేటితరం ఎదుర్కొంటున్నదని సిజెఐ వివరించారు. దీనివల్ల గోప్యత, భద్రత, అపురూపమైన స్వభావానికి సంబంధించిన ఊహించని ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. కొత్త సామాజికతలు, గతిశీలతల ద్వారా ప్రజాస్వామ్యం పునర్నిర్మించబడుతోందని సంజీవ్‌ఖన్నా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌ఎల్‌యు ఛాన్సలర్‌గా ఉన్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బిఆర్.గవాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీని ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పాశ్చాత్య దేశాలపై జైశంకర్ మండిపాటు



**న్యూఢిల్లీ :** ప్రజాస్వామ్యాన్ని పాశ్చాత్య లక్షణంగా పేర్కొనడంపై భారత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ పాశ్చాత్య దేశాలపై మండిపడ్డారు. పాశ్చాత్య దేశాలు స్వదేశంలో అనుసరించే ప్రజాస్వామ్య విధానాన్ని పరాయిగడ్డపై అనుసరించకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. మ్యూనిచ్‌లో జరిగిన భద్రతా సమావేశంలో ఒక చర్చావేదికలో శుక్రవారం జైశంకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం మనగలగాలని కోరుకుంటే పాశ్చాత్య దేశాలు ఇతర దేశాలలోని ప్రజాస్వామ్య విధానాలను స్వీకరించాలన్నారు. 'ఒకానొక సమయంలో పాశ్చాత్య దేశాలు ప్రజాస్వామ్యాన్ని పాశ్చాత్య లక్షణంగా భావించేవి. దక్షిణార్థ గోళంలోని దేశాలలో ప్రజాస్వామ్యం ఆచరించాలని బోధించేవి. ఇప్పటికీ ఆ విధానం కొనసాగుతున్నది. అయితే స్వదేశంలో అనుసరించే ప్రజాస్వామ్య విలువలను పాశ్చాత్య దేశాలు ఇతర దేశాలలో అనుసరించడం లేదు. ఇది ఎంతో నిజాయితీగా చెబుతున్నాను' అని జైశంకర్ అన్నారు. ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ భారత్‌లో ప్రజాస్వామ్య విధానాలకు విలువనిస్తామన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యమిచ్చేది ఒక్క భారతదేశమేనని జైశంకర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం మనగలగాలంటే పాశ్చాత్య దేశాలు సైతం అదే విధానాన్ని అనుసరించాలన్నారు. జైశంకర్‌తోపాటు నార్వే ప్రధాని జొనాస్ గర్ స్టోర్, అమెరికా సెనెటర్ ఎలిసా స్లోట్కిన్, వార్సా నగర మేయర్ రాఫల్ ట్రస్కోస్క్ ఈ సమావేశంలో చర్చా వేదికలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్యం కూడు పెట్టదన్న అమెరికా సెనెటర్ వ్యాఖ్యలపై జైశంకర్ స్పందిస్తూ మా ప్రపంచంలో అది సాధ్యమని, భారత్ 80 కోట్లమందికి బలవర్థక ఆహారం అందజేస్తున్నదని వెల్లడించారు. నిరాశావాదుల మధ్య ఆశావాదినని ఒక ప్రశ్నకు సమాధానంగా జైశంకర్ చెప్పారు.

## కుంభమేళాను పొడిగించండి..

### యోగి సర్కార్‌ను కోరిన అఖిలేష్



**లక్నో:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాను మరికొద్ది రోజులు పొడిగించాలని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) చీఫ్ అఖిలేష్ యాదవ్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని శనివారంనాడు కోరారు. లక్షలాది మంది భక్త జనం పోటెత్తుతుండటం, ఎలాగైనా కుంభ్‌మేళాలో పాల్గొనాలనే ఆశతో వేలాది మంది రోడ్లపైనే నిరీక్షిస్తుండటంతో అఖిలేష్ ఈ విజ్ఞప్తి చేశారు. గతంలో మహాకుంభ్, కుంభ్‌మేళాలు 75 రోజుల పాటు నడిచేవని, ఇప్పుడు కుంభ్‌మేళాకు నిర్దేశించిన రోజులు తక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. 'ఇప్పుడు కూడా చాలా మంది మహాకుంభ్‌కు వెళ్లాలని అనుకుంటున్నా వెళ్లలేకపోతున్నారు. ఆ పరిస్థితుల్లో మహాకుంభ్ కాలవ్యవధిని ప్రభుత్వం పొడిగించాలి'' అని అఖిలేష్ కోరారు. కాగా, కొద్దిరోజులుగా మహాకుంభ్ మేళాకు వెళ్తున్న రైళ్లు కిటకిటలాడుతుండటం, రోడ్లన్నీ కిక్కిరిసి ఉండటం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఘాట్లకు వెళ్లే దారిలో కిలోమీటర్ల పొడవునా క్యూలు కనిపిస్తున్నాయి. విపరీతమైన రద్దీ కారణంగా ప్రయాగ్‌రాజ్ సంగమ్ రైల్వే స్టేషన్‌ను తాత్కాలికంగా మూసేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా నిర్వహిస్తున్న మహాకుంభ్ మేళా జనవరి 13న మొదలై ఫిబ్రవరి 26వ తేదీ 'మహాశివరాత్రి'తో ముగియనుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఫిబ్రవరి 14వ తేదీ శుక్రవారం సాయంత్రం వరకూ త్రివేణి సంగమంలో స్నానాలు చేసిన వారి సంఖ్య 50 కోట్లకు చేరింది.

## రూ.99వేలకే లైఫ్‌టైమ్ పానీ పూరీ

**న్యూఢిల్లీ :** వ్యాపారంలో పోటీని తట్టుకోవాలంటే వినూత్నంగా ఆలోచించడం సహా వినియోగదారులను ఆకట్టుకునే తెలివితేటలు ఉండాలి. సరిగ్గా అదే చేస్తున్నాడు మహారాష్ట్రలో ఆరెంజ్ సిటీగా పేరుపొందిన నాగ్‌పూర్‌కు చెందిన చిరువ్యాపారి. పానీపూరి తయారీలో, రెసిపీలో కొత్తదనం లేకున్నా వినూత్నమైన ఆఫర్లను ప్రకటించి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాడు. ప్రస్తుతం నాగ్‌పూర్‌లో విజయ్ మెవాలాల్ గుప్తా ఔట్‌లెట్ చర్చనీయాంశంగా మారింది. రూ.99వేలు చెల్లిస్తే జీవిత కాలం ఎన్ని పానీపూరీలైనా తినొచ్చని విజయ్ మెవాలాల్ చెబుతున్నాడు. ఇప్పటికే ఇద్దరు ఈ ఆఫర్‌ను ఉపయోగించుకున్నారని తెలిపాడు. ద్రవ్యోల్బణం, ఏటా పానిపూరీల మీద పెట్టే ఖర్చుతో పోలిస్తే ఈ ఆఫర్ చాలా చవకని చెబుతున్నాడు. 'రూ.99 వేల ఆఫర్‌పై స్పందన చాలా బాగుంది. నాగ్‌పూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ ఆఫర్‌ను ఎంచుకున్నారు. రెండు, మూడు నెలల నుంచి కూడా చాలా మంది ఈ ఆఫర్ గురించి వాకబు చేస్తున్నారు. రోజుకు గోల్‌గప్పా మీద రూ. 100 ఖర్చు పెడితే నెలకు రూ.3వేలు, ఏడాదికి రూ.36వేలు ఖర్చవుతుంది. 10ఏళ్లలో రూ.3 లక్షల 60 వేలవుతుంది. కానీ మేము రూ.99వేలకే జీవిత కాలం తినేలా ఆఫర్‌ను ప్రకటించాం. ఈ ఆఫర్‌ను కస్టమర్లు ఇష్టపడుతున్నారు. తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు' అని చిరువ్యాపారి విజయ్ మెవాలాల్ గుప్తా చెప్పుకొచ్చారు. మహారాష్ట్రలో మహిళలకు ఆర్థిక సాయం చేసేందుకు ప్రవేశపెట్టిన లాడ్‌లీ బహనా యోజన, మహాకుంభమేళా పేరిట కూడా ఆఫర్లు పెట్టాడు.

## కేజ్రీవాల్ 'అద్దాలమేడ'పై పిడబ్ల్యుడి దర్యాప్తు



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని నంబర్ 6, ఫ్లాగ్ స్టాఫ్ రోడ్ బంగళా విస్తరణ నిమిత్తం ఆస్తులు విలీనం చేశారని, భవనం లోపల మార్పులకు చేసిన ఖర్చులకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించవలసిందిగా ఢిల్లీ ప్రభుత్వ పబ్లిక్ వర్క్ శాఖ (పిడబ్లుడి)ని కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివిసి) ఆదేశించిందని భారతీయ జనతా పార్టీ (బిజెపి) నేత విజేందర్ గుప్తా శనివారం వెల్లడించారు. ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ 2015 నుంచి నిరుడు అక్టోబర్ మొదటి వారం వరకు ఢిల్లీ ముఖ్యమంత్రిగా నివసించిన ఆ బంగళాకు సంబంధించిన అవినీతి ఆరోపణ నేపథ్యంలో బిజెపి దానికి 'శీష్ మహల్' (అద్దాల మేడ) అని నామకరణం చేసింది. ఈ వ్యవహారంపై ఆప్ నుంచి గాని, పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ నుంచి గాని వెంటనే ఎటువంటి స్పందనా రాలేదు. తాను గతంలో దాఖలు చేసిన రెండు ఫిర్యాదులను సివిసి పరిగణనలోకి తీసుకుందని, సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలతో నివేదిక సమర్పించవలసిందిగా పిడబ్ల్యుడిని సివిసి కోరిందని గుప్తా తెలియజేశారు.40 వేల చదరపు గజాల (8 ఎకరాల) విస్తీర్ణంలో విలాసవంతమైన భవనాన్ని నిర్మించేందుకు భవనం నిబంధనలను కేజ్రీవాల్ ఉల్లంఘించారనే ఆరోపణతో రోహిణి బిజెపి ఎంఎల్ఎ విజేందర్ గుప్తా సివిసికి మొదటి ఫిర్యాదు దాఖలు చేశారు. రాజ్‌పూర్ రోడ్‌లో నంబర్లు 45, 47 ప్లాట్లు (టైప్ 5 ఫ్లాట్లలోని సీనియర్ అధికారులు, న్యాయమూర్తుల నివాసాలు) సహా, రెండు బంగళాలు (8ఎ, 8బి ఫ్లాగ్ స్టాఫ్ రోడ్ సహా ప్రభుత్వ ఆస్తులను కూలగొట్టి, కొత్త నివాసంలోకి విలీనం చేశారని, మొత్తం స్థలం విస్తీర్ణం, ఫ్లోర్ ఏరియా నిష్పత్తి నిబంధనలు ఉల్లంఘించారని, వాటికి సరైన లే అవుట్ ప్లాన్ ఆమోదముద్రలు లేవని గుప్తా ఆరోపించారు. నంబర్ 6, ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లోని బంగళా మార్పులు చేర్పులు, అంతర్గత అలంకరణపై 'విపరీతంగా ఖర్చు చేశారని గుప్తా తన రెండవ ఫిర్యాదు లేఖలో ఆరోపించారు. 'భారీ ఎత్తున ఆర్థికపరమైన అవకతవకలు' జరిగాయని, బంగళాలో విలాసవంతమైన సదుపాయాలపై పన్ను చెల్లింపుదారుల డబ్బు నుంచి కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని కూడా గుప్తా ఆరోపించారు.

## మణిపూర్‌లో 9 మంది ఉగ్రవాదుల అరెస్టు

**ఇంఫాల్ :** ఇంఫాల్ తూర్పు, తౌబాల్ జిల్లాల నుండి వివిధ నిషేధిత సంస్థలకు చెందిన తొమ్మిది మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. కిడ్నాప్, దోపిడీ కార్యకలాపాలలో పాల్గొన్న నిషేధిత కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (నోయోన్) నలుగురు క్రియాశీల సభ్యులను శుక్రవారం తౌబాల్ జిల్లాలోని చింగ్డోంపోక్ ప్రాంతం నుండి అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. మరో ఆపరేషన్‌లో, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖబీసోయ్ ప్రాంతం నుండి దోపిడీ కార్యకలాపాలలో పాల్గొన్న కెసిపి (పిడబ్ల్యుజి) క్రియాశీల సభ్యులు నలుగురిని భద్రతా దళాలు శుక్రవారం అరెస్టు చేశాయి. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని నుంగోయ్ అవాంగ్ లీకై ప్రాంతం నుండి యుఎన్‌ఎల్‌ఎఫ్ (పాంబే) క్రియాశీల సభ్యుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టు చేయబడిన వ్యక్తి ఇంఫాల్ నగరం, చుట్టుపక్కల దోపిడీ కార్యకలాపాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి రవాణాలో పాల్గొన్నాడని వారు తెలిపారు, అతని వద్ద నుండి ఒక .32 పిస్టల్ స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. ఇదిలా ఉండగా, శుక్రవారం కాచింగ్ జిల్లాలోని హియాంగ్లామ్ నతేఖోంగ్ థోంగ్జిన్ ప్రాంతంలోని నది ఒడ్డున రెండు సింగిల్ బ్యారెల్ గన్‌లు, ఒక మోడిఫైడ్ స్నిపర్ రైఫిల్ విత్ స్కోప్, ఒక కంట్రీ మేడ్ పిస్టల్, ఐదు హ్యాండ్ గ్రెనేడ్‌లు, నాలుగు ఐఇడిలు, ఇన్సాస్ రైఫిల్ లైవ్ రౌండ్లు, ఒక 9 ఎంఎం పిస్టల్‌తో పాటు రెండు హ్యాండ్‌సెట్‌లు, ఒక చైనా తయారీ డ్రోన్‌ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.

## ప్రార్థనాస్థలాల చట్టం పిటిషన్‌లపై 17న 'సుప్రీం' విచారణ



### ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా బెంచ్ విచారణ జరుపనున్నట్లు వెబ్‌సైట్ కాజ్‌లిస్ట్‌లో వెల్లడి

**న్యూఢిల్లీ :** ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టానికి సంబంధించిన పిటిషన్‌లను సుప్రీంకోర్టు ఫిబ్రవరి 17న విచారించనుంది.సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన కాజ్‌లిస్ట్ ప్రకారం ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కెవి.విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్లత విచారణను చేపట్టనున్నది. 1947ఆగస్టు 15న ఉనికిలోనున్న ఏ స్థల ఆరాధనకు సంబంధించిన మతపరమైన స్వభావాన్ని నిర్వహించడం కోసం ఏదైనా ప్రార్థనా స్థలాన్ని మార్చడాన్ని చట్టం నిషేధిస్తుంది.అయితే అయోధ్యలోని రామజన్మభూమిబాబ్రీ మసీదుకు సంబంధించిన వివాదాన్ని దానికి దూరంగా ఉంచింది.1991చట్టంలోని కొన్ని నిబంధనల చెల్లుబాటును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన కొన్ని పిటిషన్లు ఉన్నాయి. ప్రార్థనాస్థలాల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాద్‌ఉల్‌ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ దాఖలు చేసిన పిటిషన్‌ను జనవరి 2న సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. గత ఏడాది డిసెంబరు 12న ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని 1991చట్టానికి సంబంధించిన అభ్యర్థనల బ్యాచ్‌పై విచారణను జరుపుతూ మతపరమైన స్థలాలను ముఖ్యంగా మసీదులు, దర్గాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుతూ పెండింగ్‌లలో ఉన్న కేసులలో తాజా దావాలు ,ప్రభావవంతమైన మధ్యంతర ఉత్తర్వులను జారీచేయకుండా కోర్టులను నిరోధించింది. 1991చట్టంలోని వివిధ నిబంధనలను సవాల్ చేస్తూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్లను ధర్మాసనం విచారించింది. గత ఏడాది నలుగురి ప్రాణాలను బలిగొన్న నేపథ్యంలో వారణాసిలోని జ్ఞాన్‌వాపి, మధురలోని షాహీ ఈద్గా మసీదు, సంభాల్‌లోని షాహీ జామా మసీదు సహా 10మసీదుల అసలు మతపరమైన స్వభావాన్ని నిర్ధారించేందుకు వివిధ హిందూ పార్టీలు దాఖలు చేసిన 18వ్యాజ్యాలపై డిసెంబరు 12న అత్యున్నత న్యాయస్థానం తన ఆదేశాలను ప్రభావితం చేసింది. ఈ విషయం ఈ కోర్టు ముందు సబ్ జుడీస్ అయినందున తాజా దావాలు దాఖలు చేయబడినప్పటికీ ఎటువంటి దావాలు వేయకూడదని మేం ఆదేశించడం సముచితం గా భావిస్తు న్నాం. మసీదుల ప్రస్తుత స్థితిని, మత సామరస్యాన్ని పరిరక్షించేందుకు 1991నాటి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతూ అనేక క్రాస్ పిటిషన్లు ఉన్నాయి. ఆక్రమణదారులు వాటిని ధ్వంసం చేయడానికి ముందు అవి దేవాలయాలుగా ఉన్నందున వాటిని తిరిగి పొందాలని కోరింది.జ్ఞాన్‌వాపీ మసీద్ మేనేజ్‌మెంట్ కమిటీ సహా వివిధ ముస్లిమ్ పార్టీలు 1991చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాల్‌చేసే అనేక పిటిషన్లను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

# కబళించిన మృత్యువు

### రోడ్డు ప్రమాదంలో 14మంది కుంభమేళా యాత్రికుల మృతి



**ప్రయాగ్‌రాజ్/దాహోద్ :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు నిత్యం కోటి మంది మేరకు భక్తులు విచ్చేస్తున్నారు. అయితే భక్తులు వస్తూ, వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కుంభమేళాకు వెళ్లి తిరిగివస్తుండగా, మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించిన ఏడుగురు హైదరాబాద్ వాసులు మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లోనూ కుంభమేళా యాత్రికులను మృత్యువు కబళించింది. రెండు రాష్ట్రాల్లో జరిగిన ప్రమాదాల్లో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... శుక్రవారం రాత్రి ప్రయాగ్‌రాజ్ మేజా పోలీస్ స్టేషన్ పరిధిలో బొలెరో కారు, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పది మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. యాత్రికులు ఛత్తీస్‌గఢ్ కోర్బా జిల్లాకు చెందిన వారని డిసిపి వివేక్ చంద్ర యాదవ్ తెలిపారు. కుంభమేళాలో పాల్గొనేందుకు వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయన్నారు. కారులో ఉన్న పది మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. అదే విధంగా బస్సులో ఉన్న వారికి కూడా స్వల్పంగా గాయాలయ్యాయన్నారు. మృతుల్లో నలుగురిని ఆధార్‌కార్డుల ద్వారా, మరో ఆరుగురిని వారి బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు గుర్తించామన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రయాగ్‌రాజ్‌లోని ఎస్ఆర్ఎన్ ఆసుపత్రికి తరలించామని డిసిపి చెప్పారు. ఘటన పట్ల ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా, గుజరాత్ దాహోద్ జిల్లాలోనూ కుంభమేళాకు వెళ్లి తిరిగి వెళ్తున్న క్రమంలో టూరిస్ట్ వ్యాన్ ట్రక్కును ఢీకొట్టంది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, ఆరుగురు గాయపడినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2.15 గంటలకు ఇండోర్–అహ్మదాబాద్ హైవేపై జరిగిందన్నారు. టూరిస్ట్ వ్యాన్ పది మంది యాత్రికులతో వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన పార్క్ చేసిన ట్రక్కును ఢీకొట్టింది. ఘటనలో మహిళా సహా నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని, మరో ఆరుగురు మృతి చెందారని అధికారులు చెప్పారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామన్నారు.

## కృత్రిమ మేధతో భవిష్యత్తు అద్భుతం

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**రాంచి :** కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్‌తో భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రభుత్వం ఉన్నత విద్యా వ్యవస్థలో కృత్రిమ మేధను జోడించేందుకు చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ విషయంలో రాంచిలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ( బిట్) సంస్థ కృత్రిమ మేధ కోర్సులను ప్రవేశపెట్టడం గర్వకారణమన్నారు. 'ప్రస్తుతం సాంకేతిక యుగం నడుస్తోంది. సమాచార సాంకేతిక రంగంలో కొత్త పరిణామాలు మన జీవన విధానంలో గణనీయమైన మార్పులు తెచ్చాయి. నిన్నటివరకు ఊహించనివి నేడు సాకారమవుతున్నాయి. రానున్న రోజులు మరింత నాటకీయ పరిణామాలను చూడబోతున్నాం. ముఖ్యంగా కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్‌తో ఎన్నో మార్పులు చోటు చేసుకోనున్నాయి' అని ముర్ము అన్నారు. మెస్రాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా ముర్ము మాట్లాడుతూ కృత్రిమ మేధ ఆర్థిక రంగంలో వేగవంతమైన మార్పులను తెస్తుండడంతో ప్రభుత్వం ప్రస్తుత పరిణామాలకు అనుగుణంగా స్పందిస్తున్నదన్నారు. ఉన్నత విద్యావ్యవస్థలో కృత్రిమ మేధను సమ్మిళితం చేసేందుకు చొరవ తీసుకుంటున్నదన్నారు. అయితే కృత్రిమ మేధను ఉపయోగించడంలో జాగరూకతతో ఉండాలని, అన్ని సమస్యలకు కృత్రిమ మేధ ఉపయోగం పరిష్కారం కాదన్నారు. సాంప్రదాయ సాంకేతికలను విస్మరించరాదన్నారు. ఆధునిక ఆవిష్కరణలు అందరికీ అందుబాటులో ఉండాలని, అయితే అందరికీ ఉపయుక్తమైన రీతిలో ఆధునిక సాంకేతిక ఉపయోగించాలన్నారు. పరిశోధన, సాంకేతిక, విద్యా సంబంధమైన విషయాలలో బిట్ మెస్రా ఎంతో ప్రగతిని సాధించిందని, స్పేస్ ఇంజినీరింగ్, రాకెట్ సాంకేతికత, తదితర రంగాలలో ఎన్నో ఆవిష్కరణలకు, కొత్త కోర్సులను ప్రవేశపెట్టడంలో ఆదర్శవంతంగా ఉందన్నారు. 'వికసిత్ భారత్'ను ఆవిష్కరించడంలో యువత ఆసక్తి, నిబద్ధత ఎంతో ముఖ్యమన్నారు. సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ, మాథమాటిక్స్ అంశాలలో భారతీయ విద్యార్థినులు ఎవరికీ తీసిపోరని నిరూపిస్తున్నారని రాష్ట్రపతి ప్రశంసించారు. పలు రంగాలలో బిట్ మెస్రా మార్గదర్శకంగా నిలిచిందని ముర్ము కొనియాడారు. స్పేస్ ఇంజినీరింగ్, రాకెట్ టెక్నాలజీకి సంబంధించిన కోర్సులు 1964లో తొలిసారి బిట్ మెస్రాలోనే ప్రవేశపెట్టారు. తొలి సైన్స్ అండ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పార్క్‌ను 1975లో ఇక్కడే స్థాపించారు. వజ్రోత్సవం సందర్భంగా కృత్రిమ మేధలో నడిచే రోబోలు, స్వయం చలిత కార్లతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ముర్ము ప్రారంభించారు. రెండు రోజుల జార్ఖండ్ పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ముర్ము శుక్రవారం ఇక్కడకు చేరుకుని రాజ్‌భవన్‌లో బసచేశారు. రాష్ట్రపతి రెండు రోజుల పర్యటన సందర్భంగా జార్ఖండ్ రాజధానిలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

## 'ఆప్'కు షాక్.. బిజెపిలోకి పార్టీ కౌన్సిలర్‌లు

**న్యూఢిల్లీ :** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి ఢిల్లీలో అధికారం కోల్పోయిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు పుండుమీద కారంలా మరో షాక్ తగిలింది. ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ ఎన్నికల ముందు ఆప్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్‌లు బిజెపిలో చేరారు. ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ సమక్షంలో వారు కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. ఏప్రిల్‌లో మున్సిపల్ కార్పోరేషన్ ఆఫ్ ఢిల్లీలో మేయర్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ పరిణామం ఆప్‌కు గట్టి ఎదురుదెబ్బ అనే చెప్పవచ్చు. ఆప్ కౌన్సిలర్లు అనిత బసోయ (ఆండ్రూస్ గంజ్), నిఖిల్ చాప్రాన (హరి నగర్), ధర్మవీర్ (ఆర్కే పురం) బిజెపి కండువా కప్పుకున్నారు. అనంతరం సచ్‌దేవ మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో త్వరలో కేంద్రం, అసెంబ్లీ, మున్సిపల్ స్థాయిల్లో ట్రిపుల్ ఇంజన్ సర్కారు ఏర్పడనుందని, మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యసాధనలో భాగంగా ఢిల్లీ అభివృద్ధికి ఇదే సరైన తరుణమని అన్నారు. ఢిల్లీని క్లీన్ అండ్ బ్యూటిఫుల్ సిటీగా మార్చేందుకు ఆప్ కౌన్సిలర్లు బిజెపిలో చేరారని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్‌లో మేయర్ ఎన్నికలు వచ్చే ఏప్రిల్‌లో జరగాల్సి ఉంది. 2024 నవంబర్‌లో మేయర్ ఎన్నికలు జరుగగా మూడు ఓట్ల ఆధిక్యంతో ఆప్ గెలిచింది. ఎంసిడి మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో కౌన్సిలర్లతోపాటు ఏడుగురు లోక్‌సభ సభ్యులు, ముగ్గురు రాజ్యసభ సభ్యులు, 14 మంది నామినేటెడ్ ఎమ్మెల్యేలకు ఓటింగ్ హక్కు ఉంటుంది. తాజాగా ముగ్గురు ఆప్ కౌన్సిలర్లు బిజెపిలో చేరడంతో ఆప్ సంఖ్యాబలాన్ని బిజెపిఅధిగమించినట్లయ్యింది. 2022లో జరిగిన ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో ఆప్ 134 వార్డులు, బిజెపికి 104 వార్డులు, కాంగ్రెస్‌కు 9 వార్డులు, ఇండిపెండెంట్లకు 3 వార్డులు దక్కాయి. అయితే మేయర్ ఎన్నికల్లో లోక్‌సభ సభ్యులు, నామినేటెడ్ ఎమ్మెల్యేల్లో కొందరు, ఇండిపెండెంట్ కౌన్సిలర్‌లు (3), కాంగ్రెస్ కౌన్సిలర్‌లు బిజెపి అభ్యర్థికి అనుకూలంగా ఓటేశారు. దాంతో బిజెపి బలం 134 అయ్యింది. కానీ రాజ్యసభ సభ్యులు ముగ్గురు ఆప్‌కు ఓటేయడంతో మూడు ఓట్ల తేడాతో ఆప్ ఢిల్లీ మేయర్ పీఠం దక్కించుకుంది. కాగా ఈనెల 13న ఎంసిడి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.17 వేల కోట్లతో బడ్జెట్‌ను కార్పోరేషన్ ఆమోదించింది. అందులో పారిశుధ్యానికి అత్యధికంగా రూ.4,907.11 కోట్లు కేటాయించారు.

## ప్రజాపక్షం విలేకరి ఎండి.గౌస్ గుండె పోటుతో మృతి



ప్రజాపక్షం/యాదాద్రి: రామన్నపేట ప్రజాపక్షం సీనియర్ విలేకరి ఎండి. గౌస్ మృతి పట్ల యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాపక్షం విలేకర్లు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రామన్నపేట ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడంలో గౌస్ ముందుండేవారని, ప్రజాపక్షం రిపోర్టర్‌గా సంస్థకు ఎనలేని సేవలు అందించిన గౌస్ అన్ని రాజకీయ పార్టీల మన్ననలు పొం దారని పేర్కొన్నారు. ఆకస్మికంగా గుండెపోటుతో మరణించిన గౌస్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి అం డగా ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు.

## ఆటో కార్మికులకు రూ. 12వేలు ఇవ్వాలి




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: కాంగ్రెస్‌ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు రూ. 12వేల ఆర్థికసాయం ఇవ్వాలని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో రాష్ట్ర జెఏసి పిలుపుతో ఆటో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం అవల ంబిస్తున్న విధానాలనే అవలంభిస్తుందన్నారు. ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బం దులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యాదగిరి, నాయకులు ఎర్రన్న, లింగయ్య, రాజు, విష్ణు, రవి, బుచ్చయ్య, నవీన్, సతీష్, పాల్గొన్నారు.

## టాటా ఏస్ వాహనం బోల్తా.. పదిమందికి గాయాలు



ప్రజాపక్షం/కోదాడరూరల్: పొట్టకూటి కోసం వెళ్తూ టాటా ఏసి వాహనం బొల్తాపడి గాయాలైన సంఘటన శనివారం సూర్యాపేట జిల్లా బొజ్జగూడెం గ్రామం తండా గ్రామశివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం హుజూ ర్‌నగర్ నుండి బొజ్జగూడెంతండాకు సిసి రోడ్డు పనులకు వస్తుం డగా వాహనం అదుపుతప్పి పంట పొ లాల్లోకి పల్టీ కొట్టడంతో పదిమందికి గాయాలయ్యాయని, వెంటనే చికిత్స నిమిత్తం వారిని కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

## మరోసారి కులగణన సర్వే



ప్రజాపక్షం/యాదాద్రి : తెలంగాణలో తొలిసారి చేపట్టిన కులగణన సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో ఎవరైతే వివిధ కారణాలచే నమోదు చేసుకో లేదో అటువంటి వారి కోసం మరోసారి సర్వే నిర్వహణ ఉంటుందని జిల్లా కలెక్టర్ హనుమంత రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16నుంచి 28 వరకు సర్వేను నిర్వహి స్తామని, ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు టోల్ ఫ్రీ నెంబర్ 040–211111111కి ఫోన్ చేయవచ్చని, ప్రజాపాలన సేవా కేంద్రాలలో, అలా గే ఆన్లైన్‌లో ఫారంని డౌన్లోడ్ చేసుకొని దానిని సంబంధిత ప్రజాపాలన కేంద్రాలలో ఇచ్చి ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా పాలన సేవా కేంద్రాలు (పిపిఎస్‌కె) నేరుగా కేంద్రాలకు వెళ్ళి నమోదు చేసుకోగలరు. ఆన్లైన్ సర్వే ఫారం ద్వారా https://seeepcsurvey.cgg.gov.in సైట్‌లో నింపి, సంతకంతో ప్రజా పాలన సేవాకేంద్రాలు(పిపిఎస్‌కె) ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సర్వేకు సహకరించాలని, పూర్తి వివరాలను ఇవ్వాలని కోరారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసిల గెలుపు రాజకీయాలకు మలుపు

జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: ప్రస్తుతం జరిగే నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసిఅభ్యర్థి అయిన పూల రవీందర్‌కి బిసి ఉపాధ్యాయ ఉద్యోగులు మద్దతు పలికి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని బిసిసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సంస్థాన్ నారాయణపురంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిసి సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బిసిల ఐక్యతను చాటిచెప్పుతూ అగ్రకుల ఆధిపత్య రాజకీ యాలకు తేరదించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో 43 మంది రెడ్డి ఎమ్మెల్యేలు ఉన్నారని, ఈ ఎన్నికల్లో మరొక రెడ్డిని గెలిపించి 44 మందిని చేయడం సరికాదని 60 శాతం ఉన్న బిసిలు కేవలం 19 మంది మాత్రమే ఉండాలని బీసీలను గెలిపించి చట్టసభల్లో బీసీల వానిని వినిపించేలా బీసీ సమాజం ఆలోచించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమల్ల కార్తీక్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వెంకటేష్ గౌడ్, నీళ్ల లింగస్వామి, బీసీ యువజన సంఘం నారాయణపూర్ మండల ఉపాధ్యక్షులు కొల్లూరు నవీన్, జాజుల భాస్కర్, యాదగిరి, ప్రవీణ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలి

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ప్రజాపక్షం/ఆత్మకూర్(యం): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించే బాధ్యత పార్టీ శ్రేణులు తీసుకుని ముందుకు సాగా లని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. శనివారం మండలం కేంద్రంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఎన్ని అడ్డంకులు ఎదురైనా అమ లు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక కార్యా చరణ రూపొందించి, ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనూతల ప్రమీల, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, డైరెక్టర్ నోముల వెంకన్న, మండల పార్టీ నాయకులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, జెన్నాయికోడె నగేష్, అనంతరెడ్డి, హనుమతు, పోతేగాని మల్లేశం, పాల్గొన్నారు.

# ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బొమ్మగాని ధర్మభిక్షం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్



ప్రజాపక్షం/చిట్యాల : గీసే వాడిదే చెట్టు, దున్నేవానిదే భూమి అన్న నినాదంతో పేదలను సమీకరించి పోరాడిన గొప్ప నాయకులు ధర్మభిక్షం అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలోని కనకదుర్గ సెంటర్‌లో శనివారం మాజీ పార్లమెంట్ సభ్యులు, సిపిఐ నాయకులు బొమ్మగాని ధర్మభిక్షం జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరా టంలో జైలు జీవితం గడిపి నైజాం ప్రభుత్వాన్ని గద్దించడంలో కీలక భూమిక పోషించిన వ్యక్తి ధర్మభిక్షం అని, గీత పని వారల సమస్యల కోసం అనునిత్యం పోరాడిన గొప్ప ఆదర్శ నాయకుడని శ్రవణ్‌కుమార్ కొనియడారు. గీత పనివారం సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ చెట్టు ఎక్కే గీత కార్మికులందరికి కాటమయ్య కిట్లు అందజేయాలని, దరఖాస్తు చేసుకున్న కొత్త సొసైటీలకు లైసెన్స్‌లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి అక్బర్, షేక్ షరీఫ్, కూనూరు అంజయ్యగౌడ్, పొన్నం లక్ష్మయ్య, పంతంగి వెంకన్న గౌడ్, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, కూనూరు మారయ్య, శంకర్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు



ప్రజాపక్షం/చండూరు : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ,మాజీ ఎంపి ,ప్రజల మనిషి ,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని గీత పనివారల సంఘం నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్యగౌడ్ అన్నారు. ధర్మభిక్షం 103వ జయంతిని పురస్కరించుకొని శనివారం చండూరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ ధర్మభిక్షం పార్టీకి ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య ,బొడ్డు వెంకటేశ్వర్లు , బంగారిగడ్డ సిపిఐ శాఖ కార్యదర్శి పల్లె నర్సింహ్మా, కాటపల్లి శ్రీను, మల్లేశం , లక్షకోటి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికాసంతో విద్యార్థుల అభివృద్ధి

చిట్యాల మున్సిపల్ కమిషనర్ వీరేందర్



ప్రజాపక్షం/చిట్యాల: విద్యా సంస్థలలో విద్యార్థులకు విద్యతో పాటు మానసిక వికాసం అభివృద్ధి చెందేలా కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వాలని నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపల్ కమిషనర్ పి.వీరేంధర్ అన్నారు. స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శనివారం జరిగిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో మూస పద్ధతిలో పాఠాలు భోదించడమే కాకుండా విద్యేతర అంశాల బోధనను కూడా చేపట్టాలన్నారు. జీవితంలో విద్య ఎంత అవసరమో దానికి ధీటుగా పిల్లలను ఉత్సాహ పరిచే ఇలాంటి కార్యక్రమాలను పాఠశాలలో చేపట్టాలని సూచించారు. విద్యార్థులను అన్ని రంగాలలో ప్రోత్సాహన్ని అందించడానికి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదం డ్రుల శ్రద్ధ తీసుకోవాలని వీరేందర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది నమ్ముల ఆనందకుమార్, పెద్ది పద్మ, షేక్ షమీమున్నీసా బేగం, ఎం.ధనలక్ష్మి , ఎస్ జ్యోతి, పి.స్వాతి, పి రమాదేవి, ఎన్.మాధవి, జుబేదా, కె.మౌనిక, సిహెచ్ ప్రసన్న, ఎస్.స్వప్న, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సేవాలాల్ ఆశయాల సాధనకు కృషి

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్‌సేవాలాల్ మ హారాజ్ మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నా రు. శనివారం సంత్‌సేవాలాల్ 286వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం నుంచి నిర్వహించిన ర్యాలీలో ముఖ్య అతిథులుగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శం కర్‌నాయక్‌లతో కలిసి పాల్గొని బంజారా భవన్ వరకు చేరుకోని మహా బోగ్‌బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సంత్ సేవాలాల్ ఆశయాలను సాధించేవిధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుం దన్నారు. ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడం జరిగిందన్నారు. కార్య క్రమంలో స్కైలాబ్‌నాయక్, మాలోతు దశరద్‌నాయక్, భూక్యా లక్ష్మ ణ్ నాయక్, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

## జాతరలు సాంస్కృతి, సంప్రదాయాలకు నెలవులు



ప్రజాపక్షం/ హాలియా: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువుగా జాతరలు నిలుస్తాయని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసి కోటిరెడ్డి అన్నారు. మండలంలోని మారేపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ సమేత వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న ఎడ్ల పందాలను ఆయన ప్రారంభించారు. ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎడ్ల పందాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయాలకు జాతరలు ప్రతిబింబిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది అంజాద్ ఖాన్, అనుముల యాదయ్య, మారేపల్లి క్రాంతి, మెండే ఏడుకొండలు, రుద్రాక్ష బిక్షపతి, శ్రీను, భీమ నాయక్, వెంకటయ్య, దుర్గ శంకర్, నాగరాజు, గణపతి, వెంకన్న, పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర మహిళా నేరస్థులు అరెస్టు

రద్దీ ప్రదేశాలే వారి టార్గెట్

బంగారం..నగదు..స్వాధీనం

డిసిపి రాజేష్ చంద్ర



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: రద్దీగా ఉండే ప్రదేశాలలో బస్టాండ్, బ్యాంక్‌ల వద్ద పర్స్, బ్యాగ్‌లను దొంగతనం చేస్తున్న అంతర్రాష్ట్ర మహిళా నేరస్థులను భువనగిరి టౌన్ పిఎస్ పోలీసులు పట్టుకుని అరెస్టు చేసినట్లు యాదాద్రి భువ నగిరి జోన్ డిసిపి రాజేష్ చంద్ర తెలిపారు. శనివారం కేసుకు సంబంధించిన వివరాలను ఆయన భువనగిరిలోని డిసిపి క్యాంపు కార్యాలయంలో వెల్లడిం చారు. ఈ నెల 11న భువనగిరి బస్టాండులో బస్సు కోసం వేచి చూస్తున్నా ఒక ప్రయాణికురాలి బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని, వెంటనే గమనించిన మహిళ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ ఫిర్యాదు మేరకు భువనగిరి టౌన్ పోలీసులు రంగంలోకి దిగి సిసి కెమెరాలు, అనుమానస్పద వ్యక్తులను ఆధారంగా కేసు విచారణ ప్రారంభించారన్నారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం భువనగిరి బస్టాండులో విశ్వసనీయ సమా చారం మేరకు భువనగిరి బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిని విజయవాడ జిల్లా రామవరపుపాడుకు చెందిన గన్నికోట దుర్గ, నక్క మంగ, వెస్ట్ గోదావరి జిల్లా చింతలకోటి గరువుకు చెందిన గండికోట లక్ష్మీలుగా గుర్తించారు. వీరిని విచారణ చేయడంతో నేరానికి పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు డిసిపి వెల్లడించారు. వారి వద్ద నుండి రూ.3,40, 000 విలువ గల (బంగారు ఆభరణాలు, నగదు) స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు నక్క మో హన్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. నిందితులు గతంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక చోట్ల ఇదే తరహా నేరాలకు పాల్పడినట్లు చెప్పారు.

## కెవికె గడ్డిపల్లిని సందర్శించిన కలెక్టర్



ప్రజాపక్షం/సూర్యాపేట(గరిడేపల్లి): మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని (కెవికె)ను శనివారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సందర్శించారు. వివిధ శిక్షణ కార్యక్ర మాలు, విస్తరణ కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. శాస్త్రవే త్తలతో భూసార పరీక్షల కేంద్రం, జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రం, అజోల్ల యూనిట్, నేరుగా విత్తే పద్దతిలో వరిసాగు, షెడ్ నెట్‌లో కూరగాయల నారు పెంపకం, వర్మి కంపోస్ట్ యూనిట్, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిటన్ సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, వ్యవసాయ రంగంలో సుస్థిరత సాధించేందుకు ఈ విధమైన కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. కెవికె గడ్డిపల్లి నిర్వహించే కార్యక్రమాలకు భవిష్యత్తులో సహకారం అందిస్తామన్నారు. అనంతరం హార్టికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులతో మాట్లాడి కోర్సు వివరాలు, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జి శ్రీధర్ రెడ్డి, స్పెషల్ అధికారి బి.శ్యాంసుందర్ ప్రసాద్, హుజూర్‌నగర్ ఎడిఎ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి ప్రీతం కుమార్, కెవికె గడ్డిపల్లి శాస్త్రవేత్తలు డి నరేష్, ఎ కిరణ్, టి మాధూరి, డి ఆదర్శ్, సుగంధి తదితరులు పాల్గొన్నారు.

## బంజార సాంప్రదాయాలను సంరక్షించిన సేవాలాల్

సూర్యాపేట ఆర్‌డిఒ వేణుమాధవరావు

ప్రజాపక్షం/సూర్యాపేట: బంజారల సంస్కృతి, సాంప్రదాయాలలను సంరక్షించిన మహా నీయుడు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అని ఆర్‌డిఒ వేణుమాధవరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జివివి గార్డెన్‌లో జరిగిన శ్రీ సేవాలాల్ మహారాజ్ జయ ంతిని ఉత్సవ కమిటీ కన్వీనర్ ధరావత్ వీరన్న నాయక్ అధ్యక్షతన నిర్వహించిన భోగ్ భండార్ కార్యక్రమంలో పాల్గొని సేవాలాల్ మహారాజ్, మేరామాయాడిలకు ప్రత్యేక పూ జలు చేశారు. ఆయన మాట్లాడుతూ బంజారులు విద్యా వంతులు కావాలని, చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని ప్రజలకు బోధనలు చేసి చైతన్యం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు శ్యాంసుందర్ రెడ్డి, లాలు నాయక్, హరిచంద్ర ప్రసాద్, కృష్ణయ్య, కో కన్వీనర్ జాటోతు రాజేష్ నాయక్, ధారాసింగ్ నాయక్, మంగ్తా నాయక్, వాంకుడోతు వెంకన్న నాయక్, హుస్సేన్ నాయక్, భూక్యా పాండు నాయక్, అజయ్ నాయక్, బాలు నాయక్ పాల్గొన్నారు.

## 20 నుండి సిపిఐ గ్రామశాఖ మహాసభలు

స్థానిక సంస్థల ఎన్నికల బరిలో సిపిఐ పోటీ : పల్లా నర్సింహారెడ్డి




ప్రజాపక్షం/దేవరకొండ : 20 నుండి జరిగే సిపిఐ గ్రామశాఖ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం దేవరకొండలోని పల్లా పర్వత్ రెడ్డి భవన్‌లో జరిగిన దేవరకొండ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ బరిలో నిలిచేందుకు సిద్ధం కావాలని తెలిపారు. స్థానిక సంస్థలైన ఎంపిటిసి, జెడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీ చేసి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే ఎర్రజెండా గ్రామ గ్రామానికి విస్తరించాలని, ప్రజాసమస్యలపై పోరాడేది సిపిఐ మాత్రమేనని ఆ పార్టీ అవసరాన్ని ప్రజలు గుర్తించి కమ్యూనిస్టు పార్టీ లో చేరాలని కోరారు. పార్టీ శ్రేణులు అన్ని గ్రామాలు తిరిగి కొత్త శాఖలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. దేవరకొండ నియోజకవర్గానికి సాగు నీరు అందించే డిండి ఎత్తిపోతల ప థకాన్ని వెంటనే పూర్తి చేయాలని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు సంక్షేమ పథకాలు ఇచ్చే ప్రక్రియ వెంటనే చేపట్టి అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, వెంకట్రాములు, రాంరెడ్డి, వెంకటయ్య, మైనోద్దిన్; యాదయ్య, మండల కౌన్సిల్ సభ్యులు మాధవరెడ్డి, భూపాల్‌రెడ్డి, గోవర్ధన్, నగేష్, జ్యోతిబస్, బారిములు, శ్రీను, మల్లేష్, పార్వతాలు, శంకర్ పాల్గొన్నారు.

# పెద్దగట్టుకు తరలిన 'మరక'

భక్తుల కల్పవల్లి దురాజ్‌పల్లి

నేటి నుండి శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర షురూ



ప్రజాపక్షం/సూర్యాపేట/సూర్యాపేట టౌన్: ఈనెల 16 నుండి ఐదు రోజుల పాటు జరగనున్న శ్రీలింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతర మహోత్సవంలో స్వామి వారి మరకతోరణం శనివారం జిల్లా కేంద్రంలోని గొల్లబజార్ నుండి డప్పు చప్పుళ్ళ మోతతో ఘనంగా తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, టిపిసిసి సభ్యులు కొప్పుల వేణారెడ్డిలు మాట్లాడుతూ ఐదుల పాటు జరిగే లింగమంతుల స్వామి జాతరలో భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వ అధికారులు భక్తులకు ఏలాంటి ఇబ్బం దులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కోడిశివ యాదవ్, హరీష్‌యాదవ్,బత్తుల సాయి, వల్లపు రఘువీరన్ యాదవ్, కోడి కృష్ణ, అన్నమయ్య రాము, సైదులు, చందు, అఖిల్ పాల్గొన్నారు. హైదరాబాద్–విజయవాడ మహానగరాల మార్గమధ్యన సూర్యాపేట పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో దురాజ్ పల్లి గ్రామం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారి ప్రాంతమంతా భక్తజన కెరటాల తాకిడికి ఉక్కిరి బిక్కిర వుతుంది. సమీప రాష్ట్రాలైన చత్తీస్‌గడ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుండి అసం ఖ్యాకంగా భక్తులు తమ ఆరాధ్యదైవం, ఇలవేల్పు అయిన శ్రీలింగమంతులస్వామి(పెద్దగట్టు)కి మొక్కు బడులు చెల్లించు కునేందుకు లక్షలాదిగా తరలి వస్తారు.

**సర్వాంగ సుందరంగా పెద్దగట్టు..** పెద్దగట్టు శ్రీ లింగమంతులస్వామి జాతర సందర్భంగా దేవాలయాన్ని దేవాదాయశాఖ అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేవాల యానికి రంగులు దిద్దడంతో పాటు రంగు రంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ఎండవేడిమిని తట్టుకునేందుకు చలువ పందిళ్లు వేశారు. పారిశుద్ధ పరిరక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించి చర్యలు చేపట్టారు.



**జాతరకు భారీ బందోబస్తు..** శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 2వేల మంది పో లీసులతో భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ కల్పించనున్నారు. జాతరలో ఏలాంటి అవా ంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్‌పి సన్‌ప్రీత్ సింగ్ పర్యవేక్షణలో అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, డిఎస్‌పి రవిల ఆధ్వర్యంలో ఐదు రో జుల పాటు పోలీసులు విధులు నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు హైదరా బాదాద్ విజయవాడ ప్రధాన రహదారి నుండి వాహ నాల మళ్లింపు చేపట్టారు. హైద్రాబాద్ నుండి వచ్చే వాహనాలను నార్కెట్ పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడల మీదుగా విజయ వాడకు, విజయవాడ నుండి వచ్చే వాహనాలు కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాల గూడ, నల్లగొండ, నార్కెట్ పల్లి మీదుగా హైద్రాబాద్‌కు మళ్లించనున్నరు. ద్రాబాద్ నుండి ఖమ్మంకు వెళ్లే వాహ నాలను టేకుమట్ల వద్ద 365 బిబి మీదుగా ఖమ్మంకు మళ్లిస్తున్నట్లు తెలిపారు. జాతరలో అఏలాంటి అవా ంచనీయ సంఘటనలు లేకుండా ఉండేందుకు 60 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం నాలుగు ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేశారు. జాతరలో తప్పిపోయిన పిల్లల కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.



**60 ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు..** జాతరకు భక్తులను చేరవేసేందుకు సూర్యా పేట ఆర్‌టిసి డిపో నుండి 60 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. సూర్యాపేట నుండి పెద్దలకు రూ. 40, పిల్లలకు రూ. 20చొప్పున చార్జీలు వసూళ్లు చేయనున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఇవిఎం గోదాముల పరిశీలన

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణిలు శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా ఇవిఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సిసి కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన దాడి అత్యంత ఘోరమైన ఉగ్ర దాడి అని దేశం మొత్తానికి తెలుసునని సాయుధ పోలీస్ బలగాల సిబ్బంది సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి సురేందర్ నాథ్ అన్నారు. 1000 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లతో జమ్మూ నుండి శ్రీనగర్ వెళ్తన్న కాన్వాయి పైకి జైశ్‌ఎమహమ్మద్ ఆత్మహుతి బాంబర్ పుల్వామా దగ్గర 100 కిలోల విస్పోట పదార్థాలను ఉపయోగించి ఢీకొట్టిన దాడిలో 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు వీరమరణం చెందారని, వారు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా భారతమాతకు సమర్పించి వీరమరణం చెందినందున శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించడానికి తాము అనగా తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సంక్షేమ సంఘం (సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బి,అస్సాం రైఫిల్స్) ఆధ్వర్యంలో హనుమకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిగ్నల్ పాయింట్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించామని చెప్పారు. ఈ దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులను స్మరించుకోవడానికి జంట నగరాలలో నివసిస్తున్న కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించినట్లు సురేందర్ నాథ్ తెలిపారు.

## కులగణన దేశానికి ఆదర్శం: ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/టేకుమట్ల:** టేకుమట్ల మండల కేంద్రంలో టే మండలం పార్టీ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పూర్తి చేసిందన్నారు. దీనితో పాటు ఎస్సి వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసిన నిర్ణయాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలి అని అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. మండలాలలోని నాయకులు పాత, కొత్త అనే అభిప్రాయం లేకుండా సమన్వయంతో పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి స్థానాలు గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. గ్రామాల్లోని గ్రామ కమిటీలు, మండల కమిటీలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. టేరారు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ గౌడ్ కు గజమాలతో సత్కరించారు. అనంతరం మండలం కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, మాజీ జడ్‌నిటిసి పులి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ ప్రజప్రతినిధులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్యకర్తలు సమన్వయంతో పనిచేయకపోతే సహించేది లేదు

**ప్రజాపక్షం/చిట్యాల:** మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పని చేస్తూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా కార్యకర్తలు అందరూ కృషి చేయాలని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని జూకల్ ఓ ఫంక్షన్ హాల్లో శనివారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అధ్యక్షతన లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడుతూ, మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామాలలో సురుకైన సైనికుల పనిచేసుకుంటూ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర పిసిసి అధికార ప్రతినిధి గాదర్ల అశోక్,ఏఎంసి చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య, నాయకులు చిలుకల రాయకోమురు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, మండల కార్యదర్శి గడ్డం కొమురయ్య, టౌను అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, కామిడి రత్నాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ జనగామకు చెందిన గండ్ర దినేష్ అనే వ్యక్తి శనివారం హైదరాబాద్ నుండి ఖాజీపేట వైపు వెళ్లె రైతులు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం జనగామ పట్టణానికి చెందన గండ్ర దినేష్ డిగ్రీ చదువుతు మార్గమధ్యలోనే వదిలేశాడు. ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్న దినేష్‌కు జీతం డబ్బులు సరిపోకపోవడంతో మనస్థాపానక గురై ఆత్మహత్య చేసుకున్నాట్లు తెలిపారు. కాగా రైల్వే హెడ్ కానిస్టేబుల్ రమణా రెడ్డి, కానిస్టేబుల్ నరేష్ సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామ చేసి పోస్టుమార్టం కోసం జనగామ ఏరియా హాస్పటల్‌కు తరలించారు.

# ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తాం

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వయించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వయించే పిఒలు, ఎపిఒలు, ఒపిఒలకు కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శిక్షణా కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న జరగనుందన్నారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 1002 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఒక రూట్‌ను మూడు మండలాల చొప్పున నాలుగు రూట్లను ఏర్పాటు చేయడం జరిగిందని నలుగురు సెక్టోరియల్ అధికారులను నియమించామన్నారు. ఒక రూట్‌లో జనగామ, లింగాలఘనపురం, రఘునాథపల్లి మండలాలు ఉండగా రెండో రూట్‌లో కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్త మండలాలు, మూడో రూట్‌లో చిల్పూర్, స్టేషన్‌ఘనపూర్, జఫర్‌గడ్ మండలాలు, నాలుగవ రూట్‌లో నర్మెట, బచ్చన్నపేట, తరిగొప్పుల మండలాలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక సజావుగా, సక్రమంగా నిర్వయించడం కోసం 17 మంది పిఒలు, 18 మంది ఎపిఒలు, 37 మంది ఒపిఒలు,18 మంది మైక్రో అబ్జర్వర్‌లకు విధులు కేటాయించామన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించ ప్రతి ఒక్క అంశాన్ని క్షుణంగా తులసుకోవాలని సూచించారు. ఓటర్లు బ్యాలెట్ బాక్స్‌లలో బ్యాలెట్ పేపర్‌తో ఓటు వేస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుండ సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, గడువు లోపు పోలింగ్ కేంద్రాల పరిధిలో క్యూలైన్‌లో ఉన్న వారికి టోకెన్ నెంబర్లు అందించి ఓటు వేయించాలన్నారు. బ్యాలెట్ జారీ తరువాత కౌంటర్‌ఫైల్‌పై ఓటరు సంతకం తీసుకోవాలన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తామన్నారు. ఫార్మ్ 16 పేపర్ సీల్ అకౌంట్‌లకు అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. ఓటరు ఎడమచేతి చూపుడు వేలుకు ఇండిబుల్‌ంకు పెట్టాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. అధికార యంత్రాతంగా అప్రమత్తంగా ఉంటూ సేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పూపరింటెండ్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఏఓ మన్సూరి, సెక్టార్ అధికారులు, పిఒలు, ఎపిఒలు, ఒపిఒలు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

### పరీక్షల సన్నద్ధత కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలి

పరీక్షల సన్నద్ధతకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ విద్యార్థులకు సూచించారు. 2024–25 సంవత్సరంతో పరీక్షలు రాసే విద్యార్థులకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గీతాంజలి పబ్లిక్ పాఠశాలలో ఎస్సీ, బిసి, మైనార్టీ వసతి గృహాలకు చెందిన పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు వార్షిక పరీక్షలపై ప్రేరణఅవగాహన తరగతుల కార్యక్రమం నిర్వయించగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పరీక్షలకు 31 రోజుల వ్యవధి మాత్రమే ఉందని, ఎట్టి పరిస్థితిలోనూ సమయాన్న వృధా చేయొద్దని, ప్రతి క్షణాన్ని సద్వీనియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్సీడిఓ విక్రమ్, మైనార్టీ సంక్షేమ ప్రినిఇపాల్ కుమారస్వామి, అనిల్, ఎస్సి, బిసి వసతి గృహాల అధికారులు నిపుణులు పాల్గొన్నారు.

## పిఎం పథకానికి ఎంపిక చేసిన పాఠశాలలో సదుపాయాలు చేపట్టాలి: రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** పిఎం శ్రీ పథకానికి ఎంపిక చేసిన పాఠశాలల్లో సదుపాయాలు కల్పన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఒసి కార్యాలయంలో పిఎం శ్రీపథకం కింద ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యా శాఖ అధికారులతో పిఎం శ్రీ నిధులు వినియోగం, సమగ్ర శిక్షా నిధులు ఖర్చులు, 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధన, ఆపార్ నమోదు, డిఎస్సీ 2008 అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం శ్రీ పథకం క్రింద జిల్లాలోని టీఎస్ ఎంఎస్ మల్హర్, జడ్పిహెచ్ఎస్, కాళేశ్వరం, గొల్లబుద్దారం, చెల్పూర్, టీఎస్ డబ్ల్యు ఆర్ ఈఎస్ చిట్యాల, టిఎస్ ఎంఎస్ ఘన్‌పూర్, ఎంపిపిఎస్ యమన్‌పల్లి పాఠశాలలు ఎంపిక చేసినట్లు తెలిపారు. పిఎం శ్రీలో ఎంపిక చేసిన ఎనిమిది పాఠశాలలకు 73,76,640 రూపాయల నిధులు కాగా ఇప్పటి వరకు 49,29,356 రూపాయలు ఖర్చు చేశారని, మిగిలిన నిధులలో నిర్దేశించిన పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి దశలో మంజూరు చేసిన నిధులు వినియోగం అయితేనే రెండో విడత నిధులు మంజూరు అవుతాయని తెలిపా రు. పిఎం శ్రీనిధుల పర్యవేక్షణకు ఎంఇఒలు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని, ఆయా పాఠశాలల్లో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు, కంపోస్టు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహణ, సోలార్ విద్యుత్తు, గ్రీన్ పాఠశాలలు, ఏకో పార్కు, చారిత్రక ప్రాంతాలకు విద్యార్థులకు విజ్ఞాన, విహార యాత్రలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, ఎఫ్ఏఓ కార్తీక్, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## సేవాలాల్ ఆశయాలు స్ఫూరిదాయకం



**ప్రజాపక్షం/హనుమకొండ :** సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవం, మహాభోగ్ భండారో కార్యక్రమం శనివారం ఉదయం హ నుమకొండ గిరిజన భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుండి గిరిజన భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్య అతిథిగా పాల్గొని సంతు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి సంరక్షణ, అడవులను కాపాడుకోవడం అన్ని సామాజిక వర్గాలను సమానత్వం కోసం కృషి చేశారని, వారి ఆశయాలను అందరం అనుసరించాలన్నారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గం, పరకాల నియోజకవర్గం కమిటీలు ఏర్పాటు చేసుకొని సంతు సేవాలాల్ జయంతి ఉత్సవాలను నిర్వహించుకుంటున్నామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హ నుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ రాథోడ్, కాజీపేట తాసిల్దార్ బావ్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి, సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు, గిరిజన సంఘ నాయకులు, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

# రైతు వికాసంలో ఆకాశవాణి పాత్ర అద్వితీయం

### రేడియో కిసాన్ దినోత్సవంలో ప్రస్తుతించిన అధికారులు, శాస్త్రవేత్తలు




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** రేడియో కిసాన్ దినోత్సవం పురస్కరించుకొని ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో శనివారం ఉదయం ఆదర్శ రైతుల సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ దిలీప్, మున్సిపల్ శాఖ చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్, వ్యవసాయ శాఖ సాంకేతిక అధికారి కమలాకర్ పాల్గొన్నారు. ఆకాశవాణిలో రైతు సోదరుల కోసం ఉద్దేశించిన కిసాన్ వాణి కార్యక్రమాలు ప్రారంభమైన రోజుని కిసాన్ దినోత్సవంగా పరిగణిస్తూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీన రేడియో కిసాన్ దినోత్సవంగా ఆకాశవాణి జరుపుకుంటున్నది. ఈ సందర్భంగా పూర్వపు వరంగల్ జిల్లా నలుమూలల నుంచి అభ్యుదయ రైతులలో కొందరిని ఎంపిక చేసి పదిమంది ఉత్తమ వ్యవసాయదారులుగా గుర్తించి ఘనంగా సత్కరించుకున్నది. వీరిలో మహిళా రైతుల కూడా ఉండటం విశేషం.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ మాట్లాడుతూ తాము క్షేత్ర పర్యటనలకు వెళ్ళినప్పుడు లభిస్తున్న స్పందనను దృష్టిలో ఉంచుకొని అనేకమంది రైతు సోదరులు రేడియో వల్ల ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. గ్రామాలలో చాలా మంది వ్యవసాయదారులు రేడియోని కుటుంబ సభ్యులలో భాగంగా పరిగణించటం గుర్తు చేసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని ప్రతి ప్రాంతానికి వెళ్లే ప్రయత్నం చేసినా కొత్త వంగడాల వివరాలని, వ్యవసాయంలో అనుసరించాల్సిన మెలకువలని చేరవేయడంలో ఆకాశవాణి సంపూర్ణంగా తమ పాత్ర నిర్వహిస్తున్నదనీ పేర్కొన్నారు. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ దిలీప్ మాట్లాడుతూ ఎన్ని చైతన్య యాత్రలు ఎవరు నిర్వహించిన వ్యవసాయం కోసం ఆకాశవాణి నిర్వహించే పాత్ర సమున్నతమైనదని అన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలతో ఆకాశవాణికి గల అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మునిసిపల్ శాఖ ముఖ్య ఉద్యాన శాఖ అధికారి రమేష్ వ్యవసాయం అనేది ఒక తృప్తితో కూడిన కళాత్మకమైన జీవన విధానం అభి వర్ణించారు. మార్పును స్వీకరిస్తేనే మనుగడ సాధ్యమవుతుందని ఈ సందర్భంగా రైతు సోదరులకు సూచించారు. హరిత విప్లవ ప్రయోజనాలని రైతు సోదరులకు చేరవేయడంలో ఆకాశవాణి పాత్ర గణనీయమైనదని అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ సాంకేతిక అధికారి కమలాకర్ ఒక సినిమా పాటను ఉదహరించి సభను రంజింప చేశారు. ఈ కార్యక్రమం ఆకాశవాణి కిసాన్ వాణి విభాగం అధికారి బొంపల్లి నరేష్ కుమార్ తొలిపాలుకలతో ప్రారంభం కాగా... ఆకాశవాణి ప్రోగ్రాం హెడ్ ఇల్లందుల రవికుమార్ మలి పలుకులతో ముందుకు సాగింది. అడవి రాజబాబు కార్యక్రమ వ్యాఖ్యాతగా వ్యవహరించి సభను ఆద్యంతం ఆసక్తికరంగా నిర్వహించారు.అలాగే కిసాన్ వాణి కార్యక్రమాలను సమర్పించే వ్యాఖ్యాతలు డాక్టర్ పశుల ఎల్లయ్య, చిరంజీవి, ఆర్షం సదానందం, పంకజ్ మోహన్ లను కూడా ఈ సందర్భంగా ఆకాశవాణి ఘనంగా సత్కరించింది.ఈ రేడియో కిసాన్ దినోత్సవ వేడుకలో ఆకాశవాణి సిబ్బంది శివశంకర్, శ్రీనివాసాచార్య, వెంకటరమణ, శ్రీనివాసరాజు, యాద ఉషశ్రీ , రామమూర్తి, విజయలక్ష్మి, రామ మోహన్, చందు, స్వప్న, రమేష్, మొగిలి, సుధాకర్, అశోక్, ఎలిషా, సరిత, అనిల్ ప్రసాద్, పరాంకుశం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఐటిలో 'క్యూరా 2025' ప్రారంభం



**ప్రజాపక్షం/కాజీపేట :** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి) వరంగల్‌లోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 14వ జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్టివల్ 'క్యూరా 2025' వేడుక శనివారం రామన్ హాల్‌లో ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ఉత్తర తెలంగాణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టిజిఎన్‌పిడిసిఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి కర్నాటి, ఐఎఎస్, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే డీన్ (ఫ్యాకల్టీ వెల్ఫేర్), డైరెక్టర్ ఇన్‌చార్జీ ప్రొఫెసర్ ఎ. వేణు వినోద్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్. జి. సునీత, ఫ్యాకల్టీ అడ్వైజర్, క్యూరా ప్రొఫెసర్. మొహమ్మద్ షఫీ అతిథులుగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన అనంతరం, శర్జిల్, క్యూరా స్టూడెంట్ కోఆర్డినేటర్, ఈ ఫెస్టివల్‌లో రెండు రోజుల పాటు ఏడు పోటీ కార్యక్రమాలు జరుగుతాయని, దేశవ్యాప్తంగా 120మంది బిజినెస్ స్కూల్ విద్యార్థులు పాల్గొంటున్నారని తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ మొహమ్మద్ షఫీ, గత 13 ఏళ్లుగా క్యూరా విద్యార్థులకు పరస్పర అభిప్రాయాలను పంచుకునే వేదికగా నిలుస్తోందని తెలిపారు. ప్రొఫెసర్. జి. సునీత, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగ పరిచయం చేస్తూ, విద్యా రంగంలో ఉన్నత ప్రమాణాలతో పాటు పారిశ్రామిక అవసరాలను తీర్చే విధంగా విభాగం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ప్రొఫెసర్. ఎ. వేణు వినోద్, మేనేజ్‌మెంట్ ఫెస్టివల్స్ విద్యార్థుల సామగ్ర వికాసానికి ఎంతగానో దోహదపడతాయని, నేతృ త్వం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడానికి ఉపకరిస్తాయని అన్నారు. ముఖ్య అతిథిగా వరుణ్ రెడ్డి కర్నాటి , ఐఎఎస్, తాజా సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పలుచోట్ల నుంచి వచ్చిన బిజినెస్ స్కూల్ విద్యార్థులు తమ నైపుణ్యాలను పరీక్షించుకున్నారు.

## దేవాలయ సమస్యలు పరిష్కరించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** గిరిజనులు గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మార్గంలో పయనించాలని, సేవాలాల్ దేవాలయం స్థలంపై మాజీ ఎమ్మెల్యే చర్యలు మానుకోవాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకల సందర్భంగా పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ అనంతారం సేవాలాల్ దేవాలయ వివాస్పద సమస్యలను పరిష్కరించాలన్నారు. సంత్ సేవాలాల్ దేవాలయంపై స్థలం మాజీ ఎమ్మెల్యే చర్యలు మానుకోవాలన్నారు. అనంతారం సేవాలాల్ దేవాలయాన్ని ఆయన సందర్శించారు. సేవాలాల్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయంకోసం కొమరమల్లు యాదవ్ దగ్గర తీసుకున్న స్థలం ఇది నాడు ఎన్నో వివాదాల మధ్య ఎసైన్డ్ భూమి అని సేవాలాల్ గుడికోసం తీసకున్న స్థలం ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే దానిపై వివాదం చేయడం సరికాదన్నారు. అక్కడ నిర్మాణంలో ఉన్న కట్టడాలను పూర్తి చేసి దేవాలయానికి ఉపయోగించాలన్నారు. నాటి ఎమ్మెల్యే ఇది సేవాలాల్ గుడికోసం అని చెప్పి ఉప్పుడు నా సొంత స్థలం అని ప్రచారం చేయడం సబబుకాదన్నారు. ఇది పూర్తిగా సేవాలాల్ దేవాలయానికే చెందుతున్నారు. మహారాజ్ గిరిజనుల ఆరాధ్య దైవం అని, ఆయన భక్తిమార్గంలో గిరిజన సోదరులు నడవాలని పిలుపునిర్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి, గిరిజన సమాఖ్య నేతలు మాలోతు రవీందర్, రామునాయక్, లింగ్యానాయక్, హరిలాల్, సేవాలాల్ అనిల్, పెరుగు కుమార్, వెలుగు శ్రావణ్,మెతుకుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్

### ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి




**ప్రజాపక్షం/పాలకుర్తి:** సంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజనుల ఆరాధ్య దైవం అని, గిరిజనులు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సిరెడ్డిలు హాజరై నృత్యాలు చేశారు. అనంతరం సేవాలాల్ ఆలయ ప్రాంగణంలో సంత్ సేవాలాల్ 286వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ సేవాలాల్ ఆదర్శాలు, బోధనలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని, సమగ్రాభివృద్ధికి ప్రేరణగా ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతిరోజున సెలవును ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి ఎల్లవేళలా గిరిజనులు అండగా ఉండాలన్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రజాప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు, పాలకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌లు తిరుపతిరెడ్డి, మంజుల భాస్కర్, సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు హమ్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండాల కాంగ్రెస్ అద్యక్షులు గిరగాని కుమారస్వామి, సురేష్ నాయక్, నాయకులు రాజేష్ నాయక్, పవార్, జలగం కుమార్, మహేందర్‌రెడ్డి, భాస్కర్, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

# అహింసా సిద్ధాంతానికి పునాది వేసిన సేవాలాల్

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/పర్వతగిరి:** అహింసా సిద్ధాంతానికి పునాది వేసి ఆచరించిన ఆదర్శపురుషుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగాజు అన్నారు. మండలంలోని కల్లెడ గ్రామంలో పర్వతగిరి మండల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత బంజార సోదరులు ఆచార శాలువా పూల్యగలతో ఎమ్మెల్యే నాగరాజును సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజారా సోదరుల కోరిక మేరకు వారికి పర్వతగిరి సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాల ఆరాధ్య దైవం. ఆయన హిందూ ధర్మం గొప్పతనం బంజారాలకు తెలియచేడానికే జన్మించిన మహానుభావుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర బంజార అధ్యక్షుడు బాబుసింగ్ చౌన్ మహారాజ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావు, మండలాధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, వర్ధన్నపేట ఎఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బంజారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

### మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి పట్టణ పరిధిలోని ప్రజలు తమ ఇంటి బకాయిని సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శనివారం భూపాలపల్లి పట్టణంలో బిట్స్ స్కూల్ ఇంటి పన్నును మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 4,37,011/ రూపాయలను వసూలు చేయడం జరిగినది. ఈ సందర్భంగా స్కూలు యాజమాన్యాన్ని అభినందిస్తూ ఇదే విధంగా పట్టణంలో గల బకాయిదారులు వారి ఇంటి పన్నులు నల్ల పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు పూర్తిగా చెల్లించాలని కమిషనర్ కోరారు.

ఫోకస్

క్రీడ

# ఎన్నాళ్లో వేచిన టోర్నీ..




ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐసిసి చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణకు రంగం సిద్ధమైంది. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ టోర్నీ పాకిస్తాన్, దుబాయ్ దేశాల్లో ఈనెల 19వ తేదీ (బుధవారం) నుంచి మార్చి 9వ తేదీ (ఆదివారం) వరకు జరగనుంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) వాస్తవానికి ఈ టోర్నమెంట్ నిర్వహణ అవకాశాన్ని పాకిస్తాన్‌కు కేటాయించింది. అయితే, పాక్‌లో మ్యాచ్‌లు ఆడేందుకు భారత్ సిద్ధంగా లేకపోవడంతో మార్పు అనివార్యమైంది. భారత్, పాకిస్తాన్ జట్లు ఆడాల్సిన మ్యాచ్‌లను మాత్రం దుబాయ్‌లో నిర్వహించాలని ఐసిసి తీర్మానించింది. ఈసారి ట్రోఫీని కైవసం చేసుకోవడానికి డిఫెండిం గ్ చాంపియన్ పాకిస్తాన్‌సహా మొత్తం ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. ఈ టోర్నీ కోసం జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో పాకిస్తాన్, భారత్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ ఉన్నాయి. అదే విధంగా గ్రూప్ 'బి' నుంచి అఫ్గానిస్థాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా జట్లు పోటీపడతాయి. గ్రూప్ దశలో, రెండు గ్రూపుల నుంచి మొదటి రెండు స్థానాలు దక్కించుకున్న జట్లకు సెమీస్‌లో తలపడే అవకాశం దక్కుతుంది. గ్రూప్ 'ఎ' విజేతతో గ్రూప్ 'బి' రన్నరప్ (రెండో స్థానంలో నిలిచిన జట్టు) మొదటి సెమీ ఫైనల్‌లో ఢీ కొంటుంది. అదే విధంగా గ్రూప్ 'బి'లో మొదటి స్థానాన్ని ఆక్రమించిన జట్టుతో, గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంలో నిలిచిన జట్టు రెండో సెమీస్‌లో తలపడుతుంది. ఈ రెండు సెమీస్‌లో గెలిచిన జట్లు ఫైనల్ చేరుతాయి. కాగా, దుబాయ్ వేదికగా తొలి మ్యాచ్ పాకిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య జరుగుతుంది. అయితే, హై ఓల్టేజ్ మ్యాచ్ మాత్రం అదే స్టేడియంలో 23న జరుగుతుంది. ఆ మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు పరస్పరం ఢీకొంటాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ మ్యాచ్ కోసం కేవలం రెండు దేశాల అభిమానులేగాక, ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల ప్రజలు ఆసక్తిగానూ, ఉత్కంఠతోనూ ఎదురుచూస్తున్నారు. వారి ఆశలకు, అంచనాలకు తగినట్టు ఈ మ్యాచ్ జరుతుందనడంలో అనుమానం లేదు. కాగా, చాంపియన్స్ ట్రోఫీకి సంబంధించినంత వరకూ భారత్‌పై పాకిస్తాన్‌కు మెరుగైన రికార్డు ఉంది. ఈ రెండు జట్లు ఇప్పటి వరకూ ఐదు పర్యాయాలు ఈ టోర్నమెంట్‌లో తలపడ్డాయి. వాటిలో పాకిస్తాన్ మూడు గెల్చుకోగా, భారత్ రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ప్రతిష్ఠాత్మకమైన ఈ ట్రోఫీలో పాల్గొనే ప్రతి జట్టూ విజయం కోసమే ప్రయత్నిస్తుందనడంలో అనుమానం లేదు. అయితే, కొన్ని జట్లు అత్యుత్తమంగానూ, కొన్ని జట్లు అత్యంత పేలవంగానూ ఆడి, రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాయి. అత్యధిక జట్టు స్కోరు విషయంలో న్యూజిలాండ్ రికార్డు నెలకొల్పింది. 2004లో అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 4 వికెట్లకు 347 పరుగుల భారీ స్కోరు సాధించింది. అందుకు సమాధానంగా అమెరికా కేవలం 65 పరుగులకే ఆలౌట్ అయింది. చాంపియన్స్ ట్రోఫీలో ఒక జట్టుకు ఇదే అత్యల్ప స్కోరు.

### అరంగేట్రం ఎప్పుడు?

ఐసిసి చాంపియన్స్ ట్రోఫీ 1998లో మొదలుకాగా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్, జింబాబ్వే జట్లు పాల్గొన్నాయి. బంగ్లాదేశ్ తొలిసారి 2000లో అడుగుపెట్టింది. నెదర్లాండ్స్ 2022లో క్వాలిఫై అయింది. 2004లో అమెరికా అర్హత సంపాదించగా, ఈ ఏడాది అఫ్గానిస్థాన్ మొదటిసారి బరిలోకి దిగుతోంది.



క్రిస్ గేల్

### అత్యధిక పరుగులు 'టాప్ 5'

క్రిస్ గేల్ (వెస్టిండీస్): 17 మ్యాచ్‌లు (17 ఇన్నింగ్స్)లో 791
మహేల జయవర్ధనే (శ్రీలంక): 22 మ్యాచ్‌లు (21 ఇన్నింగ్స్)లో 741
శిఖర్ ధవన్ (భారత్): 10 మ్యాచ్‌లు (10 ఇన్నింగ్స్)లో 701
కుమార సంగక్కర (శ్రీలంక): 22 మ్యాచ్‌లు (21 ఇన్నింగ్స్)లో 683
సౌరవ్ గంగూలీ (భారత్): 13 మ్యాచ్‌లు (11 ఇన్నింగ్స్)లో 665.

ఒక మ్యాచ్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు
నాథన్ ఆస్టెల్ (న్యూజిలాండ్): అమెరికాపై 145 నాటౌట్
ఆండీ ఫ్లవర్ (న్యూజిలాండ్): భారత్‌పై 145
సౌరవ్ గంగూలీ (భారత్): దక్షిణాఫ్రికాపై 141 నాటౌట్
సచిన్ తెండూల్కర్ (భారత్): ఆస్ట్రేలియాపై 141
గ్రేమ్ స్మిత్ (ఆస్ట్రేలియా): దక్షిణాఫ్రికాపై 141.

### అత్యధిక క్యాచ్‌లు

వికెట్ కీపర్ల విభాగంలో కుమార సంగక్కర (శ్రీలంక): 33 క్యాచ్‌లు
ఫీల్డర్ల విభాగంలో మహేల జయవర్ధనే (శ్రీలంక): 15 క్యాచ్‌లు.

### అత్యధిక వికెట్లు (కనీసం 20 వికెట్లు)



కైల్ మిల్స్

కైల్ మిల్స్ (న్యూజిలాండ్): 15 మ్యాచ్‌ల్లో 28 వికెట్లు
ముత్తయ్య మురళీధరన్ (శ్రీలంక): 17 మ్యాచ్‌ల్లో 24 వికెట్లు
లసిత్ మలింగ (శ్రీలంక): 16 మ్యాచ్‌ల్లో 24 వికెట్లు
బ్రెట్ లీ (ఆస్ట్రేలియా): 16 మ్యాచ్‌ల్లో 22 వికెట్లు
గ్లెన్ మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా): 12 మ్యాచ్‌ల్లో 21 వికెట్లు
గేమ్స్ ఆండర్సన్ (ఇంగ్లాండ్): 12 మ్యాచ్‌ల్లో 21 వికెట్లు.

### భారత జట్టు ఇదే..

రోహిత్ శర్మ (సి), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కెఎల్ రాహుల్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహమ్మద్. షమీ, అర్ష్‌దీప్ సింగ్, రవీంద్ర జడేజా, వరుణ్ చక్రవర్తి.

## చాంపియన్స్ ట్రోఫీ విజేత జట్లు ఇవే..



దక్షిణాఫ్రికా




భారత్



ఆస్ట్రేలియా

**1998:** హన్సీ క్రానే నాయకత్వంలో దక్షిణాఫ్రికా (బంగ్లాదేశ్/ ఢాకాలోని బంగబంధు నేషనల్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో వెస్టిండీస్‌పై 4 వికెట్ల తేడాతో గెలుపు. స్కోర్లు: వెస్టిండీస్ 49.3 ఓవర్లలో ఆలౌట్ 245, దక్షిణాఫ్రికా 47 ఓవర్లలో 6 వికెట్లకు 248. ప్లేయర్ ఆఫ్‌ది ఫైనల్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్: జాక్వెస్ కాలిస్/ టోర్నీలో అత్యధిక పరుగులు: ఫిలో వాలిస్ 221, టోర్నీలో అత్యధిక వికెట్లు: జాక్వెస్ కాలిస్ 8).

**2000:** సెప్టెన్ ఫ్లెమింగ్ కెప్టెన్సీలో న్యూజిలాండ్ (కెన్యా/ నైరోబీలోని జింఖానా క్లబ్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్‌లో భారత్‌పై 4 వికెట్ల తేడాతో విజయం. స్కోర్లు: భారత్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 264, న్యూజిలాండ్ 49.4 ఓవర్లలో 6 వికెట్లకు 265. ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్: క్రిస్ కెయిర్న్స్. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ ప్రకటించలేదు, అత్యధిక పరుగులు: సౌరవ్ గంగూలీ 348, అత్యధిక వికెట్లు: వెంకటేశ్ ప్రసాద్ 8).

**2002:** సౌరవ్ గంగూలీ నాయకత్వంలో భారత్, సనత్ జయసూర్య కెప్టెన్సీలో శ్రీలంక సంయుక్త విజేతలు (కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఫైనల్‌కు వర్షం కారణంగా అంతరాయం ఏర్పడడంతో, అంపైర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. మ్యాచ్ నిలిచిపోయే సమయానికి భారత్ రెండు ఓవర్లలో వికెట్ నష్టం లేకుండా 14 పరుగులు చేసింది. అంతకు ముందు తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 50 ఓవర్లలో 5 వికెట్లకు 244 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు ప్రకటించలేదు. అత్యధిక పరుగులు: వీరేంద్ర సెవాగ్ 271, అత్యధిక వికెట్లు: ముత్తయ్య మురళీధరన్ 10).

**2004:** బ్రియాన్ లారా సారథ్యంలో వెస్టిండీస్ (ఇంగ్లాండ్/ లండన్‌లోని ది ఓవల్ మైదానంలో జరిగిన తుది పోరులో వెస్టిండీస్ 49.4 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌటైంది. అనంతరం వెస్టిండీస్ 48.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టంతో లక్ష్యాన్ని చేరింది. ప్లేయర్‌ఆఫ్ ది ఫైనల్: ఇయాన్ బ్రాడ్‌షా, ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్: రామ్‌నరేష్ శర్వాణ్, అత్యధిక పరుగులు: మార్కస్ ట్రెస్కోథిక్ 261, అత్యధిక వికెట్లు: ఆండ్రూ ఫ్లింటాఫ్ 9).

**2006:** రికీ పాంటింగ్ కెప్టెన్సీలో ఆస్ట్రేలియా (భారత్/ ముంబయిలోని బ్రబౌర్న్ స్టేడియంలో ఫైనల్ జరిగింది. ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 30.4 ఓవర్లలో 138 పరుగులు చేసింది. అనంతరం వర్షం కారణంగా ఆట నిలిచిపోయింది. తిరిగి ఆట మొదలైనప్పుడు డక్‌వర్త్ లూయిస్ విధానాన్ని అనుసరించి ఆస్ట్రేలియా విజయలక్ష్యాన్ని 35 ఓవర్లలో 116 పరుగులుగా నిర్ధారించారు. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 28.1 ఓవర్లలోనే, కేవలం రెండు వికెట్లు కోల్పోయి అందుకుంది. 8 వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది. ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్: షేన్ వాట్సన్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్: క్రిస్ గేల్, అత్యధిక పరుగులు: క్రిస్ గేల్ 474, అత్యధిక వికెట్లు: జెరోమ్ 13).

**2009:** రికీ పాంటింగ్ సారథ్యంలో ఆస్ట్రేలియా (దక్షిణాఫ్రికా/ సెంచరీయన్‌లోని సూపర్‌స్పోర్ట్ పార్క్‌లో జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 6 పరుగుల తేడాతో గెలుపు. తొలుత బ్యటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 200 పరుగులు సాధించింది. అనంతరం ఆస్ట్రేలియా 45.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగులు సాధించి, 6 వికెట్ల ఆధిక్యంతో విజయాన్ని నమోదు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్: షేన్ వాట్సన్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్: రికీ పాంటింగ్, అత్యధిక పరుగులు: రికీ పాంటింగ్ 288, అత్యధిక వికెట్లు: వేన్ పార్నెల్ 11).

**2013:** మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలో భారత్ (ఇంగ్లాండ్/ బర్మింహామ్‌లోని ఎడ్జిబాస్టన్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్‌కు వర్షం వల్ల అంతరాయం ఏర్పడగా, మ్యాచ్‌ని 20 ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 7 వికెట్లు నష్టపోయి 129 పరుగులు చేసింది. స్వదేశంలో విజయం సాధించాలన్న పట్టుదలతో చివరి వరకూ పోరాడినప్పటికీ ఇంగ్లాండ్‌కు పరాజయం తప్పలేదు. ఆ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టాని 124 పరుగులు చేయగలిగింది. భారత్ ఐదు పరుగుల తేడాతో గెలుపొంది, ట్రోఫీని అందుకుంది. ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్: రవీంద్ర జడేజా, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్: శిఖర్ ధవన్, అత్యధిక పరుగులు: శిఖర్ ధవన్ 363, అత్యధిక వికెట్లు: రవీంద్ర జడేజా 12).

**2017:** సర్ఫరాజ్ అహ్మద్ కెప్టెన్సీలో పాకిస్తాన్ (ఇంగ్లాండ్/ లండన్‌లోని ది ఓవల్ మైదానంలో ఫైనల్ జరగ్గా, భారత్‌పై పాకిస్తాన 180 పరుగుల భారీ ఆధిక్యంతో గెలిచింది. పాకిస్తాన్ 50 ఓవర్లలో కేవలం 4 వికెట్లకు 338 పరుగులు చేయగా, అందుకు సమాధానంగా బరిలోకి దిగిన టీమిండియా 30.3 ఓవర్లలో 158 పరుగులకే కుప్పకూలింది. ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్: ఫకర్ జమాన్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్: హసన్ అలీ, అత్యధిక పరుగులు: శిఖర్ ధవన్ 338, అత్యధిక వికెట్లు: హసన్ అలీ 13).

# 'మహామనిషి' ధర్మభిక్షం

### ఘనంగా జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/మునుగోడు:** భూమికోసం.. భుక్తి కోసం.. పెట్టి చాకిరి విముక్తి కోసం.. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయాలను సాధించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. శనివారం ధర్మబిక్షం 103వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ధర్మభిక్షం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ధర్మభిక్షం తాను నమ్మిన సిద్ధాంతం కోసం, ఆర్థిక అసమానతలు లేని నూతన సమాజం కోసం, కార్మిక, కర్షక రాజ్యం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహామనిషి అని కొనియాడారు. శాసనసభ్యుడిగా, పార్లమెంటు సభ్యుడిగా నల్లగొండ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి కడవరకు కమ్యూనిస్టుగా నిలిచిన మహామనిషి ధర్మభిక్షం అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు మాజీ సర్పంచ్ సరిగి చలపతి,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, నకరికంటి పద్మ, యాదయ్య, పంతంగి స్వామి, జాజుల సత్యనారాయణ, నాయకులు బి.లాలు, బండారు శంకర్, బెల్లం శివయ్య, రేవెల్లి అంజయ్య, తిరందా శీను, ఇరిగి యాదయ్య, కట్కూరి లింగస్వామి,అయితగోని యాదయ్య తదిదరులు పాల్గొన్నారు.

**సంస్థాన్ నారాయణపురం :** ధర్మభిక్షం ఆశయాలను సాధించాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ధర్మభిక్షం జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ధర్మబిక్షం విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ధర్మభిక్షం సేవలు వెలకట్టలేనివన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసి వాటిని సాధించిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, నాయకులు కురిమిద్దె శ్రీనివాస్, పల్లె శేఖర్ రెడ్డి, కలకొండ సంజీవ, మొగుదాల సత్తయ్య, పందుల యాదగిరి, పాలకూర సతీష్, నీళ్ల గాలయ్య, పల్లె మల్లారెడ్డి పాల్గొన్నారు.

**భువనగిరి :** ప్రజల మనిషి బొమ్మగాని ధర్మభిక్షం అని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, బొమ్మగాని ధర్మభిక్షం జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోదా శ్రీరాములు మాట్లాడుతూ 1990–1995 సంవత్సరాలలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుండి రెండు పర్యాయాలు భారీ మెజారిటీతో ప్రజలు ధర్మభిక్షంను గెలిపించుకున్నారన్నారు. రెండవసారి ఎన్నికలలో 480 మంది అభ్యర్థులు నిలబడగా ధర్మభిక్షం గుర్తు కంకి కొడవలి న్యూస్ పేపర్ లాంటి బ్యాలెట్ పేపర్లో గుర్తించి ఓటు వేసి 76 వేల మెజార్టీతో గెలిపించడం భారత ఎన్నికల చరిత్రలోనే అపూర్వమైన సంఘటనగా అని గుర్తు చేశారు. ధర్మభిక్షం ఎల్లప్పుడూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసినారని అందుకే ప్రజల మనిషిగా గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, సురుపంగా శివలింగం, లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు భాస్కర్ నాయక్, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మండల సహాయకార్యదర్శి ఉడుత రాఘవులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తాపుల అభిలాష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, నాయకులు చింతల పెంటయ్య, బద్దం వెంకటరెడ్డి, కోట శంకర్, షర్ఫుద్దీన్, ఎండి.బాబా, చిక్క నరసయ్య, ఎండి జహంగీర్, గుజ్జ సత్యనారాయణ, జోగు ఆంజనేయులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి తరానికి ఆదర్శం

**సూర్యాపేట:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో ధర్మభిక్షం జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల రక్షణకు చట్టాలను తీసుకవచ్చి నేటికి ఆయా వర్గాల గుండెల్లో ధర్మభిక్షం చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, గీత పనివారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్, ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, దొరపల్లి శంకర్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హస్సేన్, ఖమ్మంపాటి అంతయ్య, రేగటి లింగయ్య, తొగిటి మురళి, నిమ్మల ప్రభాకర్, గోపగాని రవి, దీకొండ శ్రీనివాస్, రవి, మల్లికార్జున్ రెడ్డి, దేశగాని హేమలత, వాడపల్లి గోపి, నవీన్, ఎండిపాషా పాల్గొన్నారు.

**మహబూబాబాద్:** భూమికోసం, భుక్తికోసం దేశ విముక్తికోసం కార్మిక కర్షకుల హక్కుల కోసం సమరశీల పోరాటాలు చేసిన మహానాయకుడు బొమ్మగాని ధర్మభిక్షమని మహబూబాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి బి.విజయసారథి, గీత పనివార సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు. బొమ్మగాని ధర్మభిక్షం జయంతి సిపిఐ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మబిక్షం విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పాలని, ఆయన జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గీత పనివారుల సంఘం జిల్లా అధ్యక్షులు దొంతు రామ్మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా వెంకటేశ్వర్లు గౌడ్, ఉపాధ్యక్షులు తండ సతీష్‌గౌడ్, కార్యదర్శి గడ్డం బాబు, కోశాధికారి నక్క నాగార్జునగౌడ్, నాయకులు తండా సందీప్‌గౌడ్, డొంకెని రమేష్ గౌడ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగు శ్రావణ్, సిపిఐ గూడూరు మండల కార్యదర్శి రవి పాల్గొన్నారు.

**కరీంనగర్:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం త్యాగం మరువలేనిదని గీతపనివారల సంఘం జిల్లా నిర్మాణ బాధ్యుడు కొయ్యడ సృజన్ కుమార్ అన్నారు. శనివారం ధర్మభిక్షం జయంతిని పురస్కరించుకుని స్థానిక బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ ధర్మభిక్షం తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పేద బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం నిస్వార్థంగా ఉద్యమించిన మహా నాయకుడన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బోయిని తిరుపతి, కిన్నెర మల్లమ్మ, బోనగిరి మహేందర్, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, నాయకులు సాంబయ్య, అంజిరెడ్డి, మల్లేశం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**మహబూబ్ నగర్ :** తన జీవితమంతా పేద ప్రజల బాగోవులో కోసమే పరితపించిన కర్మ యోధుడు ధర్మభిక్షమని, ఆయన ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బ్రుంగిబాల్ కిషన్ పిలుపునిచ్చారు. గీత పనివారిల సంఘం పితామహుడు ధర్మభిక్షం జయంతి సందర్భంగా శనివారం సిపిఐ కార్యాలయం లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం బాలకిషన్ మాట్లాడుతూ తన జీవితమంతా ప్రజల సేవకే అంకితం చేసిన ప్రజల మనిషి ధర్మభిక్షం అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుబు కొంపల్లి రాము, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్ బాషా, బసవరాజ్, మహేష్, బాల్ రాజ్, నిజాం, పాషా, ఇందిరమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం :** గీత పనివారల హక్కుల కోసం పోరాడిన యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం చిరస్మరణీయుడని గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొండల సత్యనారాయణ, దూసరి శ్రీరాములు అన్నారు. ధర్మభిక్షం జయంతి సందర్భంగా ఖమ్మం వన్‌టౌన్ సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, శ్రీరాములు మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల కోసం, సంక్షేమం కోసం ఆయన తన పోరాటాన్ని తుదిశ్వాస వరకు కొనసాగించారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, కె. వాసు, మాడుగుల నాగేశ్వరరావు, మాలకొండయ్య, కంపసాటి వెంకన్న, నర్సింహారావు, ఎస్.కోటేశ్వర రావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సంస్థాన్ నారాయణపురం



మునుగోడు



సూర్యాపేట




మహబూబాబాద్



కరీంనగర్



ఖమ్మం



భువనగిరి




మహబూబ్‌నగర్

# నరేందర్‌రెడ్డిని 'పట్టభద్రుడి'ని చేయాలి

## పట్టభద్రుల అత్మీయ సమ్మేళనంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



ప్రజాపక్షం/ హుస్నాబాద్: ఈ నెల 27న జరుగబోవు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర బిసి, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడుపిలుపునిచ్చారు. శనివారం హుస్నాబాద్ పట్టణం తిరుమల గార్డెన్‌లో పట్టభద్రుల అత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఉమ్మడి మెదక్, కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా విద్యావేత్త, ఆల్ఫోర్స్ కళాశాలల అధినేత వేముల నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిపామన్నారు. ఈ నెల 27న పట్టభద్రుల ఎన్నిక పోలింగ్ జరుగుతుందని, ప్రతిఒక్కరు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలుపునకు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలోమొత్తం 11వేల 790 ఓట్లు ఉన్నాయన్నారు. ప్రతి మండలం నుండి 50మందికి ఒక ఇన్‌చార్జిని నియమించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఏ విధంగా విజయం సాధించిందో నేడు అదే విధంగా ప్రతి ఒక్కరు పనిచేసి నరెందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. నరెందర్‌రెడ్డికి ఈ ప్రాంతం నుండి అనేక మంది విద్యార్థులకు ఉన్నత చదువులను అందించిన వ్యక్తిగా అందరికి సుపరిచితులన్నారు. బిజెపి అభ్యర్థికి ఈ ప్రాంతంలో ఏ ఒక్కరితో అవినాభావ సంబంధాలు లేవన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేసరికి రాష్ట్రం దివాళా తీసి అప్పుల్లో కూరుకుపోయిన విషయం తెలిసిందేనన్నారు. అయిన్పటికీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఒక్కటొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. రై తులకు రెండు లక్షల రుణమాఫి, మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, ఉచిత కరంటు, ఇందిరమ్మ ఇళ్ల వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.

### యువత చైతన్యం కోసం కృషి చేస్తా

తెలంగాణలో గత పది ఏళ్లుగా పరిపాలన చేసి ప్రభుత్వం నిరుద్యోగుల భవిష్యత్తుకోసం ఏమి చేయలేదని నేను గెలిస్తే యువత భవిష్యత్ కోసం జిల్లాల్లో గ్రంథాలయాలు ఉచిత కోచింగ్‌కు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ ప్రాంతంలో తన కళాశాలలో చదువుకుని ఎంతో మంది యువతీ యువకులు తమ భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకున్నారన్నారు. అనేకమంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించానన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిస్తే పేద విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాల్లో వారికి సముచితస్థానం కల్పిస్తామని అన్నారు. ఉపకార వేతనం అందించేందుకు తనవంతుగా ప్రయత్నం చేస్తానన్నారు. జిల్లా గ్రందాల యచైర్మెన్ కేదం లింగమూర్తి, సహకార సంఘం చైర్మెన్ బి శివయ్య, బోమ్మశ్రీరాంచక్రవర్తి, మార్కెట్ కమీటి చైర్మెన్ వైస్ చైర్మెన్ ,తిరుపతిరెడ్డి, చందు, నాయకులు చిత్తారి పద్మ,రవిందర్, మంజులరెడ్డి, తో పాటు వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గోన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో సకల సౌకర్యాలు

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్న నేపధ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిఅ ధికారులను ఆదేశించారు.కరీంనగర్‌లోనిప్రభుత్వ మహిళాడిగ్రీకళాశాల,వాణినికేతన్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ దన్గర్‌వాడీ ఉన్నత పాఠశాల, గంగాధర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ శనివారం సందర్శించారు. పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయబోయే గదులను, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకుఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్‌లు నరేందర్,అనుపమ,ఎంపిడివో రాము,ఆర్‌ఐలు శ్రీనివాస్,రాజు ఉన్నారు.

## 20న విద్యుత్ సౌధ ముట్టడి



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు తమ న్యాయ పరమైన హక్కుల సాధన కోసం ఈనెల 20న తెలంగాణ విద్యుత్ సౌధ ముట్టడికి పిలుపునిచినట్లు పెద్దపల్లి జిల్లా ఆర్టిజన్ జె ఏ సీ నాయకులు తెలిపారు. ఈమేరకు శనివారం పెద్దపల్లి ఎస్ ఈ కార్యాలయం వద్ద ముట్టడి పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా నుండి ఆర్టిజన్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంల టివిఏసీ జె ఏ సి పెద్దపల్లి చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి, కో చైర్మన్ ఎల్లయ్య, వై. రమేష్, బి. శ్రీనివాస్, తిరుపతి, పూసల రాజ్ కుమార్, ఈర్ల సదయ్య, దుడపాక ఓదెలు, వేణుగోపాల్, ట్రాన్స్కో రమేష్, రవి, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## బేస్ బాల్ ఎంపిక పోటీలు

ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి : జగిత్యాల జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈనెల 17న ప్రజ్ఞ ఇంగ్లిషు మిడియం హైస్కూల్ లో సబ్ జూనియర్స్ స్థాయి బేస్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించబడునని బేస్ బాల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాల్ల అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పుల గంగాధర్ లు తెలిపారు.ఇట్టి పోటీలో పాల్గొనదానికి ఆసక్తి ఉన్న క్రీడాకారులు సోమవారం ఉదయం 10 గంటల లోపు ఆధార్ కార్డు, క్రీడా దుస్తులతో హాజరు కావాలన్నారు. క్రీడాకారుల వయస్సు 01–01–2010 నుండి 31–12–2012 మధ్యలో జన్మించిన వాళ్ళు మాత్రమే అర్హులని యాళ్ళ అమర్ నాథ్ రెడ్డి, కొప్పుల గంగాధర్ తెలిపారు. ఏదైనా సమాచారం కోసం 7306224589 నంబర్ కు కాల్ చేయవలసిందిగా కోరారు.

## బాధితులకు ఎల్‌ఒసి చెక్కు



ప్రజాపక్షం/ముత్తారం: ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన సొల్లు సాత్విక్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి వైద్య ఖర్చుల కోసం బాధపడుతు కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ కి విషయాన్ని తెలపడంతో ఆయనను నిమ్స్ ఆసుపత్రి లో చేర్పించి వారి ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో సాత్విక చికిత్స కోసం స్థానిక రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుని సంప్రదించడంతో వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 2,50,000 వేల రూపాయలు వైద్య ఖర్చుల నిమిత్తం (ఎల్ఓసి) శనివారం శ్రీధర్ బాబు వ్యక్తిగత పి ఏ చేతులమిదిగా బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్ బాబుకి ధన్యవాదాలు తెలియజేశారు.

## అర్హులైన పేదలకే ఇళ్ళు : సత్యప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల జిల్లాలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ళు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అందుకనుగుణంగా ప్రతి ఒక్కరు విధులు నిర్వర్తించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బీ. సత్యప్రసాద్ అన్నారు.జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంపీడీవో, ఏంపీఓ,ఏఈ, డిఈ, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల క్రింద ఇల్లు నిర్మించుకునే ప్రతి ఇంటికి వంద శాతం సబ్సిడీ క్రింద ప్రభుత్వం 5 లక్షల రూపాయలు అందజేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో ఉన్న అర్హత గల దరఖాస్తుదారులను ఇండ్లను గుర్తించి ఆర్ సీసీ గృహాలకు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక్క పడకగది, హాల్, కిచెన్, టాయిలెట్స్ వంటి సౌకర్యాలతో నిర్మించబడతాయన్నారు. అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, డి ఆర్ డి రఘు వరుణ్, ఎంపీడీవోలు , ఎంపీఓలు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మోటార్ల దొంగలు అరెస్టు

ప్రజా పక్షం / మెట్ పల్లి : మెట్ పల్లి సబ్ డివజన్ పరిధిలోని తాళం వేసి ఉన్న ఇళ్లు, మోటార్ సైకిళ్లు, వ్యవసాయ కరెంటు మోటార్లు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను పట్టుకున్నట్లు జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ తెలిపారు. శనివారం మెట్ పల్లి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి అశోకుమార్ విలేకరులకు వివరాలను వెల్లడించారు. కోరుట్ల నియోజకవర్గం పరిధిలో (ఎస్ఆర్ ఎస్‌పి) కాలువ, వ్యవసాయ బావులలో మోటార్లను దొంగలించి తీసుకెళ్తున్నారు. శనివారం తెల్లవారుజామున ఇబ్రహీంపట్నం మండలం మేడిపల్లి క్రాసింగ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌పిఅశోక్ కూమార్ తెలిపారు. నిందితులు కుంచెపు వెంకటేష్, సూర్యావంశీ సాయి కుమార్, నిజామాబాద్‌జిల్లా ఎండపల్లి (ఎస్ఆర్ఎస్‌పి) క్యాంపుకు చెందిన సాయికుమార్ ప్రస్తుతం మల్లాపూర్ మండలం రాఘవపేటలో నివాసం ఉంటున్నారు. వీరందరు దొంగతనం చేసిన మోటార్లును మెట్ పల్లి పట్టణానికి చెందిన స్క్రాప్ షాప్ యజమాని అబ్దులు ఖాదర్‌కు అమ్మేవారు. వీరు ముగ్గురు ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడేవారని, నిందితుల వద్ద 30 వ్యవసాయ మోటార్లు, 30 కిలోల కాపర్‌వైర్, 5 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న విలువ రూ.6 లక్షల వరకు ఉంటుందని జిల్లా ఎస్ అశోక్ కుమార్ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మెట్ పల్లి డిఎస్‌పి రాములు, సిఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు శ్రీకాంత్, కిరణ్ కుమార్, అనిల్ కుమార్, రాజు, ఎస్‌పి అశోక్ కుమార్ సిబ్బందికి రివార్డ్స్ అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.



## ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు

### రాష్ట్ర మైనింగ్ శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఇసుక రీచ్ వద్ద 360 డిగ్రీల కెమెరాల ఏర్పాటు



ప్రజాపక్షం/ముత్తారం : జిల్లాలో అక్రమ ఇసుక రవాణా నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మైనింగ్ శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్ అన్నారు.శనివారం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మైనింగ్ శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్‌కు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్వాగతం పలికారు. అనంతరం ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి, జిల్లెలపల్లి గ్రామాలలో ఉన్న ఇసుక రీచ్ లను టి.జి.ఎం.డి.సి వైస్ చైర్మన్ బి.ఆర్.వి సుశీల్‌కుమార్ లతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనింగ్ శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా నివారణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. సామాన్య ప్రజలకు అతి తక్కువ ధరకు ఇసుక అందుబాటులోకి రావాలని,నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణా జరిగే వాహనాల ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. ఇసుక రీచ్ వద్ద 400 మీటర్ల మేర సిసి రోడ్డు నిర్మించాలని అధికారులకు సూచించారు. ఇసుక రీచ్ ల వద్ద డిస్పాచ్ సెంటర్ లను పెంచాలని అన్నారు. ఇసుక రీచ్ ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు, లైట్స్ ఏర్పాటు చేయాలని, ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్ తో పాటు ఒకే ఎంట్రీ ఎగ్జిట్లను ఏర్పాటు చేయాలని , ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, బ్లాక్ మార్కెట్ అరికట్టి పేదలకు ఇసుకను అందుబాటులో ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముత్తారం మండలం జిల్లెలపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి కేంద్రాలను తనిఖీ చేసి, పిల్లలతో ముచ్చటించి వారికి పాఠ్యాంశాలను బోధించారు. మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ శ్రీనివాస్, తహసిల్దార్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటమి భయంతో కులరాజకీయాలతో ప్రతిపక్షాల దుష్ప్రచారం

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః ఓటమి భయంతోనే కొందరు కుల రాజకీయాలతో పాటు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విమర్శించారు. విద్యాసంస్థల అధినేతగా ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దానని, ప్రజాసేవకై రాజకీయాల్లో వచ్చానని స్పష్టం చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి కరీంనగర్ బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాక్‌తో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా తాను సేవ చేస్తున్నానని తెలిపారు. సోషల్ మీడియాలో కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుష్ప్రచారం చేసే వాళ్లు ప్రజలకు ఏం సేవ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క పేద విద్యార్థిని చదివించారా? నిరుద్యోగికి ఒక్కరికైనా ఉద్యోగం కల్పించారా? అని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే కుల రాజకీయాలతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని పట్టభద్రులను కోరారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా ఆశీర్వదించాలని నరేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపు



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిపిఐ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. వంద సంవత్సరాల చరిత్ర గల సిపిఐ పార్టీ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూనేప్రజాపోరాటాలునిర్వహిస్తూ ఎన్నో విజయాలను, ఫలితాలను దేశ ప్రజలకు అంధించిందని ఆయన పేర్కొన్నారు. శనివారం జగదేవ్ పూర్ మండలంలోని తిగుల్‌లో ఆరుట్ల భవనంలో జరిగిన గ్రామ శాఖ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మంద పవన్ ప్రసంగించారు. పేద ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలని కూడు, గూడు కోసం అనేక పోరాటాలు నిర్వహించిన ఘనత సిపిఐ పార్టీకి ఉందని గుర్తు జేశారు. దేశంలో ప్రస్తుతం పరిపాలిస్తున్న బిజెపి ప్రభుత్వం ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి వేయబడుతుందని అలాగే ప్రజల ఆర్థిక స్థితిగతులు చిన్న భిన్నమవుతున్నాయని, పేదరికం పెరిగిపోతుందని ఆరోపించారు. బిజెపి పాలనలో బడా కార్పొరేట్ శక్తులకు ఉన్న ప్రాధాన్యత, సామాన్య ప్రజలకు,రైతులకు లేదని విమర్శించారు. ప్రజా వ్యతిరేక బిజెపి పాలనపై పార్టీ శ్రేణులు ప్రజలతో కలిసి పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ముందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాలలో పార్టీ అభ్యర్థులు పోటీ చేయడానికి సిద్ధం కావాలని సూచించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు బట్టు దయానందరెడ్డి మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర ఉద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలు కొని నేటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సిపిఐ క్రియాశీల పాత్ర పోషించిందని అన్నారు. సిపిఐ వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నర్సింహారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి శివలింగకృష్ణ, స్వర్గం రాజేశం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్, సిపిఐ తిగుల్ గ్రామ శాఖ కార్యదర్శి బేల్దే భిక్షపతి, నాయకులు పోశన్న, సైదులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుక రవాణాపై నిరంతరం నిఘా

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝ

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : జిల్లాలో ఇసుక రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలని ఆర్డీవోలు, తహశీల్దార్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇసుక రవాణాపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుండి జిల్లాలోని సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అనుమతి ఉన్న ఇసుక రీచ్‌ల నుండి మాత్రమే తరలించాలని, వే బిల్, డ్రైవర్‌కు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అనుమతి లేని వాగుల నుండి ఇసుక తరలించకుండా నిఘా పెట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాలకు ఇసుక అవసరం ఉంటుందని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కేసులు పెట్టాలని, ఆయా చోట్ల ఇసుక అక్రమంగా తరలించకుండా కందకాలు తవ్వించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల ఇంచార్జీ ఆర్డీవో రాధాభాయ్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## నరేందర్‌రెడ్డికి 'టిఎస్‌సిఎస్‌టియుఎస్'మద్దతు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వూట్కూరి నరేందర్‌రెడ్డికి తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ శాతం పెంపుపై ఇచ్చిన హామీ మేరకు తమ సంఘం నుంచి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్ నాయక్ పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను, వారి జనాభా ఆధారంగా ఎస్సీలకు 18 శాతం పెంపుకు కృషి చేసి భర్తీ చేయాలని కోరారు. ఎస్టీలకు 10 శాతం ఉండేలా బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ నిరుద్యోగ యువకులకు వారి అర్హతలకు అనుగుణంగా ప్రతి పాత జిల్లా కేంద్రాలలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉద్యోగాలు వచ్చే వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకునేలా కృషి చేసేందుకు అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిమల్ల చిట్టబాబు మాట్లాడుతూ నరేందర్‌రెడ్డి తన ఎమ్మెల్సీ నిధులను ఎస్సీ ఎస్టీ వర్గాల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తానని హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్ మాట్లాడుతూ నరేందర్‌రెడ్డి విద్యాసంస్థలలో ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అత్యున్నత విద్యను అభ్యసించి ఉన్నతంగా స్థిరపడ్డారని, ఒక విద్యావేత్త చట్ట సభలలో ఉంటే శుభసూచకమన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ఉద్యోగులు, పట్టభద్రులు వూట్కూరి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సభ్యులు జి.శంకర్, బి.రాజు తదితరులున్నారు.

## గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి 5వ ర్యాంక్



ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారు ఇటీవల నిర్వహించిన ఒలింపియాడ్ లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యా నికేతన్ కి చెందిన భూక్యా జశ్వంత్ (4వ తరగతి) స్టేట్ 5 వ ర్యాంక్, భావన, ఆద్య (4 వ తరగతి) లు జిల్లా 2 వ ర్యాంక్ లు, జంగపల్లి సాత్విక (8వ తరగతి), ఎ. సాత్విక్ తేజ (6వ తరగతి) లు జిల్లా కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. శనివారం హన్మకొండలోని కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటి కొండ రమేష్, ఎ సి పి పింగిలి ప్రశాంత్‌రెడ్డి వీరికి అవార్డులు ప్రదానం చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో ప్రతి విద్యార్థి ఒక ఉన్నత స్థానం లో నిలవాలంటే సంబంధిత పోటీ పరీక్షలు రాయాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల విద్యార్థులను భవిష్యత్ లో రాయబోయే పోటీ పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి, వారిలో ఆత్మ విశ్వాసం నింపే ఆలోచనతో పలు రకాల ఒలింపియాడ్ పరీక్షలు రాసేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ సంవత్సరం ఇలా పలువురు విద్యార్థులు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించడం ఒక ఆనవాయితీగా మారిందన్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను, విద్యార్థులను ప్రోత్సహించి, ఉత్తమ ర్యాంకులు సాధించేలా కృషి చేసిన మ్యాథ్స్ టీచర్ రజియుద్దీన్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలు శుభ్రంగా ఉంటే ఎలాంటి రుగ్మతలు దరి చేరవని ప్రతి ఒక్కరూ విధిగా తడి పొడి చెత్తను వేరుచేసి మునిసిపల్ వాహనంతో వచ్చిన సిబ్బందికి అందించాలని మురుగు కాలువలలో చెత్త చెదారం వేయవద్దని సూచించారు.

## సత్తాచాటిన 'సరస్వతి'



ప్రజాపక్షం/రామడుగుః శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ నిర్వహించిన టాలెంట్ టెస్టులో మండలంలోని వెలిచాల సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటి పతకాలు సాధించినట్లు స్కూల్ కరెస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. గత నెలలో కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో సరస్వతి హైస్కూల్ విద్యార్థులు రాచకొండ హరిణి ద్వితీయ స్థానంలో ఈగ దేవాన్ష్ తృతీయ స్థానంలో నిలవగా బొల్లబత్తిని రేణుశ్రీ, దైవాల హిమబిందు, చెవెళ్ల అశ్విత్, వరుకోల సాయిస్నిగ్ధ, రాచమల్ల నవనీత, పెద్దిగారి అభిషేక్, మెట్టి క్రిష్ కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం వరంగల్ జిల్లాలోని కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో ఫౌండేషన్ నిర్వాహకులు విద్యార్థులు బహుమతులు అందజేసినట్లు వివరించారు. ఎస్ఆర్ఎఫ్ పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులకు స్కూల్ కో కరెస్పాండెంట్ ఉప్పుల సత్యం, టీచర్స్ అభినందించారు.

## ఎంఎల్‌సి అభ్యర్థి ప్రసన్నహరికృష్ణకు న్యాంతబాద్ జనార్దన్ మద్దతు



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి న్యాంతబాద్ జనార్దన్ నామినేషన్ వేయగా అది కొన్ని సాంకేతిక కారణాలతో రిజెక్ట్ కావడంతో ఆయన శనివారం కరీంనగర్‌లో ప్రసన్న హరికృష్ణను వారి ఎన్నికల కార్యాలయంలో కలిసి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యావ్యాపారులకు ఈ ఎన్నికలు గుణపాఠం కావాలనే లక్ష్యంతో తన మద్దతు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల వార్ వన్‌సైడ్ కావాలని పట్టభద్రులు, మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత హరికృష్ణకు అండగా నిలిచి ఆయన గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. పట్టభద్రుల, నిరుద్యోగుల, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రసన్న హరికృష్ణకు పూర్తి అవగాహన ఉందన్నారు. పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కలత చెంది 19 సంవత్సరాల ప్రభుత్వ ఉద్యోగ జీవితానికి రాజీనామా చేసి ఈ ఎన్నికల్లో ముందుకు వచ్చిన ప్రసన్న హరికృష్ణకు అండగా నిలవాల్సిన సమయమన్నారు. ఆయన గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

## 'బిర్లా'లో ఒలంపియా క్రీడా వార్షికోత్సవం



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కరీంనగర్‌లోని బిర్లా పాఠశాలలో ఒలంపియా మొదటి క్రీడా వార్షికోత్సవ వేడుకలు వైభోపేతంగా జరిగాయి. పది రోజుల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కబడ్డీ, క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, స్కేటింగ్, త్రోబాల్, రన్నింగ్ ట్రాక్ వంటి అనేకమైన విజేతలకు ట్రోఫీలు బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ బా ల్యదశలో చదువుతో పాటు అన్ని రంగాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా నచ్చిన రంగంలో రాణిస్తారన్నారు. పాఠశాల విద్యార్థులతో పాటు తల్లిదండ్రులలోక్రీడాస్ఫూర్తినివెలికితీయడం సంతోషదాయకమని పేరెంట్స్ అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, పాఠశాల లోగో ప్రదర్శన అందరినీ అలరించింది. కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవలాల్ జయంతి



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొన్నారు. వినాయక్‌నగర్‌లోని సేవలాల్ మహారాజ్ విగ్రహానికి కలెక్టర్ స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల బాధ్యులు, జిల్లా అధికారులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బోగ్‌బండార్‌లో పాల్గొని నైవేద్యం స్వీకరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్ కుమార్, నాగురావు, అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.

## త్వరలోనే సేవాలాల్ మహరాజ్ దేవాలయానికి స్థలం: వాకిటి



ప్రజాపక్షం/శివ్వంపేట: అతిత్వరలోనే శివ్వంపేటలో శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ దేవాలయానికి స్థలం కేటాయించేందుకు కృషి చేయడం జరుగుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శనివారం శివ్వంపేటలో శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలు గిరిజన నాయకులు రవినాయక్, రాజేందర్‌నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూజలు చేశారు. ఆనాడు గిరిజనులు అన్ని రంగాలలో ఉన్నతస్థాయికి రావాలని చేసిన పోరాటం మరువలేనిదన్నారు. సేవలాల్ మహరాజ్ గిరిజనులకే కాకుండా అన్ని వర్గాల వారికి ఆరాధ్యదైవమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు యాదాగౌడ్, సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మికాంతరావు, నాగేశ్వర్ రావు, చింతస్వామి, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దళితుల భూముల్లో డంప్ యార్డ్ పెట్టింది ఎవరు...?



ప్రజాపక్షం/ హాజీపూర్: ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్ రావు చేస్తున్న అభివృద్ధి పనులను ఓర్చుకోలేక మాజీ ఎంఎల్ఎ దివాకర్ రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గతంలో దళితుల భూముల్లో డంప్ యార్డ్ ఎవరు ఏర్పాటు చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. శనివారం మండలంలోని వేంపల్లి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేంపల్లి మాజీ ఎంపిటిసి డేగ బాపు, చింతపండు శ్రీనివాస్‌లు ,ఐటి, ఇండస్ట్రీయల్ హబ్‌కు భూములు ఇచ్చిన రైతులు మాట్లాడుతూ... మాజీ ఎంఎల్ఎ దివాకర్ రావు దళితుల పై ప్రేమ ఉండే గతంలో దళితుల భూముల్లో 22 ఎకరాల మంచిర్యాల మున్సిపాలిటికి సంబంధించి డంప్‌యార్డు ను ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. డంప్ యార్డ్ వద్దని గ్రామస్తులు సొంత ఖర్చులతో కోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే ఇవ్వడంతో డంప్ యార్డ్ ఆగిపోయిందని తెలిపారు. దివాకర్ రావు హయంలో దళితులుక భూమిలిచ్చి డండ్ యార్డ్ ఏర్పాటుతో ఆ భూములు లాక్కునే ప్రయత్నం చేయలేదా అని విమర్శించారు. ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్ రావు నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక, తన ఉనికి కాపాడుకోవడం కోసం మాజీ ఎంఎల్ఎ దివాకర్ రావు పొంతన లేని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వోలపు రమేష్, డేగ రాజేందర్, మొగిలి తిరుపతి, ఐటి, ఇండస్ట్రీయల్ హబ్‌కు భూములు ఇచ్చిన రైతులు పాల్గొన్నారు.

## సింగరేణి డైరెక్టర్‌ను సన్మానించిన ఎఐటియుసి నాయకులు



ప్రజాపక్షం/ శ్రీరాంపూర్: ఇటీవల నూతనంగా సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్)గా పదవి బాధ్యతలు చేపట్టిన ఎల్వి సూర్యనారాయణ ను ఏరియాలోని జిఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం (ఎఐటియూసి) నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా శనివారం యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్ర, ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కె బాజీ సైదాలు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ సింగరేణి సంస్థలో డైరెక్టర్ (ఆపరేషన్)గా ఎల్వి సూర్యనారాయణ ఎన్నిక కావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. సంస్థ మనుగడ, కార్మికుల సంక్షేమానికి తనదైన శైలిలో పనిచేస్తూ ప్రత్యేకమైన గుర్తింపును పొందాలని కొనియాడారు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శిలు ప్రసాద్ రెడ్డి, సంపత్, బద్రి బుచ్చయ్య,మురళి చౌదరి, మారేపల్లి సారయ్య, సంగం సదానందం, నరసింహరావు, నవీన్ రెడ్డి, విజయలక్ష్మి , సంధ్య,రాజ్ కుమార్, రాజు, సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యంలో అలసత్వం తగదు



ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్: ప్రజా ఆరోగ్య విషయంలో సిబ్బంది ఆలసత్వంగా ఉండకూడదని, డివిజన్ల వారిగా సమస్యలను ఎప్పటికప్పుడు సమన్వయంతో అన్ని విభాగాలు సకాలంలో పనులను పూర్తి చేయాలని నిజామాబాద్ మునిసిపల్ కమిషనర్ ఎస్ దిలీప్ కుమార్ అన్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్, పారిశుద్యం, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి నగరంలోని సమస్యలను, వాటి పరిష్కారాలను సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ఇంటి టాక్సులను వంద శాతం వసూలు చేయాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఇంటి టాక్సులు ఎక్కువగా ఉన్నటువంటి బకాయిదారులకు వెంటనే నోటీసును పంపిస్తు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల సమన్వయంతో, స్తానిక సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ జయకుమార్, ఏ.ఇ. శ్రీనివాస్, రాకేష్, సునీల్, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉన్నత భవిష్యత్తు

కలెక్టర్ మనూ చౌదరి



ప్రజాపక్షం/గజ్వేల్: విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనూ చౌదరి పేర్కొన్నారు. శనివారం ప్రజ్ఞాపూర్ శివారులోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల వెనుకబడిన గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు కొత్త డైట్ మెనూ ప్రకారం భోజనవసతి కల్పించాలని, సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. గురుకుల పాఠశాలలో 484మంది బాలికలు విద్యను అభ్యసిస్తుండగా, కావలసిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఇడ్లి పాత్రలు, వంట పాత్రలు కావాలని, తలుపులు కిటికీలు రిపేర్ చేయాల్సి ఉందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గురుకుల భవనాలను ఆయన పరిశీలిస్తూ వంట చేసే సిబ్బందితో మాట్లాడారు. కొత్త డైట్ మెనూ అయితే తప్పనిసరిగా పాటించాలని సామాగ్రి దొరకలేదని సాకులు చెప్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. స్టోర్ రూమ్ లో కాలం చెల్లిన వస్తువులు వాడకూడదనీ సూచించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపిసి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ప్రతి సబ్జెక్ట్ పై పట్టు సాధించాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్ తరచూ మాట్లాడుతుంటే వస్తాయని, సమయం వృధా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులకు అల్ థ బెస్ట్ తెలిపారు.

## కరెంటు కోతలు రైతుల అష్ట కష్టాలు..

ప్రజాపక్షం/లోకేశ్వరం: లోకేశ్వరం మండలంలోని ఆయా గ్రామాలలోని రైతులు సమయానికి కరెంటు లేక అష్ట కష్టాలు ఎదుర్కొంటున్నారు.ఈ సందర్భంగా మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రతిరోజు మూడు గంటల వరకు కరెంటు కోత ఉండడం జరుగుతుందని కరెంటు కోత ఉండడం జరుగుతుందని కరెంటు కోతతో మొక్కజోన్న పంట వరి గంటలకు సాగుకు నీళ్లు అందడం కష్టంగా ఉందని ప్రభుత్వం అధికారులు స్పందించి కరెంటు పోకుండా విద్యుత్ అంతరాయం లేకుండా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎల్లవేళలా కరెంటు ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



## అంగన్వాడీల ద్వారా పిల్లల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు



ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్: అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. శనివారం కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం మార్కెట్ లోని సాక్ష్యం అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మీకంగా సందర్శించి పిల్లల పోషణ,పారిశుధ్యం, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా ప్రతీ అంగన్వాడీ కేంద్రాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించి వారి ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు వసూలు అయిన ఆస్తి పన్ను, జారీ చేయబడిన రెడ్ నోటీసుల వివరాలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు



ప్రజాపక్షం / బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని సబ్ కలెక్టర్ కిరణ్మయి సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జీవితం అందరికి ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో ఏవో విజయ్ కుమార్, హన్మాండ్లు, జగన్ గౌడ్, సంగమేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం

సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



ప్రజాపక్షం/గజ్వేల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యకర్తలు ప్రతి గ్రామాల్లో పోటీ చేయడానికి సన్నద్ధం కావాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. శనివారం రోజున తీగుల్ గ్రామంలోని ఆరుట్ల భవన్ లో జరిగిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 100 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, ఈ వంద సంవత్సరాల కాలంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటూనే పోరాటాలు నిర్వహిస్తూ ఎన్నో విజయాలను, ఎన్నో ఫలితాలను దేశ ప్రజలకు అందించిందని తెలిపారు. పేద ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలని కూడు, గూడు కోసం అనేక పోరాటాల నిర్వహించిందని స్పష్టం చేశారు. దేశంలో ప్రస్తుతం పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశ ప్రజల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయపడుతుందని, ప్రజల ఆర్థిక స్థితిగతులు చిన్నా భిన్నమవుతున్నాయని, పేదరికం పెరిగిపోతుందని, బడా కార్పొరేట్ శక్తులకు ఉన్న ప్రాధాన్యత సామాన్య ప్రజలకు, రైతులకు లేదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితులలో బిజెపి పరిపాలనపై పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి పోరాటాల నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. అదే విధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని గ్రామాలలో పోటీకి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని, ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రజా సమస్యల పరిష్కారమే దిశగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. సిపిఐ రాష్ట్ర నాయకులు బట్టు దయానంద రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీకి లేని చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఉన్నదని, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలుకొని నేటి ప్రత్యేక తెలంగాణ కోసం నిరంతరం సిపిఐ పోరాటం చేసిందని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు పాలకులు అవలంబిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, సీపీఐ వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను గ్రామ గ్రామాన నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జగదేవ్ పూర్ మండల కార్యదర్శి నరసింహ రెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ, నాయకులు స్వర్గం రాజేశం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్ధన్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బేల్దే బిక్షపతి, పోషన్న, సైదులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాల్లో పదో తరగతి చాలా ముఖ్యం

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: విద్యార్థుల జీవితాల్లో పదో తరగతి చాలా ముఖ్యమని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ చాంబర్ నుండి జిల్లా విద్యాశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమని, ఆ దిశగా సహకారించాలని తెలిపారు. వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షలకు ఇంకా 30 రోజుల సమయం మాత్రమే ఉందని, విద్యార్థులు ఇంటి వద్ద కూడా పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా చూడాలని తెలిపారు. పరీక్షల సమయాలలో బయటకు తీసుకెళ్లడం తగ్గించాలని, విద్యార్థులకు వ్యవసాయ పనులు, ఇతర పనులు అప్పగించకూడదని అన్నారు. ప్రభుత్వం తరపున జిల్లా యంత్రాంగం ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, అల్పాహారం, అదనపు తరగతులు నిర్వహించాలని, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకురాకూడదని తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి గమ్మానియల్, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగు

కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి: గుణాత్మక విద్య అందించాలంటే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని అందుకు ప్రభుత్వం కేటాయించిన నిధులను సమర్థంగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. ఐసీసీ సమావేశ మందిరంలో శనివారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ,మండల విద్యాశాఖ అధికారులు ,ఎంపిక చేసిన పాఠశాలల ప్రదానోపాధ్యాయులతో పాఠశాలలు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎం శ్రీ పథకం కింద 44 పాఠశాలలు ఎంపికైనాని ఎంపికైన పాఠశాలల్లో పిఎం శ్రీ పథకం కింద మంజూరైన నిధులతో క్రీడలు నైపుణ్యాభివృద్ధికి వినియోగంచాలని అధికారులకు సూచించారు. సర్వశిక్షాభియాన్ పీఎం శ్రీ పథకం నిధులతో పాఠశాలల అభివృద్ధి పనులు హోలిస్టిక్ గా అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాలో పాఠశాల అభివృద్ధి విద్యాప్రమాణాలను మెరుగుపరిచేలా ఉండాలని కలెక్టర్ సూచించారు. పీఎం శ్రీ పథకం కింద వచ్చిన నిధులను తరగతి గదుల నిర్మాణం ,కిచెన్ గార్డెన్ ,ఫీల్డ్ విజిట్ ,ఎల్ఈడి లైటింగ్ లైబ్రరీ అభివృద్ధి మరుగు దొడ్లు ,తాగునీటి వసతి ల్యాబ్ ఏర్పాట్లు స్పోర్ట్స్ కిట్స్ , వంటి తదితర అభివృద్ధి పనులను వినియోగించాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో అబివృద్ధి పనులు నాణ్యతతో వేగంగా పూర్తి కావాలన్నారు. నిర్ధేశిత కాల వ్యవదిలో పూర్తి చేయాలని ,నిధుల వినియోగం పారదర్శకంగా ఉండాలన్నారు. నిర్ధేశిత కాలవ్యవదిలో పూర్తిచేయాలని, నిధుల వినియోగం పారదర్శకంగా ఉండాలన్నారు. అధికారులు సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ పథకం కింద ప్రాద్యాత గా బాలబాలికలు సురక్షత శుభ్రమైన వాతావరణం కల్పించడం ,పర్యావరణహిత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం టెక్నాలజీ ఆదారిత భోదన అబ్యాస పద్ధతులను అందుబాటులోకి తేవడం క్రీడలు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలను లక్ష్యాలుగా చేర్చడం జరిగిందన్నారు. విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ వెంకటేశ్వర్లు , ఈఈపి ఆర్ జగదీష్, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఎంఈఓలు ,పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ప్రధానోపాధ్యాయులు సంబందిత అదికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## 212 ఎకరాల భూమి కబ్జా

రాజకీయ, బడా నేతల చేతుల్లో డి వన్ భూములు..

పోరాటం కొనసాగిస్తున్న గ్రామస్తులు..




ప్రజాపక్షం/మామడ/నిర్మల్ ప్రతినిధి : శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు కింద ముంపుకు గురైన భూములను రక్షించాలంటూ గ్రామస్తులు గత ప్రభుత్వం కాలం నుండి పోరాడుతూనే ఉన్నారు.అక్రమంగా నకిలీ డి వన్ పట్టాలను సృష్టించి పట్టాలు చేసుకున్నారని అధికారులు,రాజకీయ నేతలు,బడా నాయకులు కుమ్మక్కై భూములను కబ్జా చేసుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిర్మల్ జిల్లా మామడ మండలం లింగంపల్లి గ్రామస్తులు సుమారు 212 ఎకరాల భూమి నకిలీ డి.వన్ పట్టాల తో భూమిని కబ్జాచేశారని ఆరోపిస్తూ తమ గ్రామానికి సంబంధించిన భూములను తమకు అప్పగించాలంటూ పోరాటం కొనసాగిస్తున్నారు.గత ప్రభుత్వంలో న్యాయం జరకగలేదని ఈ ప్రభుత్వ హయాంలో అయినా తమ గ్రామాలకు న్యాయం చేయాలంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు.అయినప్పటీకీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నకిలీ డి వన్ పట్టాల విషయం ఇంతవరకు లెక్క తేలలేదు.

**212 ఎకరాల డి వన్ భూమి కబ్జా..**

అక్రమంగా డి ఎన్ పట్టాలు సృష్టించి అక్రమంగా పట్టా చేసుకున్నారని గ్రామస్తుల ప్రధాన ఆరోపణ.అక్రమంగా పట్టా చేసుకున్న 212 ఎకరాల భూమిని గ్రామానికి అప్పజెప్పాలంటూ అప్పటి నుండి సదరు గ్రామస్తులు పోరాడుతూనే ఉన్నారు.సదరు కబ్జాకు గురి అయిన భూమిని కాపాడాలంటూ గ్రామస్తులు అధికారుల చుట్టూ తిరుగుతున్న ఎటువంటి స్పందన లేదంటూ ఆరోపిస్తున్నారు.వందల ఎకరాల భూమిని అనుభవిస్తున్నారని విమర్శిస్తున్నారు సర్వే నంబర్ 515 లోని దాదాపు 50 ఎకరాల మిగులు భూమిని గ్రామస్తుల అవసరాల దృష్ట్యా ఆ గ్రామానికి పశువులు,గొర్రెలు వాడుకోవడానికి భూమిని కేటాయించడం జరిగిందని దానిని కూడా బడ రాజకీయ నాయకులు డి వన్ పట్టా పేరుతో కబ్జా చేస్తున్నారని,నకిలీ సర్టిఫికెట్స్ సృష్టించి కొందరు రాజకీయ నాయకులు స్వార్థంతో తమ స్వలాభం కొరకు పరోక్షంగా బినామీల పేర్లతో,తమ అనుచరుల పేర్లతో అక్రమంగా పట్టాలు సృష్టించి కబ్జాలను ఎదేచ్ఛగా తమ వర్షం చేసుకోవడానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.18,10, సర్వేలు చేస్తూ అక్రమంగా పట్టాలు చేస్తున్నారని వెంటనే వాటినిన నిలిపివేయాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జిల్లా అధికారులు రాజకీయ నాయకుల కొమ్ముకాస్తున్నారని వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

# ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లిన సర్కార్!

కులగణన పేరుతో మొదటికొచ్చిన ఎన్నికలు

ఏప్రిల్ తర్వాతనే స్థానిక సమరం..

పల్లెల్లో గాడి తప్పిన పాలన ఇంకెన్నాళ్లో ?

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ జిల్లాలోని గ్రామ పంచాయతీల పాలకవర్గాలు లేక పల్లెల్లో పాలన పడకేసింది.అభివృద్ధికి ఆటంకంగా మారింది.సర్పంచ్ పదవీ కాలం ముగిసి ఏడాది దాటినా,ప్రాదేశిక సభ్యుల పదవీ కాలం ముగిసి ఆరు నెలలు దగ్గరికి వస్తోంది.గ్రామాల్లో అధికారుల పాలన కొనసాగుతోంది.అధికారుల పాలనలో గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పన మూలన పడింది.అభివృద్ధి దేవుడు ఎరుగు...పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది.మురుగు కాలువలు కంపు కొడుతున్నాయి.రోడ్లు చెత్తతో నిండిపోయి దుమ్మురేపుతున్నాయి.అడిగేనాథుడు లేక అధికారుల పాలనలో ప్రజలు విసిగి వేసారిపోతున్నారు.కష్టనష్టాలకు ఓర్చి గ్రామాలను తీర్చిదిద్దిన పాలకవర్గాల పనితీరు ప్రజలు వల్లె వేసుకుంటున్నారు.నిజానికి పంచాయతీ పాలకవర్గాలతోనే గ్రామాల్లో వెలుగులు నిండేది.అలాంటి పాలకవర్గాలు లేక నెలలు తరబడి ప్రజలు అసౌకర్యానికి గురువుతున్నారు.ఎప్పుడెప్పుడా అని స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజలు ఆతృతగా ఎదురుచూసూనే వున్నారు.రేపు మాపు అనే సంకేతాలు ఇచ్చిన ప్రభుత్వం ఇక ఇప్పట్లో ఎన్నికలు లేవని స్పష్టం చేయడంతో ప్రజలతో పాటు ఆశావహుల్లో నిరాశను నింపింది.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటన తర్వాత ఇక ఇప్పట్లో ఎన్నికలు లేవని తేటతెల్లం అయ్యింది.కులగణనపై తర్జనభర్జన పడుతున్న సర్కార్ మరో నెల రోజుల గడువు పెంచింది.ఈ నెల 28 వరకు గడువు పెంచినప్పటికి,కనీసం నెల రోజుకు పైనే పడుతుందని అంటున్నారు.జిల్లా వ్యాప్తంగా 400 పంచాయతీలు ఉండగా వార్డులు 3368,ఎంపీటీసీ స్థానాలు 156,జడ్పిటిసిలు 1,ఎంపీపీలు 18,నిర్మల్ జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య నాలుగు లక్షల నలభై వేల 997 ఉండగా పురుషులు రెండు లక్షల పదివేల 146 కాగా మహిళలు రెండు లక్షలు 30 వేల ఎనిమిది వందల ముప్పై ఆరు ఉండగా ఇతరులు 15 మంది ఉన్నారు.పల్లె పాలకులు లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారింది.సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఏడాది దాటినా,ప్రాదేశిక సభ్య పదవీకాలం ముగిసి ఆరు నెలలు దగ్గరికి వస్తుంది.గ్రామాల్లో అధికారుల పాలన కొనసాగుతోంది.అధికారుల పాలనలో గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పన మూలన పడింది.అభివృద్ధి దేవుడు ఎరుగు పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది.మురుగు కాలువలు కంపు కొడుతున్నాయి.రోడ్లు చెత్తతో నిండిపోయి దుమ్మురేపుతున్నాయి.అడిగేనాథుడు లేక అధికారుల పాలనలో ప్రజలు విసిగి పోతున్నారు.నిజానికి పంచాయతీ పాలకవర్గాలతోనే గ్రామాల్లో వెలుగులు నిండేది.అలాంటి పాలకవర్గాలు లేక నెలల తరబడి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.ఎప్పుడెప్పుడా అని స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తూనే వున్నారు.రేపు




మాపు అనే సంకేతాలు ఇచ్చిన ప్రభుత్వం ఇక ఇప్పట్లో ఎన్నికలు లేవని స్పష్టం చేయడంతో ప్రజలతో పాటు ఆశావహుల్లో నిరాశను నింపింది..

ఏప్రిల్ తర్వాతనే స్థానిక సమరం ..

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటన తర్వాత ఇక ఇప్పట్లో ఎన్నికలు లేవని తేటతెల్లం అయ్యింది.కులగణనపై తర్జనభర్జన పడుతున్న సర్కార్ మరో నెల రోజుల గడువు పెంచింది.ఈ నెల 28 వరకు గడువు పెంచినప్పటికి,కనీసం నెల రోజుకు పైనే.



# రోహిత్ శర్మపై వేటు..

## కెప్టెన్‌గా స్టార్ ప్లేయర్!

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ కెరీర్ ముగిసిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం రోహిత్ శర్మ సిద్ధమయ్యాడు. ఈ టోర్నీ అనంతరం అతను అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ టోర్నీ అనంతరమే రోహిత్ శర్మ భవితవ్యంపై క్లారిటీ ఉంది. ఒకవేళ రిటైర్మెంట్ ప్రకటించకపోయినా.. టెస్ట్ ఫార్మాట్‌కు రోహిత్ శర్మ దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి.

### ఘోర పరాజయాలు..

గతేడాదిగా టెస్ట్‌ల్లో రోహిత్ శర్మ దారుణంగా విఫలమయ్యాడు. అటు కెప్టెన్‌గా.. ఇట్టు బ్యాటర్‌గా తేలిపోయాడు. ఎన్నడూ లేని విధంగా ఘోర పరాజయాలను ఎదుర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై మూడు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయ్యింది. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై టీమిండియా వైట్ వాష్ అవ్వడం ఇదే తొలి సారి.

### ఇంగ్లాండ్ పర్యటనకు కెప్టెన్‌గా బుమ్రా..

ఈ ఏడాది జూన్ వరకు టీమిండియాకు టెస్ట్ సిరీస్‌లు లేవు. జూన్‌లో ఐదు టెస్ట్ సిరీస్ కోసం టీమిండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనకు రోహిత్ శర్మ దూరమవుతాడని ఓ వార్త సంస్థ పేర్కొంది. రోహిత్ శర్మ స్థానంలో జస్‌ప్రీత్ బుమ్రాను కెప్టెన్‌గా ఎంపిక చేయాలని అగార్కర్ సారథ్యంలోని భారత సెలెక్షన్ కమిటీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బుమ్రా వెన్ను నొప్పితో భారత జట్టుకు దూరమయ్యాడు. అతను తిరిగి ఐపీఎల్ 2025 సీజన్‌తో రీఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే బుమ్రా తన సారథ్య సామర్థ్యాన్ని చాటుకున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో రెండు టెస్ట్‌ల్లో జట్టును నడిపించి ఒక విజయాన్నందించాడు.

# ఆ ముగ్గురికీ ఛాంపియన్స్ ట్రోఫీనే చివరి ఐసిసి టోర్నీ



ఆకాశ్ చోప్రా

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లితో పాటు స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు ఛాంపియన్స్ ట్రోఫీ 2025నే చివరి ఐసీసీ టోర్నీ అని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ఓ యూజర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆకాశ్ చోప్రా ఈ విషయాన్ని తెలియజేశాడు. ఫిబ్రవరి 19 నుంచి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి తెరలేవనున్న విషయం తెలిసిందే. ఈ టోర్నీ కోసం భారత జట్టు శనివారమే దుబాయ్ బయల్దేరింది.
దాదాపు 8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహిస్తోంది. చివరిసారిగా ఇంగ్లండ వేదికగా 2017లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగ్గా పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఫైనల్లో భారత్‌ను ఓడించి మరి పాకిస్థాన్ టైటిల్ అందుకుంది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా మాత్రమే తాజా టోర్నీలో బరిలోకి దిగుతున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా వెన్ను గాయంతో జట్టుకు దూరమైన విషయం తెలిసిందే.
అయితే ఈ నలుగురిలో ముగ్గురి ఆటగాళ్లకు ఇదే చివరి ఐసీసీ టోర్నీ అవుతుందని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఓ యూజర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వ్యాఖ్యలు చేశాడు. 'మీ అంచనా 100 శాతం నిజం. కోహ్లి, రోహిత్, జడేజాకు ఛాంపియన్స్ ట్రోఫీనే చివరి ఐసీసీ టోర్నీ కానుంది. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ జరగనుంది. ఈ ఫైనల్‌కు భారత్ అర్హత సాధించలేదు.
వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ 2024 జరగనుంది. ఇప్పటికే ఈ ముగ్గురు ఆటగాళ్లు టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఆ తర్వాత 2027లో వన్డే ప్రపంచకప్ జరగనుంది. అందుకు ఇంకా చాలా సమయం ఉంది. కాబట్టి అప్పటి వరకు జట్టులో భారీ మార్పులు రావచ్చు. ఈ క్రమంలోనే కోహ్లి, రోహిత్, జడేజాలకు ఇదే చివరి ఐసీసీ టోర్నీ కానుంది. ఈ ముగ్గురి లోటు లేకుండా టీమిండియా ఆడినప్పుడే ఇది సాధ్యమవుతుంది.'అని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు.

# భారత్ క్రికెటర్లను హగ్ చేసుకోవద్దు

## పాక్ ఆటగాళ్లకు ఫ్యాన్స్ మెసేజ్



ఛాంపియన్స్ ట్రోఫీ నాలుగు రోజుల్లో ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ న్యూజిలాండ్ తలపడనున్నాయి. అయితే ఐసీసీ టోర్నీ ఏదైనా సరే భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే హైప్ వేరు. ఫిబ్రవరి 23న దుబాయ్‌లో జరగనున్న ఈ హైవోల్టేజ్ మ్యాచ్ కోసం యావత్ క్రికెట్ ప్రపంచం ఎదురు చూస్తుంది. ఐసీసీ ఈవెంట్లలో పాక్‌పై ఆధిపత్యం చెలాయిస్తున్న భారత్ ఛాంపియన్స్ ట్రోఫీలోనూ అదే రిపీట్ చేయాలని భావిస్తోంది. మరోవైపు ఈసారి ఎలాగైనా తమ జట్టు భారత్‌ను ఓడించాలని పాక్ అభిమానులు గట్టిగా కోరుకుంటున్నారు. అలాగే పాకిస్తాన్ గడ్డపై మ్యాచ్ అడేందుకు బీసీసీఐ ఒప్పుకోకపోవడం వల్ల ఆ దేశ అభిమానులు నిరాశ చెందారు. దీంతో పాక్ ప్లేయర్లకు అక్కడి ఫ్యాన్స్ బలమైన సందేశం పంపించారు. భారత్‌తో మ్యాచ్ సందర్భంగా వాళ్లతో ఫ్రెండ్‌షిప్ పక్కనపెట్టాలని హెచ్చరించారు. అలాగే విరాట్ కోహ్లి సహా, టీమ్‌ఇండియా ప్లేయర్లెవరినీ కూడా హగ్ చేసుకోవద్దని చెప్పారు. ఈ మేరకు పాక్ జర్నలిస్ట్ ఒకరు సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్టు చేశారు. ప్రస్తుతం ఇది వైరల్‌గా మారింది.



# మాస్ పోస్టర్‌తో 'విశ్వంభర' అప్డేట్

మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రం విశ్వంభర కోసం అందరికీ తెలిసిందే. మరి ఎన్నో అంచనాలు ఉన్న ఈ చిత్రాన్ని దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తుండగా చాలా కాలం తర్వాత చిరు నుంచి ఒక స్ట్రెయిట్ సినిమా అలాగే ఫాంటసీ జానర్ లో వస్తుండడంతో అభిమానులు ఎగ్జైటెడ్‌గా ఉన్నారు. అయితే ఈ సినిమాపై ఓ క్రేజీ న్యూస్ బయటకి వచ్చింది. ఈ సినిమాలో ఒక పవర్ఫుల్ సాంగ్ ని మెగాస్టార్ ఎంట్రీ సాంగ్‌గా కీరవాణి కంపోజ్ చేసినట్టుగా మేకర్స్ ఇపుడు రివీల్ చేశారు. ఇక దీనిపై ఇచ్చిన పోస్టర్ అయితే అదుర్స్ అని చెప్పాల్సిందే. పక్కా మాస్ లుక్ లో దర్శనం ఇస్తూ చిరు తన అభిమానులకి ట్రీట్ ఇచ్చేలా ఉన్నారని చెప్పొచ్చు. మరి ఈ సాంగ్‌ని శోభి మాస్టర్ కంపోజ్ చేస్తుండగా ఇందులో మంచి స్టెప్పులు కూడా ఉంటాయని తెలుస్తుంది. మొత్తానికి మళ్ళీ మెగా ఫ్యాన్స్‌లో విశ్వంభర కొత్త ఊపు తీసుకొస్తుంది అని చెప్పాలి.



# ఆలియా భట్‌తో నాగ్ అశ్విన్ మూవీ?

టాలీవుడ్ దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి 2898 ఏడి' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాలో ప్రభాస్ హీరోగా నటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉండనుండటంతో కల్కి సీక్వెల్ చిత్రం ఎప్పుడెప్పుడు వస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే ఇప్పుడు నాగ్ అశ్విన్ ఆర్ఆర్ఆర్ బ్యూటీ ఆలియా భట్‌తో ఓ సినిమా చేసేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆలియా భట్‌కు ఓ స్టోరీలైన్ చెప్పాడని.. ఆమె ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. కల్కి సీక్వెల్ మూవీ ప్రారంభం కావడానికి సమయం పడుతుండటంతో నాగ్ అశ్విన్ ఈ నిర్ణయం తీసుకున్నాడట. ఇక ఈ సినిమాతో ఆలియా భట్ మరోసారి తన సత్తా చాటేందుకు సిద్ధమవుతుందట. మరి ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని అభిమానులు ఆసక్తిగాచూస్తున్నారు.

# వరల్డ్ వైడ్ 'ఛావా' భారీ కలెక్షన్స్



లేటెస్ట్‌గా బాలీవుడ్ సినిమా దగ్గర భారీ అంచనాలు నడుమ రిలీజ్ కి వచ్చిన సినిమా ఏదన్నా ఉంది అంటే అది విక్కీ కౌశల్ అలాగే రష్మిక మందన్నా కలయికలో దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన ఈ సినిమా శివాజీ మహారాజ్ తనయుడు పోరాట యోధుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించబడిందని తెలిసిందే. మరి మొదటి నుంచి కూడా సాలిడ్ హైప్ ఉన్న ఈ సినిమా ఈ వైలెంటైన్స్ డే నాడు వరల్డ్ వైడ్ సాలిడ్ ఓపెనింగ్స్ అందుకున్నట్టుగా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. మరి ఒక్క ఇండియా వైడ్ గా 33 కోట్లకి పైగా నెట్ వసూళ్లు అందుకున్న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా 50 కోట్లకి పైగా గ్రాస్ అందుకున్నట్టుగా మేకర్స్ తెలిపారు. దీనితో బాలీవుడ్ నుంచి మరో 50 కోట్ల ఓపెనింగ్స్ అందుకున్న సినిమాగా ఇది నిలిచింది అని చెప్పాలి. మరి ఈ వీకెండ్ లో వసూళ్లు ఏ రేంజ్ లో ఉంటాయో చూడాలి.



కామ్రేడ్ బొమ్మగాని ధర్మ భిక్షం 103వ జయంతి సభ మంగళవారం ఆంధ్రప్రదేశ్ మంగళగిరిలో కంచర్ల కాశయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా సిపిఐ ఎపి రాష్ట్ర సహాయ కార్యదర్శి పుప్పాళ్ల నాగేశ్వరావు, మరో అతిథి తెలంగాణ రాష్ట్ర గీత పనివారి సంఘం రాష్ట్ర కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్, మామిడిశెట్టి లక్ష్మీ గణపతి, చేతివృత్తుదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు. రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షులు శంకరరావు, తాతా సాంబశివరావు తదితరులు మాట్లాడారు.

# చిలక జ్యోతిష్యం చెబుతున్న ఎర్రబెల్లి దయాకర్ రావు

## ఫామ్‌హౌస్ నుంచి కెసిఆర్ ఎప్పుడు బయటికి వస్తారో చెప్పాలి : ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చిలక జ్యోతిష్యం తెలిసినా ఎర్రబెల్లి దయాకర్ రావు ఎన్నికల్లో ఎందుకు గెలవలేకయ్యారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎర్రబెల్లికి అంతా జ్యోతిష్యం తెలిస్తే ఫాంహౌస్‌లో పడుకున్న వాళ్ల పార్టీ అధినేత కె.చంద్రశేఖరరావు ఎప్పుడు లేస్తాడో చెప్పాలని ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫార్ములా ఈ రేస్ కేసు లోమాజీ మంత్రి కెటిఆర్ ఎప్పుడు జైలుకు వెళ్ళుతారో కూడా చెప్పాలన్నారు. 40ఏళ్లు రాజకీయాల్లో ఉండి చిన్న అమ్మాయి చేతిలో చిత్తు గా ఓడిపోయినా ఎర్రబెల్లికి సిగ్గు రాలేదని, బిఆర్‌ఎస్ లో ఉన్న ఆయనకు కాంగ్రెస్ విషయాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. తమ పార్టీ ఎంఎల్‌ఎల గురించి ఎర్రబెల్లి ఆలోచించాల్సిన అవసరం లేదని, ఇప్పటికే మీ వాళ్లు10 మంది పార్టీని వీడారని, మిగిలిన వారినైనా కాపాడుకో అని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ను ఓర్వలేకనే ఎర్రబెల్లి విమర్శలు చేస్తున్నారని ఆది శ్రీనివాస్ విమర్శించారు. కులగణన,ఎస్‌సివర్గీకరణ ఒకేసారి చేసిన ప్రభుత్వం తమదని, ఈ ప్రభుత్వం స్థిరంగా ఉంటుందని పేర్కొన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తునా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఇవి కనిపించడం లేదన్నారు. కేంద్ర మంత్రి హోదాలో ఉండి రాహుల్ గాంధీ పైన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ప్రధాన మంత్రి మోదీ కులంపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా చులకన గా మాట్లాడలేదని, కేంద్ర మంత్రే బండి వక్రీకరించి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

# మోదీ కులం గురించి రేవంత్ రెడ్డి తప్పుగా మాట్లాడలేదు : మహేష్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ కులం గురించి తప్పుగా మాట్లాడలేదని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా కూడా అంగీకరించారని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మోదీ కులాన్ని 1994 ఆగస్టు 24న ఒసి నుంచి ఒబిసిలో చేర్చారని స్పష్టం చేశారు. బిసిల పట్ల బిజెపికి చిత్తశుద్ధి ఉంటే జన గణనతో పాటు కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తయిన తర్వాత, చట్టం చేస్తామన్నారు. 9వ షెడ్యూల్ చట్ట సవరణ చేసి, దేశంలోని బిసిలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మేలు చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ కులం అడుగుతున్న బిజెపి నాయకులు, కేంద్ర మంత్రులు, దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి, అందులోభాగంగా రాహుల్ ఇంటికి వెళ్లి పూర్తి వివరాలను సేకరించవచ్చని సూచించారు. గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను బిజెపి నాయకులు మర్చిపోయి మాట్లాడుతున్నారని, దేశం కోసం బిజెపి నాయకులు ఏం త్యాగం చేశారని నిలదీశారు. సోనియా గాంధీ ఇటలీలో పుట్టినప్పటికీ భారతీయతను పుణికి పంచుకున్నారన్నారు. కేంద్ర మంత్రి స్థాయిని మర్చిపోయి బండి సంజయ్ మాట్లాడుతున్నారని, భారతదేశం అంటే సెక్యులర్ దేశమనే విషయాన్ని బండి సంజయ్ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. బండి సంజయ్ పుట్టుకతో ఒబిసి అని, కానీ మోదీ పుట్టుకతో బిసి కాదని చెప్పారు. బండి సంజయ్ కష్టపడి పని చేసినప్పటికీ ఎన్నికల సమయానికి ఆయనను బిజెపి పక్కన పెడుతోందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే డిల్లీ స్కాము బయట పడిందని, పింక్ బుక్ ఓపెన్ చేస్తే ఇంకా ఎన్ని స్కాములు బయట పడతాయో తెలియదని కవితనుద్దేశించి వ్యాఖ్యానించారు.

# సైబర్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం మేఘా కంపెనీ తనకు అవసరమైన ఎక్విప్మెంట్ కోసం నెదర్లాండ్స్ కి చెందిన ఓ కంపెనీకి ఆర్డర్స్ ఇచ్చారు. ఆ కంపెనీకి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లింపులు చేశారు.చెల్లింపుల తర్వాత ప్రతిసారి కన్ఫర్మేషన్ మెయిల్ వచ్చేది. అయితే ఇక్కడే ఆ కంపెనీ లాగానే ఈమెయిల్లో ఒక అక్షరం మార్చి.. కొన్ని కారణాలవల్ల మీరు పంపించే అకౌంట్ పనిచేయడం లేదు మరో అకౌంట్ కి డబ్బులు చెల్లించాలంటూ మేఘా కంపెనీకి సైబర్ నేరగాళ్లు మెయిల్ పంపించారు.అది నిజమని నమ్మి రూ.5.47కోట్లను రెండు విడతలు గామేఘా కంపెనీ చెల్లించింది.అదే కంపెనీ నుండి(అసలు కంపనీ)మరో మెయిల్..డబ్బులు ఇంకా చెల్లించలేదని రావడంతో.. మోసపోయామని గ్రహించి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో మేఘా కంపెనీ ఫిర్యాదు చేసింది. సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అతిథి అలిగిందా?

(మొదటి పేజీ తరువాయి)

ఉండే కాళ్లు, పెద్దపెద్ద రెక్కలు, నారింజరంగులో బారు ముక్కు, తల గూలాబి రంగులో, కాళ్లు,తోక బాగం, రెక్కలు, నలుపు, దేహం తెలుపుతో ముచ్చు గొల్పుతాయి. సైబీరియా అత్యంత శీతల ప్రదేశం కావడంతో కొంగలు అక్కడ సంతానోత్పత్తికి ఆ టంకం ఏర్పడుతుండటుంది. దీంతో ఇక్కడికి వచ్చి చింతచెట్లపై ఆడ, మగ కలిసి గూళ్లను ఏర్పాటు చేసుకుని గుడ్లను పెట్టి పొదిగి పిల్లలను చేస్తాయి. పొరపాటున ఈ గూళ్లలోకి ఇతర మగ కొంగ వస్తే దానితో ఇందులోని మగ కొంగ తీవ్రస్థాయిలో ఘర్షన పడి దానిని వెల్లగొడుతుంది. అటు తర్వాత అవి ఏర్పాటు చేసుకున్న గూడును ఆడ,మగ కొంగలు విడిచివెలతాయి. వేరే గూడును ఏర్పాటు చేసుకుని,ఆడ కొంగ గుడ్లను పొదుగుతుంటే మగ కొంగ దానికి ఆహారం, నీటిని తీసుకువస్తూ రక్షణగా ఉంటుంది. పిల్లలు పుట్టిన తర్వాత వాటి ఆలన, లాలన ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఎండ వేడి తగలకుండా తమ పొడవాటి రెక్కలను అడ్డుగా ఉంచుతాయి. కుతికలో నీటిని దాచుకుని, అరకేజీపై బడిన చేపను నోట కరుచుకుని తెచ్చి పిల్లలకు అందిస్తాయి. పిల్లలు ఎదిగిన తర్వాత తమతో పాటు ఎంతదూరమైన ఎగరగలవు అని నిర్ధారించుకుని. సరిగ్గా ఆరు మాసాల అనంతరం తమ పిల్లలతో చింతపల్లిక్కి ప్రణమిల్లుతూ తమ దేశానికి తిరుగు ప్రయాణమవుతాయి. ఈ క్రమంలో కొంగలు ఏర్పాటు చేసుకున్న గూళ్లను సైతం తొలగించిమరి వెళ్లిపోతాయి.

### చిన్నబోయిన చింతపల్లి..

సైబీరియా నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడకు చేరుకునే కొంగలకు ఎటువంటి ప్రాణ భయం లేకుండా గ్రామస్థులే కట్టుబాట్లు విధించుకున్నారు. కొంగలు పొలాల్లో, చెరువు గట్లపై వాలినప్పుడు వాటికి హాని తలపెట్టడం, గూళ్లపై వాలినప్పుడు వాటిని పట్టుకోవడం, చంపడం భయభ్రాంతులకు గురిచేయడం, వేటాడి భూజించడం వంటివి ఎవరు చేసిన గ్రామ బహిష్కరణ చేస్తారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఇటువంటి చర్యలకు పాల్పడితే దేహశుద్ధి చేసి మరీ పోలీసులకు అప్పగిస్తారు. తమ ఊరికి పురుడుపోసుకోవడానికి ఆడబిడ్డలే కాన్పుకువస్తాయిని భావించి ప్రత్యేక రక్షణ కల్పిస్తారు. కొంగలు రాకుంటే అశుభంగా భావించే ప్రజలు ఆ సెంటిమెంట్‌తో కరువు వస్తుందేమోనని ప్రస్తుతం కలవరం చెందుతున్నారు.

### రక్షణ చర్యలు శూన్యం...

2017నుంచి తమ ఆధీనంలోకి తీసుకొని ఏకో టూరిజంగా గుర్తిస్తూ అటవీశాఖ ఆధ్వర్యంలో బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. అలాగే ఫారెస్ట్ తరుపున పర్యటకులు, ప్రభుత్వ ఆఫీసర్లకు కొంగల విషిష్టతను తెలిపేందుకు రామకృష్ణ అనే యువకుడిని గైడ్‌గా నియమించారు. 2019లో బర్డ్స్ ఫెస్టివల్ చేసి 2కె రన్‌ను నిర్వహించారు. వీటన్నింటిని డిఎఫ్ఓ సునీల్‌కుమార్ హిరేమత్ ప్రత్యేక దృష్టి ద్వారా జరిపించారు. అంతేకాకుండా కోతులను పట్టుకునేందుకు క్యాచ్చర్‌ను ఏర్పాటు చేశారు. ఒకవేళ చెట్టుపైన నుంచి పడిన పక్షులకు గైడ్ చికిత్స సాయం అందిచేవాడు. కానీ 2021లో ఆ డిఎఫ్ఓ బదిలిపై వెళ్లడంతో అధికారులు పట్టించుకోలేదు. దీంతో కొంగల రక్షణ కల్పించడం, చర్యలను చేపట్టడంలో జాప్యం వహిస్తునేఉన్నారు.

### అధికారులు పట్టించుకోలేదు..

తోట బిక్షమ య్య, సిపిఐ నాయకులు(గ్రామస్థుడు) అటవీ అధికారులు కొత్తలో ఏదో హడావుడి చేసి, అటు తర్వాత పట్టించుకోలేదు. దీంతో కోతులు విపరీతంగా పెరిగి గూళ్లలోని వాటి గుడ్లను పగల గొట్టుకునే తాగేవి. చెట్లపైనే ఉంటూ గూళ్లపై కొంగలను వాలకుండా భయభ్రాంతులకు గురి చేసేవి. ఇండ్లపైన ఉన్న చెట్లమీద కొంగలు ఉండటంతో రెట్ట వేసి వాసన వచ్చేది. అధికారులు శానిటేషన్ చేపించేవారు కాదు. ఇలా అధికారుల తప్పిదాలతో కొంగలు దూరం అయ్యాయి.

# పోరాట యోధుడు

(మొదటి పేజీ తరువాయి)



చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తకెళ్లపల్లి శ్రీనివాస రావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మగ్రి వెంకటస్వామి, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, తెలంగాణ రాష్ట్ర గీత పని వారాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలుగౌడ్, రాష్ట్ర సమన్వయ అధ్యక్షులు నాగ భూషణం, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్, హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ ధర్మబిక్షం అంటేనే మిలిటెంట్ ఉద్యమాలకు పెట్టింది పేరని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన కీలక భూమిక పోషించిన ధీర కమ్యూనిస్టు అని కొనియాడారు. కులాల పేరుతో కాకుండా చేతి వృత్తిదారులైన బిసి, ఎస్‌సి అణగారిన వర్గాలలో చైతన్యం రగిలించి వారి అభ్యున్నతికి బాసటగా నిలిచారని చెప్పారు. సూర్యపేట కేంద్రంగా ఆనాడే హాస్టళ్లను తెరిచి అనేక మందికి చదువుకునేందుకు అవకాశం కల్పించారని, ఆయన శిష్యులే అన్ని రాజకీయ పార్టీల్లో ప్రస్తుతం కీలక నేతలుగా ఉన్నారని తెలిపారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ధర్మబిక్షం వ్యక్తి కాదని ఒక సంస్థ అని అన్నారు. ధర్మబిక్షం ఎంపిగా, ఎంఎల్‌ఏగా ప్రజా నేతగా ఎంత ఎత్తుకు ఎదిగిన ఒదిగే ఉన్నారని, ఆయన తాడిత, పీడిత ప్రజల కోసం చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. పశ్యపద్మ మాట్లాడుతూ ధర్మబిక్షం తన జీవితాంతం పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప నాయకుడని నివాళ్లు అర్పించారు. తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ మహానాయకులు ధర్మబిక్షం ఆశయాలను కొనసాగించడమే లక్ష్యంగా తాము ముందుకు సాగుతామని, దానిని సాధించడమే ఆయనకు తాము ఇచ్చే నివాళ్లి అని అన్నారు. మగ్రి వెంకట స్వామి మాట్లాడుతూ ఓ రాజకీయ నాయకుడు అంటే ఏలా ఉండాలో విలువలను నేర్పిన నాయకుడు ధర్మబిక్షం అని అన్నారు. సాయిల్ గౌడ్ మాట్లాడుతూ గీతపనివారాల కోసం అవిశ్రాంత పోరాటాలను నిర్వహించి, వారికి అనేక హక్కులను సమకూర్చిపెట్టిన గొప్ప నాయకులు ధర్మబిక్ష అని కొనియాడారు. సృజనా మాట్లాడుతూ ఉద్యమాలకు నిలువుట్టద్దం ధర్మబిక్షం అని ఆయన చూపిన పోరాట మార్గంలో పయాణించడమే కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా తమ కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, దళిత హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి మారుపాక అనిల్ ,ఆర్‌టిసి మాజీ ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ బి.వేణు, ఇసిఐఎల్ ఆఫీసర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు విష్ణుమూర్తి తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి జనరల్ సెక్రెటరీ పల్లె నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

**ప్రజల కోసం పోరాడిన మహనీయుడు : పల్లా**

దేశ విముక్తితో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజల కోసం పోరాటం చేసినా గొప్ప వ్యక్తి కామ్రెడ్ ధర్మక్షం అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దులాపూర్‌మెట్ సిపిఐ మండల కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మబిక్షం 103వ జయంతి వేడుకలకు ఆయన హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంతో రైతులకు భూ పోరాటంతో 4500 ఎకారల భూమిని పేదలకు పంపిణీ చేశారని గుర్తు చేశారు. గీత కార్మికుల కోసం సంఘం పెట్టి వారి హక్కుల కోసం శాసన సభ్యులుగా పోరాటం చేశారని తెలిపారు. ఆయన పోరాటం ఫలితంగా గీత కార్మిక సంఘలకు తాటి, ఈత వనం పెంచుకునేందుకు 5 ఎకరల స్థలం ప్రభుత్వం కేటాయిస్తూ జివో తెచ్చిందని గుర్తుచేశారు. నిరాడంబరంగా ప్రజల కోసం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరతరం పోరాటం చేసినా ఆయన అశయల కోసం ప్రతి ఒక్కరు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సీనియర్ నాయకులు ఉజ్జని రత్నాకర్ రావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు మత్యాల యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్షణ్, జిల్లా సమితి సభ్యులు ఆజ్మీర్ హరి సింగ్ నాయక్, కేతరాజు నర్సింహ్మా, మండల పార్టీ నాయకులు దాసరి ప్రసాద్, యదగిరి, చందన, రవి, రమేష్‌లు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com